

www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 265

గురువారం | 9-1-2025 | పేజీలు: 14

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: దశమి మ. 12.23 తదుపరి ఏకాదశి; నక్షత్రం: భరణి మ. 3.07 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా. 2.26-3.56; దుర్ముహూర్తం: ఉ. 10.31-11.16, మ. 2.56-3.40; అమృతఘడియలు: ఉ. 10.35-12.05; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.53

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


టోకెన్ల కేంద్రం వద్ద తోపులాట దృశ్యం



పెను విషాదం!

వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో అపశ్రుతి

'తిరుమల' చరిత్రలోనే కనీవినీ ఎరుగని విషాదం చోటుచేసుకుంది! రద్దీ సమయాల్లో తొక్కిసలాటలు జరగడం సాధారణమే అయినప్పటికీ... తొలిసారిగా, ఆ దశ దాటి భక్తుల మరణాలూ చోటు చేసుకున్నాయి. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనుండగా... తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ జారీ కౌంటర్ మృత్యు వేదికయింది. సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు.. తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో ఏకంగా 90 టోకెన్ జారీ కౌంటర్లను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి ఇలా గేట్లు తెరవగానే అలా భక్తులు ఒక్కసారిగా దూసుకురావడంతో.. పలుచోట్ల తొక్కిసలాట జరిగింది. అందులో.. బైరాగిపట్టెడ కేంద్రం వద్ద పరిస్థితి మరింత విషమించింది. రద్దీలో ఇరుక్కుపోయిన భక్తులు ఊపిరాడక అల్లాడిపోయారు. మహిళలు మరింత విలవిలలాడారు. ఈ విషాదంలో ఆరుగురు మరణించగా.. వారిలో ఐదుగురు మహిళలే. తొక్కిసలాటలో పెద్దసంఖ్యలో భక్తులు గాయపడ్డారు. వారికి తిరుపతిలోని స్విమ్స్, రుయా ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తొక్కిసలాటల్లో గాయపడటం వంటి ఘటనలు జరిగినప్పటికీ.. మరణాలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. టీటీడీ చరిత్రలోనే ఇది మాయని మచ్చలా మిగిలిపోనుంది!

బైరాగిపట్టెడ కేంద్రంలో తీవ్ర తొక్కిసలాట

ఆరుగురి మృతి

పెద్దసంఖ్యలో భక్తులకు గాయాలు

క్యూల్లోకి అనుమతించడంతో దూసుకొచ్చిన భక్తులు

ఒత్తిడి తట్టుకోలేక ఊడి, తెరుచుకున్న గేటు

ఒక్కసారిగా తొక్కిసలాట... నలిగిపోయిన భక్తులు

టీటీడీ చరిత్రలోనే తొలిసారిగా ఇలాంటి దుర్ఘటన


క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

సమగ్ర కథనాలు 14లో

తొక్కిసలాటలో చిక్కుకున్న ఓ అభాగ్యురాలి దుస్థితి

తీవ్రంగా కలిచివేసింది

సీఎం చంద్రబాబు ఆవేదన.. ఉన్నతాధికారులతో సమీక్ష

సమన్వయ లోపంపై అసహనం.. అధికారుల తీరుపై ఆగ్రహం

తిరుపతికి హుటాహుటిన ముగ్గురు మంత్రులు.. నేడు సీఎం రాక

టోకెన్లతో తంటా!.. వైసీపీ హయాంలో కొత్త పద్ధతి

పదిరోజులు వైకుంఠ ద్వార దర్శనం.. టోకెన్ల జారీ కేంద్రాలు ఏర్పాటు.. 2022 నుంచి ప్రతిసారీ తొక్కిసలాటే

తొక్కిసలాట ఘటన బాధాకరం: ప్రధాని మోదీ, రాహుల్

ఆంధ్రాకు అండ

మీ సంకల్పానికి మా సహకారం.. ప్రధాని భరోసా


విశాఖ రోడ్ షోలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభివాదం.. జనం పూలవర్షం

ఆంధ్రుల ఆశయాల సాధనకు తోడ్పడతాం

బాబు 'విజన్ 2047'కు సంపూర్ణ మద్దతు

ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాలకు ఏపీ కేంద్రంగా మారుతోంది

ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి కేంద్రం మద్దతిస్తుంది

దేశంలో రెండు హైడ్రోజన్ హబ్‌లు.. ఏపీలో ఒకటి

దక్షిణ మధ్య రైల్వే జోన్‌తో రాష్ట్ర ప్రగతికి ఊతం

విశాఖ సభలో ప్రధానమంత్రి మోదీ భరోసా

రూ.2.08 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఆశయాల సాధనకు కేంద్రంలోని తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. చంద్రబాబు 'విజన్-2047'కు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. వరుసగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తొలిసారి విశాఖపట్నానికి వచ్చిన మోదీ రూ.2.08 లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. విభజన హామీల్లో కీలకమైన విశాఖపట్నం రైల్వేజోన్‌తోపాటు గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్‌లకు శంకుస్థాపన చేశారు. పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ

మిగతా 13వ పేజీలో...

రోడ్‌షో అదుర్స్

పూలవానతో ప్రధానికి జనం జేజేలు

అపూర్వ ఆదరణకు పులకించిన మోదీ

చెరో పక్కన చంద్రబాబు, పవన్

భారీ జనసందోహంతో కిక్కిరిసిన రహదారి




విశాఖ వేదిక నుంచి గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీల హర్షధ్వానాల మధ్య పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని మోదీ

అభివృద్ధి అంటేనే ఆంధ్రా అనేలా ముందుకు వెళుతున్నాం

వైసీపీ చీకటిపాలన నుంచి వెలుగులోకి.. కూటమిపై ప్రజలు నమ్మకముంచారు

ఫలితంగానే 2 లక్షల కోట్ల ప్రాజెక్టులు.. మోదీ, బాబు నేతృత్వంలో అభివృద్ధి పథంలోకి

వారిద్దరి నుంచి నేర్చుకుని పనిచేస్తున్నా.. విశాఖ సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

13

ఏపీకి ఊపిరి అందించారు

అవసరమైన నిధులిచ్చి ప్రధాని ఆదుకుంటున్నారు

భారత్ వైపు ప్రపంచం చూసేలా చేసిన ఘనత మోదీదే

వికసిత్ భారత్ స్ఫూర్తితో స్వర్ణాంధ్ర-2047

హామీల అమలుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు: లోకేశ్

అన్నీ జయాలే!

సుపరిపాలనతో సంక్షేమం.. అభివృద్ధి

మంచి ప్రభుత్వాన్ని నిరంతరం కొనసాగించాలి

విధ్వంస పాలకులతో లక్ష్యాలు చేరుకోలేం

మోదీ, నేను, పవన్ కలయిక సూపర్ హిట్

ఈ కాంబినేషన్ ఇకపైనా కొనసాగుతుంది

ఒకే రోజు 2 లక్షల కోట్లకు పైబడిన ప్రాజెక్టులు

రాష్ట్ర ప్రజల తరపున ప్రధానికి ధన్యవాదాలు

మోదీ మద్దతుతో అమరావతి పూర్తిచేస్తాం

రాష్ట్ర ఆర్థిక రాజధానిగా విశాఖపట్నం

అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి: చంద్రబాబు

సూపర్ సిక్స్ అమలు చేస్తాం.. 20 లక్షల ఉద్యోగాలు మా బాధ్యత.. విశాఖ సభలో సీఎం

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): "మంచి చేసే ప్రభుత్వాన్ని కొనసాగించాలి. ప్రజలు అండగా ఉండాలి. మధ్యలో వచ్చే విధ్వంస పాలకులతో లక్ష్యాలను చేరుకోలేం. ప్రజల నిరంతర మద్దతుతో ఎలాంటి సుపరిపాలన ఇవ్వగలమో మోదీ నిరూపించారు. ఎన్డీయే బలంగా ఉంటే భారత్ బలంగా ఉంటుంది. కూటమి బలంగా ఉంటే ఆంధ్ర రాష్ట్రం బలంగా ఉంటుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం విశాఖపట్నం వేదికగా...

మిగతా 13వ పేజీలో...

ఇంటర్ విద్యలో సంస్కరణలు

నాలుగు కీలక మార్పులకు ప్రతిపాదనలు

ఇకపై రెండో సంవత్సరంలోనే బోర్డు పరీక్షలు

ఫస్టియర్ పరీక్షల నిర్వహణ బాధ్యత కాలేజీలకే

వచ్చే ఏడాది నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు

ఎంపీసీ, బైపీసీ కలిపి కొత్తగా ఎంబైపీసీ

ఒకే సబ్జెక్టుగా గణితం.. బోటనీ, జువాలజీ కలిపి బయాలజీ.. అదనంగా ఆప్షనల్ సబ్జెక్టు

ప్రతి సబ్జెక్టులోనూ ఇంటర్నల్స్/ ప్రాక్టికల్స్

మొత్తంగా 500 మార్కులకే బోర్డు పరీక్షలు

పాఠ్యపుస్తకాలు, సిలబస్ సవరణలపై అభిప్రాయాలు, అభ్యంతరాలు పంపండి

వాటి ఆధారంగా తుది నిర్ణయం తీసుకుంటాం

ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా ప్రకటన

3

ఇవేం హాస్టళ్లు?

ఆ ఐదేళ్లలో కనీసం 20 కోట్లు కూడా ఖర్చు చేయలేదు

నాటి జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై హైకోర్టు ఆగ్రహం

సాంఘిక, గురుకుల హాస్టళ్ల దుస్థితిని ఊహించగలం

ఈ ఆర్థిక సంవత్సరం ఎన్ని నిధులిచ్చారు?

వసతుల మెరుగుకు ఎన్ని నిధులు కావాలి.. చెప్పండి?

సోషల్ వెల్ఫేర్ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌కు ఆదేశం

హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థలకు నిర్దేశం



అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, అంబేడ్కర్ గురుకుల సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం నామమాత్రంగానే నిధులు విడుదల చేసిన తీరుపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. గత ప్రభుత్వం 2019-2024 మధ్య కాలంలో

మిగతా 12వ పేజీలో...


విక్రాంత్‌రెడ్డి

బెదిరించింది విక్రాంత్‌రెడ్డి!

వాటాలు రాయకుంటే కుటుంబం జైలుకు పోతారన్న వైవీ కుమారుడు

జగన్ ఆదేశమంటూ భయపెట్టారు.. ఈడీకి వెల్లడించిన కేవీ రావు

హైదరాబాద్‌లో ఆయన వాంగ్మూలం నమోదు చేసిన అధికారులు

12 ప్రశ్నలతో సమాచారం రాబట్టిన ఈడీ.. 8 గంటలకుపైగా విచారణ


కేవీ రావు

నా వాటాల విలువ రూ.3,600 కోట్లు.. కేవలం 506 కోట్లకే లాక్కున్నారు

ఆడిట్ రిపోర్టులు సమర్పించిన కేవీ రావు.. లావాదేవీలు, అగ్రిమెంట్ పత్రాలు కూడా..

ఫోన్ కాల్స్, చాటింగ్ వివరాలూ!. మళ్లీ విజయసాయిరెడ్డికి పిలుపు?

2

సజ్జల భార్గవరెడ్డి చెబితేనే చేశా!

2

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టా

భవిష్యత్తు, పార్టీ అండ ఉంటుందని హామీ ఇచ్చారు

కానీ, మా పేరు చెప్పి భార్గవే సొమ్ములు కొట్టేశారు

పోలీసుల విచారణలో వర్రా రవీంద్రరెడ్డి వెల్లడి!

రోడ్డు ప్రమాద బాధితులకు

ఉచిత చికిత్స

వారంపాటు 1.5 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది



'హిట్ అండ్ రన్' కేసుల్లో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం: గడ్కరీ

2

ట్రంప్ విస్తరణ కాంక్ష!

కెనడా, గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను అమెరికాలో విలీనం చేసుకుంటామని ప్రకటన



మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తానని ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్య

2

ఐరోపా జోలికొస్తే సహించేది లేదు: ఫ్రాన్స్



లాస్ ఏంజెలెస్‌లో కార్చిచ్చు

లాస్ ఏంజెలెస్, జనవరి 8: అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ నగరంలో కార్చిచ్చు చెలరేగింది. హాలీవుడ్ నటులు, ప్రముఖులు నివాసం ఉండే అత్యంత సంపన్న ప్రాంతం పసిఫిక్ పాలిసేడ్స్ పూర్తిగా మంటల్లో చిక్కుకుపోయింది. హాలీవుడ్ స్టార్లు టామ్ హాంక్స్ రీస్ విథర్స్పూన్ వంటి నటుల ఇళ్లు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. అగ్ని కీలలు పెద్ద ఎత్తున ఎగిసిపడుతున్నాయి. దీనికి తోడు గాలులు బలంగా వీస్తుండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. కార్చిచ్చు ఇప్పటికే 3వేల ఎకరాలకు విస్తరించింది.

రఘురామ కేసులో తులసిబాబు అరెస్టు

▸ 6 గంటల విచారణ అనంతరం అదుపులోకి

ఒంగోలుక్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రఘురామకృష్ణ రాజు సీఐడీ కస్టడీ హింస కేసులో ప్రైవేటు వ్యక్తి కామేపల్లి తులసిబాబును పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆయన్ను ప్రశ్నించిన ప్రకాశం ఎస్పీ దామోదర్.. ఆ తర్వాత అదుపులోకి తీసుకున్నారు. తులసిబాబును గురువారం ఉదయం గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నారు. కాగా, సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 వరకు తులసిబాబు, పోలీసు కస్టడీలో ఉన్న రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను ఒకేచోట కూర్చోబెట్టి ఎస్పీ విచారించారు. ఇద్దరూ దాటవేత ధోరణిలో సమాధానాలు చెప్పినట్లు తెలిసింది. అయితే పక్కా సమాచారంతో పలురకాలుగా ప్రశ్నించి కొంత సమాచారం రాబట్టినట్లు తెలిసింది. 9.30 తర్వాత విజయ్‌పాల్‌ను స్థానిక తాలూకా పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం తులసిబాబును ప్రత్యేకంగా ప్రశ్నించినట్లు సమాచారం.

ఆడ దోమల అంతానికి మగ దోమల్లో విష జన్యువు

సిడ్నీ, జనవరి 8: రాజును చంపడానికి విలన్ విషకన్యని ప్రయోగించే కథ చాలా సినిమాల్లో చూశాం. అదే టెక్నిక్‌తో.. ఆడ దోమలను అంతం చేసేందుకు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు 'టాక్సిక్ మేల్ టెక్నిక్' పేరుతో ప్రయోగాలు చేస్తున్నారు. అందులో భాగంగా.. మగ దోమల వీర్యాన్ని విషపూరితం చేసే జన్యువును వాటిలో ప్రవేశపెడుతున్నారు. ఆ విషపూరిత దోమలు ఆడ దోమలతో కలిసినప్పుడు.. వాటి వీర్యంలో ఉండే విష ప్రోటీన్లు సదరు ఆడదోమల ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోయేలా చేసి చివరికి వాటిని చంపేస్తుందన్నమాట. ఈ ప్రయోగం వల్ల ఆడదోమల జీవితకాలం 60% తగ్గినా.. దోమకాటు బాధితుల సంఖ్య తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

చంద్రయాన్-4, గగన్‌యాన్‌పై దృష్టి

▸ ఇస్రో కొత్త చైర్మన్ నారాయణన్ వెల్లడి.. 14న బాధ్యతల స్వీకరణ

సూళ్లూరుపేట, బెంగళూరు(ఆంధ్రజ్యోతి), జనవరి 8: ఇస్రో ప్రస్తుతం విజయపథంలో దూసుకెళ్తోందని ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రోకు నూతన చైర్మన్‌గా ఎంపికైన వి నారాయణన్ అన్నారు. ఇప్పుడు ఇస్రో ముందున్న ప్రధాన మిషన్లలో చంద్రయాన్-4, గగన్‌యాన్ ముఖ్యమైనవని పేర్కొన్నారు. అంతరిక్ష శాఖ కార్యదర్శిగా, ఇస్రో చైర్మన్‌గా తాను చేపట్టనున్న కొత్త బాధ్యతల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ పదవీకాలం 13న ముగియనుంది. 14న సోమనాథ్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.

బ్లాక్ లిస్ట్ కంపెనీలకు అనుమతిచ్చారు

▸ హోలోగ్రామ్ స్కాంలో వాసుదేవరెడ్డికి పెద్దమొత్తంలో డబ్బు ముట్టింది

▸ హైకోర్టుకు నివేదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం బాటిళ్లపై అతికించే సెక్యూరిటీ హోలోగ్రామ్‌ల తయారీ, సరఫరా కాంట్రాక్ట్ టెండర్ అప్పగింత కుంభకోణంలో ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి పాత్రపై మరిన్ని ఆధారాలు లభించాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ హైకోర్టుకు నివేదించారు. నిబంధనలు ఉల్లంఘించి బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కంపెనీలకు టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు అనుమతిచ్చారన్నారు. అందుకుగాను పిటిషనర్‌కు పెద్ద మొత్తంలో సొమ్ము ముట్టిందని చెప్పారు. ఆధారాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. వాసుదేవరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

సజ్జల భార్గవరెడ్డి చెప్పినట్లు చేశా!

▸ సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టా

▸ మా పేరు చెప్పి భార్గవే సొమ్ములు కొట్టేశారు... రవీంద్ర రెడ్డి వెల్లడి

కడప, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా అప్పటి ఇన్‌చార్జ్ సజ్జల భార్గవరెడ్డి, ఆయన తండ్రి, అప్పటి ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారెడ్డి చెబితేనే సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినట్టు ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రరెడ్డి చెప్పినట్టు తెలిసింది. వారి ప్రోద్బలంతోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, తనిత, షర్మిల, విజయలక్ష్మి ఇతరులపై అసభ్య పోస్టులు పెట్టినట్టు వైసీపీ సోషల్ మీడియా కడప జిల్లా కోకన్వీనర్ వర్రా పోలీసులకు వెల్లడించారని సమాచారం. కోర్టు అనుమతితో వర్రాను రెండురోజులపాటు పోలీసులు తమ అదుపులోకి తీసుకున్నారు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ నేతృత్వంలో బుధవారం కడప సెంట్రల్ జైలు నుంచి వర్రాను సైబర్ స్టేషనుకు తీసుకువచ్చి విచారించారు. "సజ్జల భార్గవరెడ్డి, రామకృష్ణారెడ్డి సూచనల మేరకే పోస్టులు పెట్టాం. మాకు డబ్బులు ఇవ్వలేదు. మా పేరు చెప్పి సజ్జల భార్గవరెడ్డే సొమ్ములు కొట్టేశారు. రాజకీయ భవిష్యత్తు ఉంటుంది, పార్టీ అండగా ఉంటుందని హామీ ఇవ్వడంతో పోస్టులు పెట్టాను. అయితే, వీటిలో 18 నావి కాదు. నా పేరిట ఫేక్ ఖాతాలు సృష్టించి పోస్టులు పెట్టారు" అని విచారణలో వర్రా చెప్పినట్లు తెలిసింది.

గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా ఏపీ: మంత్రి లోకేశ్

విశాఖపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ డిజిటల్ టెక్నాలజీ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ లీడర్‌షిప్ ఫోరం విశాఖలో నిర్వహిస్తున్న రెండు రోజుల ఏపీ డిజిటల్ టెక్నాలజీ సదస్సు-2025ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రపంచానికే తలమానికంగా నిలిచే డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుందన్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 2ట్రిలియన్ డాలర్ల ఆదాయ లక్ష్యంతో ఐటీ రంగాన్ని ముందుకు తీసుకువెళ్లనున్నామన్నారు. ఇన్నోవేషన్, డీప్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంచుకుంటే ఆర్థిక అభివృద్ధితో పాటు సామాజిక పురోగతి సాధ్యపడుతుందన్నారు. సీఎం చంద్రబాబు దూరదృష్టితో విశాఖలో ఏర్పాటుచేసిన మెడ్‌టెక్ పార్కు వైపు ప్రపంచమంతా చూస్తోందని, ఇది ఎంతో గర్వకారణమని అన్నారు. ఏఐ వర్సిటీని విశాఖలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అనుమతి ఇస్తామన్నారు. రాష్ట్రంలో విద్యా విధానాలను కూడా మారుస్తామని లోకేశ్ చెప్పారు. పరిశ్రమలకు అవసరమైన నిపుణులను విద్యాసంస్థలు అందించలేకపోతున్నాయని, ఈ అంతరాన్ని పూడుస్తామని చెప్పారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఏపీ ప్రస్తుతం తొమ్మిదో స్థానంలో ఉందని, దీనిని మూడో స్థానానికి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. డ్రోన్లను కొందరు మిస్సైళ్లను చేరవేయడానికి ఉపయోగిస్తుంటే ఏపీ ప్రభుత్వం విపత్తు సహాయ కార్యక్రమాలకు ఉపయోగిస్తోందన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమలో కియా మోటార్స్ ఏర్పాటు చేయడం వల్ల ఇప్పుడు ఆ జిల్లా ఉభయ గోదావరి జిల్లాలతో తలసరి ఆదాయంలో పోటీ పడుతోందన్నారు. కర్నూలును పునరుత్పాదక ఇంధన కేంద్రంగా, చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా, గోదావరి జిల్లాలను ఆక్వా హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కెమికల్ పార్క్ ఉత్తరాంధ్రలో రాబోతుందన్నారు.

పారిశ్రామికవేత్తలకు బాసట..

పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా సాయం అందిస్తామని లోకేశ్ అన్నారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించామని తెలిపారు. విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖలో ఐటీ అభివృద్ధికి అవసరమైన వాతావరణం ఏర్పాటు చేస్తామన్నారు. పరిశోధన, అభివృద్ధి రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలని సూచించారు.


ట్రంప్ విస్తరణ కాంక్ష!

కెనడా, గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను అమెరికాలో విలీనం చేసుకుంటామని ప్రకటన

▸ మెక్సికోపైనా తెంపరితనం..

▸ మండిపడ్డ ఫ్రాన్స్, పనామా

▸ కెనడా ఎన్నటికీ విలీనం కాదు: ట్రూడో



వాషింగ్టన్, జనవరి 8: అమెరికా అధ్యక్షుడిగా ఈ నెల 20న బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ భూవిస్తరణ కాంక్షతో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా పేర్కొంటూ ఆ దేశంపై తమ జెండా ఎగురుతున్న మ్యాపుల ఫొటోలను షేర్ చేయడం, డెన్మార్క్ స్వయం ప్రతిపత్తి ప్రదేశమైన గ్రీన్‌ల్యాండ్, పనామా కాలువను విలీనం చేసుకుంటామని పేర్కొనడం, గల్ఫ్ ఆఫ్ మెక్సికోను 'గల్ఫ్ ఆఫ్ అమెరికా'గా మారుస్తానని చెబుతూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలపై ఆయా దేశాలు తీవ్రస్థాయిలో మండిపడగా.. అగ్రరాజ్యాల మధ్య చిచ్చు మొదలవుతోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. ఎన్నడూ తలపడని అగ్రదేశాల మధ్య ఇప్పుడు మాటల ఉద్రిక్తత మొదలవుతోందని అభిప్రాయపడుతున్నారు. అంతేకాదు.. నాటోలో భాగస్వామ్య దేశాలే.. ట్రంప్ వ్యాఖ్యలపై మండిపడడం పరిస్థితుల్లో తీవ్రతకు నిదర్శనమని చెబుతున్నారు. ట్రంప్ మంగళవారం తన మారి-ఎ-లాగో ఎస్టేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కెనడా, మెక్సికో, గ్రీన్‌ల్యాండ్(డెన్మార్క్), పనామాలపై మాట్లాడారు. సైనిక శక్తిని ఉపయోగించి విలీనం చేస్తారా? అని విలేకరులు అడగ్గా.. "లేదు..! ఆర్థిక శక్తిని వాడుతాను" అని స్పష్టం చేస్తూనే.. పనామా కాలువ, గ్రీన్‌ల్యాండ్ విలీనంపై సైనిక, ఆర్థిక శక్తిని వినియోగించనని హామీ ఇవ్వలేనన్నారు. పనామా కాలువను సైనిక అవసరాల కోసం అమెరికా నిర్మించినట్లు వ్యాఖ్యానించారు.

కెనడాపై మరింత కఠినంగా..

ట్రంప్ గతంలో కెనడాతో ఎలాంటి సత్సంబంధాలను కొనసాగించలేదు. 2016 ఎన్నికల సమయంలోనే.. కెనడా-అమెరికా మధ్య గోడ కడతా అని ప్రకటించారు. ఇప్పుడు ఆ దేశంపై ఆర్థిక యుద్ధాన్ని ఇప్పటికే ప్రారంభించారు. కెనడా నుంచి జరిగే దిగుమతులపై 25% టారిఫ్ విధిస్తానన్నారు. నిజానికి కెనడాకు అమెరికా అతిపెద్ద వినియోగదారు. అమెరికాకు సహజవాయువులు, ఉక్కు, అల్యూమినియం, ఆటోమొబైల్స్‌ను కెనడా ఎగుమతి చేస్తుంది. వీటిపై 25% టారిఫ్ విధించడం కెనడాకు శరాఘాతంలాంటిదేనని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. తాజాగా కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన వెలువడిన వెంటనే.. ట్రంప్ విలీనంపై కీలక వ్యాఖ్యల ఉధృతిని పెంచారు. "కెనడాలో మెజారిటీ ప్రజలకు అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండడమే ఇష్టం. అమెరికాలో విలీనమైతే.. సుంకాలు, పన్నులు ఉండవు. పైగా.. నిరంతరం చుట్టూ కాచుక్కూర్చునే రష్యా, చైనా నుంచి అమెరికా మాత్రమే రక్షణ కల్పించగలదు" అన్నారు. అమెరికాలో కెనడా విలీనమైనట్లుగా ఓ మ్యాప్‌ను ఆయన తన పోస్టుకు జత చేశారు. ఇటీవల ట్రూడోను కలిసిన ట్రంప్.. "కెనడా గవర్నర్‌తో భేటీ అయ్యాను" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే..! తాజాగా విలేకరుల సమావేశంలో.. కెనడాను విలీనం చేసుకుంటామని పునరుద్ఘాటించారు.ఈ వ్యాఖ్యలపై ట్రూడో తీవ్రంగా స్పందించారు. అమెరికాలో కెనడా విలీనమయ్యే ప్రసక్తే లేదని ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఐరోపా జోలికొస్తే సహించేది లేదు: ఫ్రాన్స్

ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఐరోపా సమాఖ్య అప్రమత్తమైంది. తమ జోలికి ఎవరొచ్చినా సహించబోమని ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి జీ-నోయల్ బారో తేల్చిచెప్పారు. ఫ్రాన్స్ ఇంటర్ రేడియో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఐరోపా దేశాల సరిహద్దుల సార్వభౌమత్వాన్ని ఎవరు ఉల్లంఘించినా.. ఊరుకునేది లేదని స్పష్టంచేశారు. గ్రీన్‌ల్యాండ్‌పై ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందిస్తూ.. "మాది బలమైన ఖండం. డెన్మార్క్‌లో 600 ఏళ్ల నుంచి భాగమైన గ్రీన్‌ల్యాండ్‌ను.. పనామా కాలువను అమెరికా ఆక్రమించుకొంటుందంటే నేను విశ్వసించను" అని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై పనామా విదేశాంగ మంత్రి జావిర్ మార్టినేజ్ స్పందించారు. పనామా కాల్వను తమ దేశం మాత్రమే నియంత్రించగలదని.. భవిష్యత్‌లో కూడా అదే కొనసాగుతుందని స్పష్టంచేశారు. గ్రీన్‌ల్యాండ్ ప్రధాని మెటే ఫ్రెడెరిక్సన్ మాట్లాడుతూ.. అమెరికా-గ్రీన్‌ల్యాండ్ మధ్య ఆర్థిక యుద్ధాలు తగదని హితవు పలికారు. కాగా.. ట్రంప్ కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ప్రస్తుతం గ్రీన్‌ల్యాండ్ పర్యటనలో ఉండటం గమనార్హం..!

హమాస్‌కు ట్రంప్ వార్నింగ్

ఇజ్రాయెల్-హమాస్ పోరుపైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను అధ్యక్షుడిగా బాధ్యతలను స్వీకరించేలోపు.. హమాస్ తన చెరలో ఉన్న బందీలను విడుదల చేయాలని తేల్చిచెప్పారు. లేనిపక్షంలో హమాస్‌కు నరకం చూపిస్తామని, చరిత్రలో ఎన్నడూ చూడని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

ప్రపంచ యుద్ధానికి సంకేతమా?

ట్రంప్ వ్యాఖ్యలు, ఆయా దేశాల ప్రతిస్పందనలతో అమెరికా-ఐరోపా మధ్య దూరం పెరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే.. మరో ప్రపంచ యుద్ధానికి దారి తీసే ప్రమాదాలు లేకపోలేదని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో రష్యా నుంచి వలస వచ్చిన గోంబర్గ్ అనే యూదు జాతీయుడు 'ఔట్‌లైన్ ఆఫ్ పోస్ట్‌వార్ న్యూ వరల్డ్ మ్యాప్' పేరుతో 1942 ఫిబ్రవరి 25న ఓ పటాన్ని చిత్రీకరించారు. తర్వాతి కాలంలో ఇది పాపులర్ కావడం విశేషం..! ఈ మ్యాప్‌లో కెనెడా, మెక్సికో, గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాలో ఓ భాగంగా పేర్కొన్నారు. తాజాగా ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలు ఈ మ్యాప్‌నకు అనుగుణంగా ఉన్నాయనే ప్రచారం సాగుతోంది.

గ్రీన్‌ల్యాండ్ ఎందుకు?

డెన్మార్క్‌లో స్వయం ప్రతిపత్తి గల ప్రాంతంగా ఉన్న గ్రీన్‌ల్యాండ్‌లో అమెరికాకు చెందిన భారీ అంతరిక్ష కేంద్రం(తులె ఎయిర్‌బేస్) ఉంది. గ్రీన్‌ల్యాండ్ మీదుగానే ఉత్తర అమెరికా నుంచి ఐరోపాకు వెళ్లడం దగ్గరి దారిగా చెబుతారు. ఈ ద్వీపంలో అత్యధిక స్థాయిలో ఖనిజ సంపద, చమురు నిల్వలున్నాయి. గ్రీన్‌ల్యాండ్‌పై అమెరికా కన్నేయడం ఇది మొదటిసారి కాదు. 1860ల్లో అప్పటి అమెరికా అధ్యక్షుడు ఆండ్రూ జాన్సన్ కూడా గ్రీన్‌ల్యాండ్‌పై పేచీపెట్టారు. ట్రంప్ కూడా 2019లో గ్రీన్‌ల్యాండ్‌ను అమెరికాకు అమ్మేయాలంటూ ఆఫరిచ్చారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో కూడా భారీ ఎత్తున పెట్రోలియం నిక్షేపాలున్నాయి. పెట్రోలియం వనరులున్న జలభాగాల్లో ఇది ప్రపంచంలోనే 9వ అతి పెద్దది.



కెనడా ప్రధాని రేసులో అనితా ఆనంద్!



న్యూఢిల్లీ, జనవరి 8: కెనడా ప్రధాన మంత్రి రేసులో ఆ దేశ రవాణా మంత్రి, భారత సంతతి మహిళ అనితా ఆనంద్ ముందున్నారు. జస్టిన్ ట్రూడో రాజీనామా ప్రకటన నేపథ్యంలో కెనడా తదుపరి ప్రధాన మంత్రి ఎవరు అవుతారనే చర్చ జరుగుతోంది. అనితాఆనంద్ ఆ బాధ్యతలు చేపట్టే అవకాశాలున్నాయి. 2025 అక్టోబరులో లేదా అంద కు ముందు కెనడా ఫెడరల్ ఎన్నికలు జరగనున్న క్రమంలో అప్పటి వరకు కొత్త ప్రధాని తాత్కాలిక ప్రధానిగా కొనసాగుతారు. కాగా, అనితా ఆనంద్ 2019లో తొలిసారి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. 2019 నుంచి 2021 వరకు మంత్రిగా కూడా పనిచేశారు. అలాగే ట్రెజరీ బోర్డు అధ్యక్షురాలిగా, దేశ రక్షణ మంత్రిగానూ బాధ్యతలు నిర్వహించారు.

నా కొడుకు మాట పట్టించుకోవద్దు

▸ అతడో మామూలు మనిషి

▸ ఎలాన్ మస్క్ తండ్రి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, జనవరి 8: టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఇతర దేశాల రాజకీయాల్లో జోక్యం చేసుకోవడంపై తప్పుపడుతూ ఆయన తండ్రి ఎర్రల్ మస్క్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యలు, ట్వీట్లను పట్టించుకోవద్దని పేర్కొన్నారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. "ఎలాన్ చెప్పిన మాటలను ప్రజలు వినిపించుకోవద్దు. అతడో మామూలు మనిషి. ఎలాన్ మస్క్ వద్ద బాగా డబ్బు ఉంది కాబట్టి అతడు చెప్పిన విషయాలను చాలా మంది రీట్వీట్ చేస్తారు. నేనైతే అలా చేయను" అని ఎర్రల్ పేర్కొన్నారు. ఎలాన్ మస్క్ ఆయన తండ్రి ఎర్రల్ మస్క్ మధ్య తీవ్రమైన అభిప్రాయభేదాలున్నాయి.

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

▸ వారం పాటు రూ.1.5 లక్షల వరకు చికిత్స ఖర్చును కేంద్రం భరిస్తుంది : గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 8: రోడ్డు ప్రమాద బాధితులకు నగదురహిత చికిత్స పథకం ఇక దేశమంతా అమలవుతుందని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటి వరకు ఆరు రాష్ట్రాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసిన ఈపథకాన్ని అన్ని రాష్ట్రాలకూ విస్తరించనున్నామని చెప్పారు. ఏడు రోజుల పాటు రూ.లక్షన్నర వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. ఆస్పత్రిలో చేరి, ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు పోలీసులకు సమాచారంఅందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 'హిట్ అండ్ రన్' (గుర్తుతెలియని వాహనాలు ఢీకొన్న) కేసుల్లో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల నష్ట పరిహారం ఇస్తామని గడ్కరీ తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల రవాణా శాఖ మంత్రులు, కార్యదర్శులతో సమావేశం అనంతరం నగదురహిత చికిత్స పథకాన్ని ప్రకటించారు. గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో లక్షా 80 వేల మంది చనిపోయారని చెప్పారు. ఇందులో 30 వేల మంది హెల్మెట్లు ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారన్నారు. 66 శాతం ప్రమాదాల్లో బాధితులు 18 నుంచి 34 ఏళ్లలోపు వయస్కులని వివరించారు. విద్యా సంస్థల లోపలికి వెళ్లే, బయటికొచ్చే ప్రదేశాల వద్ద సరైన ఏర్పాట్లు లేకపోవడం వల్ల జరిగిన ప్రమాదాల్లో 10 వేల మంది పిల్లలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ బస్సులు, ఆటోల ప్రమాదాలకు కారణాలను గుర్తించామని, వాటిని నివారించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డు భద్రత అంశంపై రాష్ట్రాల మంత్రులు, కార్యదర్శులతో చర్చించామన్నారు. భారీ వాహనాలకు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎమర్జెన్సీ బ్రేకింగ్, డ్రైవర్ కునికిపాట్లు పడుతుంటే హెచ్చరించే వ్యవస్థ వంటి వాటిని తప్పనిసరి చేస్తామని తెలిపారు. కాగా, రోడ్డు భద్రతను పెంపొందించేందుకు కేంద్రం రూ.4,500 కోట్లతో దేశవ్యాప్తంగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలు, ఆటోమేటెడ్ టెస్టింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయాలని భావిస్తోంది.

బెదిరించింది విక్రాంత్‌రెడ్డి!

▸ వాటాలు రాయకపోతే కుటుంబమంతా జైలుకు పోతారన్న వైవీ కుమారుడు!

▸ ఈడీకి వెల్లడించిన కేవీ రావు

(కాకినాడ/హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

కాకినాడ సీపోర్టులో బలవంతపు వాటాల బదిలీ వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసి.. నిందితులుగా ఉన్న వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి, వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి, అరబిందో శరత్‌చంద్రారెడ్డిని ఇప్పటికే విచారించింది. తాజాగా ఈ కేసులో బాధితుడైన కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ (కేపీసీఎల్) చైర్మన్ కర్నాటి వెంకటేశ్వరరావు(కేవీ రావు)ను బుధవారం హైదరాబాద్‌లో 8 గంటలకుపైగా ప్రశ్నించింది. అనేక కోణాల్లో 12 కీలక ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టింది. ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి తనను ఎలా బెదిరించి వేధించారో.. వాటాలు కొట్టేశారో రావు వివరించారు. వాటాలకు సంబంధించి జరిగిన ఆర్థిక లావాదేవీలకు ఆధారాల గురించి ఈడీ ఆరా తీసింది. సదరు ఆధారాలతో పాటు బలవంతపు ఒప్పంద పత్రాలు, ఇతర ఫైళ్లను ఆయన అందజేశారు. మరింత లోతుగా ప్రశ్నించేందుకు మరోసారి రావలసి ఉంటుందని ఈడీ ఆయనకు తెలిపింది. తనకు కొద్దిగా సమయం కావాలని, వ్యక్తిగత పనులున్నాయని ఆయన బదులిచ్చారు. ఈలోపు ఈడీకి ఏ సమాచారం కావలసినా తన కార్యాలయ ప్రతినిధుల ద్వారా పంపుతానని తెలిపారు.

వాటాలు రాయాలంటూ ఎవరొచ్చారు..?

విచారణ సందర్భంగా.. కాకినాడ సీపోర్ట్స్‌లో మీకున్న వాటాలను బలవంతంగా ఎవరు రాయించుకున్నారని ఈడీ కేవీరావును ప్రశ్నించింది. 'విక్రాంత్‌రెడ్డి, విజయసాయిరెడ్డి ఎవరో మీకు తెలుసా.. వీరిద్దరూ మిమ్మల్ని ఏయే రూపాల్లో బెదిరించారు' అని ఆరా తీసింది. కేవీరావు ఎవరో తనకు తెలియదని విజయసాయిరెడ్డి ఇటీవల విచారణ సందర్భంగా చెప్పిన విషయాన్ని ఈడీ ప్రస్తావించింది. అది అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. 'అది ఎంతవరకు నిజం..? వాటాల విలువను తగ్గించేసి మీకు చెల్లించిన డబ్బును ఎవరు ఇచ్చారు..? ఎవరి పేరుతో మీ ఖాతాలకు ఆ డబ్బు బదిలీ అయింది.. ఆ డబ్బు ఎక్కడి నుంచి మీకు చేరింది..? సంతానం ఆడిట్ కంపెనీ డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసిన విషయం మీ దృష్టికి ఎప్పుడు వచ్చింది..? సీపోర్టు, కాకినాడ సెజ్‌లలో మీ వాటాలను ఎవరు ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరించి రాయమంటే రాసిచ్చారు? ఈ రెండు కంపెనీల్లో మొత్తం మీ వాటాల విలువ ఎంత.. మీకు చెల్లించింది ఎంత' అని ఈడీ అధికారులు అడిగారు. తనను బెదిరించి, భయపెట్టి, కుటుంబాన్ని జైలుకు పంపుతామని బెదిరించి వాటాలను బలవంతంగా రాయించుకున్నారని రావు సమాధానమిచ్చారు. తాను చెప్పిన అంశాలకు ఆధారాలు కూడా సమర్పించారు. సీపోర్టు, సెజ్‌లో వాటాలు రాసివ్వాలంటూ విమ్మల్ని ఎవరు కలిశారని ఈడీ ప్రశ్నించింది. 'జగన్ సీఎం అయిన కొన్ని నెలల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి నాకు.. చెన్నైకి చెందిన సంతానం కంపెనీతో సీపోర్టులో జరిగిన వ్యాపార లావాదేవీలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహిస్తున్నామని సమాచారం వచ్చింది. ఆ తర్వాత ముంబైకు చెందిన మరో కంపెనీతోను ఆడిట్ అని చెప్పారు. ఏ తప్పిదాలూ లేకుండా పక్కాగా పన్నులు చెల్లిస్తూ సజావుగా జరుగుతున్న వ్యాపారంపై ఇలా జరుగుతుండడంతో నాకు అనుమానం వచ్చింది. అయినా సహకరించి.. అడిగిన ఫైళ్లన్నీ ఇచ్చాం. కేఎస్‌పీఎల్ రాష్ట్రప్రభుత్వానికి రూ.994 కోట్లు ఎగ్గొట్టినట్లు నివేదికలో తేల్చి పథకం ప్రకారం వాటాలపై కన్నేశారు. అదే సమయంలో నాకు విజయసాయిరెడ్డి ఫోన్ చేసి వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిని కలవమన్నారు' అని వెల్లడించారు.

జగన్ ఆదేశమంటూ విక్రాంత్‌రెడ్డి భయపెట్టారు!

ఇటీవల విచారణ సందర్భంగా తనకు కేవీ రావు ఎవరో తెలియదని విజయసాయిరెడ్డి తమకు చెప్పిన విషయాన్ని ఈడీ అధికారి ప్రస్తావించగా.. అదంతా అబద్ధమని రావు బదులిచ్చారు. 'విజయసాయిరెడ్డి చెప్పిన తర్వాత విక్రాంత్‌రెడ్డి ఇంటికి వెళ్తే.. ప్రభుత్వానికి వెయ్యి కోట్లు ఎగ్గొట్టానంటూ నివేదిక చూపించారు. కుటుంబమంతా జైలుకు వెళ్లే పరిస్థితి ఉందని, అలా జరగకూడదంటే కేఎస్‌పీఎల్‌లో వాటాలన్నీ తమకు రాసిచ్చేయాలని ఆయన బెదిరించారు. నేనే తప్పూ చేయలేదని చెప్పినా ఇది సీఎం జగన్ ఆదేశమని విక్రాంత్ భయపెట్టారు జగన్ దృష్టికి తీసుకెళ్దామని ప్రయత్నించినా.. ఇదంతా నడిపించింది ఆయనే కావడంతో.. నా మాట వినిపించుకోరని అర్థమైంది. చేసేదిలేక 2020 జూలైలో వాటాల మార్పిడిపై సంతకం చేశా'నని కేవీరావు తెలిపారు.

జైలుకు పంపుతామన్నారు..!

కాకినాడ ఎస్ఈజెడ్‌లో మీ వాటాను బెదిరించి లాగేసుకుంది ఎవరు.. విక్రాంత్‌రెడ్డితోపాటు ఇంకా ఎవరైనా ఉన్నారా.. వాటాలు ఎలా లాక్కున్నారని ఈడీ కేవీ రావును ప్రశ్నించింది. ఇక్కడ కూడా విక్రాంత్‌రెడ్డి తనను జైలుకు పంపుతానని బెదిరించినట్లు ఆయన తెలిపారు. వాటాలు రాయించుకునేటప్పుడు ఎవరెవరు హాజరయ్యారని అడుగగా.. విక్రాంత్‌రెడ్డి బెదిరించి అరబిందో ప్రతినిధుల సమక్షంలో వాటాలు కొట్టేశారని చెప్పారు.

హెల్మెట్ ధారణలో పురోగతి కనిపిస్తోంది

▸ అవగాహన కార్యక్రమాలను కొనసాగించండి

▸ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించే విషయంలో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు కొనసాగించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తమ ఆదేశాల అమలులో పురోగతి కనిపిస్తోందని, ప్రస్తుతం ప్రతీ 10 మంది ద్విచక్రవాహనదారుల్లో ముగ్గురు హెల్మెట్ ధరిస్తున్నారంటూ సంతృప్తి వ్యక్తం చేసింది. గత 20 రోజుల్లో రూ. 95 లక్షలు చలాన్ల రూపంలో వసూలు చేశారని, చలాన్లు విధించడంలో, పెండింగ్ చలాన్లు వసూలులో కూడా పురోగతి ఉందని పేర్కొంది. మోటార్ వాహనాల చట్టనిబంధనలు అతిక్రమించేవారిపై తీసుకొనే చర్యలు, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలపై పత్రికలు, టీవీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వానికి మరోసారి స్పష్టం చేసింది. ఈ-చలాన్ యాప్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించింది. ఇతర వివరాలన్నిటితో అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనంఉత్తర్వులు ఇచ్చింది. కేంద్ర మోటార్ వాహన సవరణ చట్టం నిబంధనలు అమలుకావడం లేదంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో దాఖలు చేసిన పిల్ బుధవారం మరోసారి విచారణకు వచ్చింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు చలాన్లు విధిస్తున్నారన్నారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పోలీసుల తనిఖీలు విజయవాడకే పరిమితం అయ్యాయన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రాష్ట్ర వాప్తంగా పెండింగ్ చలాన్ల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించాలని కోరింది.

ఆ పోలీసుల పేర్లు డైరీలో రాసుకోండి

▸ వారితోనే మీకు సెల్యూట్ కొట్టిస్తా!

▸ నెల్లూరు వైసీపీ నేతలవద్ద జగన్ వ్యాఖ్యలు

▸ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో భేటీ

▸ ఒక్కొక్కరితో 3 నిమిషాలు మాట్లాడిన అధినేత....విడివిడిగా వారందరితోనూ సెల్ఫీలు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పోలీసులను ఉద్దేశించి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "పోలీసులు మీపై తప్పుడు కేసులు పెట్టి ..కొట్టి .. హింసిస్తే .. వారి పేర్లను డైరీలో రాసుకోండి .. మనం అధికారంలోకి వచ్చాక .. వారందరి సంగతి తేలుస్తా. కొట్టిన పోలీసులతోనే మీకు సెల్యూట్ కొట్టిస్తా" అని నెల్లూరు జిల్లాకు చెందిన పార్టీ నేతల వద్ద జగన్ వ్యాఖ్యానించారు. తాడేపల్లి నివాస ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైసీపీకి చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో మంగళవారం, నెల్లూరు జిల్లా నేతలతో బుధవారం జగన్ సమావేశమయ్యారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. లోకసభ నియోజకవర్గం యూనిట్‌గా వచ్చే నెల నుంచి మూడు రోజులు పర్యటనలు చేస్తానని జగన్ ప్రకటించారు. సమావేశంలో ఒక్కొక్కరికీ సగటున మూడు నిమిషాలు సమయం ఇచ్చి వారి సమస్యలు విన్నారు. అనంతరం వారితో విడివిడిగా జగన్ సెల్ఫీలు దిగారు. నెల్లూరు నేతల భుజంపై చేయి వేసి .. భవిష్యత్తులో తోడుగా ఉంటానని చెప్పారు. అయితే, కూటమి సూపర్ సిక్స్ పథకాలపై గతంలో చేసిన ప్రసంగాన్నే తిరిగి వినిపించారు. ఆయన ఉపన్యాస ధోరణిని 'తప్పదు' అన్నట్టు నేతలు భరించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత పెరుగుతున్నదనీ, వచ్చే ఎన్నికల్లో తిరిగి వైసీపీ అధికారంలోకి వస్తుందని చెప్పే ప్రయత్నం చేసినా..నేతలు చెవికి ఎక్కించుకోలేదని తెలిసింది. పోలీసులపై జగన్ వ్యాఖ్యలకూ పెద్దగా స్పందన కనిపించలేదని చెబుతున్నారు.

GOVERNMENT OF INDIA
(MINISTRY OF RAILWAYS)
(SOUTH CENTRAL RAILWAY)
NOTIFICATION
(under section 20A of Indian Railways Act, 1989)
Secunderabad, the 30thDecember, 2024

Rc.No.152/2024-J **Date: 08 -01-2025**

S.O2970(E): In exercise of the powers conferred by sub-section (1) of Section 20A of the Railways Act, 1989 (24 of 1989) (here in after referred to as the said Act), the Central Government after being satisfied that for the public purpose,the land, the brief description of which is given in the schedule annexed hear to, is required for execution of the special Railway Project , Doubling of Railway line with Electrification between Guntur - Bibinagar Stations in Guntur District in the State of Andhra Pradesh , here by declares its intension to Acquire such land.

Any person interested in the said land may, within a period of thirty(30) days from the date of publication of this notification in the official gazette, raise objections to the acquisition and use of such land for the aforesaid purpose under sub-section (1) of Section 20D of the said Act.

Every such objection, shall be made to the Competent Authority, namely Revenue Divisional Officer Guntur; Guntur District in writing and shall be set out the grounds there of and the Competent Authority and Revenue Divisional Officer, either in person or by legal practitioner and may, after hearing all such objections and after making such further enquiry, if any as the Competent Authority thinks necessary, by, order, either allow or disallow the objections.

Any order made by the Competent Authority under sub section (II) of section20D of the said act shall be final.

The land plans and other details of the land under this notification are available and can be inspected by the interested persons at the aforesaid office of the Competent Authority.

SCHEDULE

Description of lands in acquisiton:For construction of Doubling Railway line with electrification between Guntur and Bibinagar (239 Kms) within the limits of Guntur District jurisdiction forpassengers and freight facility.,

Sl. No.	Name of the Mandal	Name of the Village	Sl. No.	Survey No.	LPM Number	Tentative Area in Acres (LA Extent)	Tentative Area in Hectares	CLASSIFICATION
1	2	3	4	5	6	7	8	9
1	Medi konduru	Siri puram	1	172/A	730	0.04	0.016	Patta Land
			2	172/A	731	2.17	0.879	Patta Land
			3	166/A	739	1.76	0.713	Patta Land
			4	164A, 167	761	0.31	0.126	Patta Land
			5	164/A	767	0.15	0.061	Patta Land
			6	161/A	768	0.25	0.101	Patta Land
			7	161/A	772	0.27	0.109	Patta Land
			8	143	857	0.06	0.024	Patta Land
			9	142/A	884	0.43	0.174	Patta Land
			10	144/A	885	0.02	0.008	Patta Land
			11	144/A	886	0.38	0.154	Patta Land
			12	141/A	889	0.12	0.049	Patta Land
			13	317/A	2047	0.13	0.053	Patta Land
			14	156/A	2078	0.16	0.065	Patta Land
			15	318/A	2507	1.26	0.510	Patta Land
			16	317/A	2517	0.39	0.158	Patta Land
			17	317/A	2519	0.17	0.069	Patta Land
			18	317A	2520	0.40	0.162	Patta Land
			19	322/A	2534	0.39	0.158	Patta Land
			20	322/A	2535	0.12	0.049	Patta Land
			21	376/A	2664	0.54	0.219	Patta Land
			22	376/A	2665	0.16	0.065	Patta Land
			23	376/A	2666	0.28	0.113	Patta Land
			24	376/A	2667	0.02	0.008	Patta Land
			25	376/A	2668	0.30	0.122	Patta Land
			26	375/A	2669	0.14	0.057	Patta Land
			27	375/A	2671	0.15	0.061	Patta Land
			28	375/A,352/A	2672	0.25	0.101	Patta Land
			29	356/A	2673	0.04	0.016	Patta Land
			30	356/A	2679	0.23	0.093	Patta Land
			31	357/A, 356/A	2680	0.11	0.045	Patta Land
			32	356/A	2683	0.10	0.041	Patta Land
			33	359/A	2684	0.21	0.085	Patta Land
			34	359/A	2685	0.09	0.036	Patta Land
			35	359/A	2686	0.12	0.049	Patta Land
			36	359/A	2687	0.38	0.154	Patta Land
			37	356/A, 352/A	2863	0.06	0.024	Patta Land
			38	356/A, 352/A	2864	0.04	0.016	Patta Land
			39	356/A, 352/A	2865	0.21	0.085	Patta Land
			40	174/A	3080	1.46	0.591	Patta Land
			41	141/A	3094	0.29	0.117	Patta Land
			42	118,117,121, 119/A, 120/A, 123/A	3002	2.10	0.851	Patta Land
			43	84	3191	0.005	0.002	Patta Land
			44	140/A-1B	888	0.14	0.057	Govt.Land
			45	85	2308	0.07	0.028	Govt. Land
			46	319	2506	0.03	0.012	Govt. Land
			47	360/A	2587	0.10	0.041	Govt. Land
			48	170/B	728	0.08	0.032	Govt. Land
			49	378/A	3037	0.03	0.012	Govt. Land
			50	349	2845	0.06	0.024	Govt. Land
			51	157/A	774	0.01	0.004	Govt. Land
			SUB TOTAL			16.785	6.798	
2	Medi konduru	VISA DALA	1	19/B	124	0.35	0.142	Patta Land
			2	18/B,19/B	125	0.38	0.154	Patta Land
			3	17/B	126	0.23	0.093	Patta Land
			4	17/B	127	0.16	0.065	Patta Land
			5	13/B	129	0.020	0.008	Govt. Land
			SUB TOTAL			1.140	0.462	
3	Medi konduru	MANDA PADU	1	156/B-1A		0.12	0.049	Patta Land
			2	156/B-2A		0.12	0.049	Patta Land
			3	156/B-3A		0.19	0.077	Patta Land
			4	157/B-1		0.43	0.174	Patta Land
			5	161/B-1B		0.57	0.231	Patta Land
			6	161/B-3A		0.18	0.073	Patta Land
			7	161/B-3C		0.11	0.045	Patta Land
			8	161/B-4A		0.13	0.053	Patta Land
			9	161/B-5A		0.12	0.049	Patta Land
			10	162-2		0.61	0.247	Patta Land
			11	170/B		1.170	0.474	Patta Land
			12	171-1B		0.14	0.057	Patta Land
			13	171-2B		0.22	0.089	Patta Land
			14	173/B-1		0.33	0.134	Patta Land
			15	173/B-4		0.50	0.203	Patta Land
			16	193-1		0.10	0.041	Patta Land
			17	201/A-1		0.24	0.097	Patta Land
			18	203/A-1A		0.02	0.008	Patta Land
			19	203/B-1		0.115	0.047	Patta Land
			20	203/B-2		0.58	0.235	Patta Land
			21	204/B		0.58	0.235	Patta Land
			22	205/B-1		0.02	0.008	Patta Land
			23	205/B-2		0.22	0.089	Patta Land
			24	217		0.23	0.093	Patta Land
			25	218/B		1.07	0.433	Patta Land
			26	226/B		1.20	0.486	Patta Land
			27	155/B		0.02	0.008	Govt. Land
			28	161/B-1A		0.26	0.105	Govt. Land
			29	162-1		0.22	0.089	Govt. Land
			30	171-1A		0.13	0.053	Govt. Land
			31	175/B		0.03	0.012	Govt. Land
			32	215/B		0.03	0.012	Govt. Land
			SUB TOTAL			10.005	4.052	
4	TADI KONDA	BANDARU PALLI	1	443/B-2		0.095	0.038	Patta Land
			2	443/B-3		0.085	0.034	Patta Land
			3	470/B		0.32	0.130	Patta Land
			4	471/B		0.01	0.004	Patta Land
			5	476/B		0.72	0.292	Patta Land
			6	477		0.34	0.138	Patta Land
			7	479/B		0.64	0.259	Patta Land
			8	493		0.52	0.211	Patta Land
			9	494/B		0.05	0.020	Patta Land
			10	495/B-1		0.24	0.097	Patta Land
			11	496-A		0.50	0.203	Patta Land
			12	505		0.10	0.041	Patta Land
			13	508		0.01	0.004	Patta Land
			14	509/B		0.28	0.113	Patta Land
			15	510/B		0.19	0.077	Patta Land
			16	513/B		0.07	0.028	Patta Land
			17	542/B		1.05	0.425	Patta Land
			18	617/B-1		0.15	0.061	Patta Land
			19	621/B		0.38	0.154	Patta Land
			20	623/B		0.28	0.113	Patta Land
			21	624/B-1		0.70	0.284	Patta Land
			22	624/B-2		0.08	0.032	Patta Land
			23	626/B-1		0.455	0.184	Patta Land
			24	626/B-2		0.03	0.012	Patta Land
			25	648/B-1		0.22	0.089	Patta Land
			26	651-2		0.19	0.075	Patta Land
			27	652/B		0.32	0.130	Patta Land
			28	656		0.30	0.122	Patta Land
			29	658-2		0.11	0.045	Patta Land
			30	658-5		0.17	0.069	Patta Land
			31	659/B		0.30	0.122	Patta Land
			32	664/B		0.08	0.032	Patta Land
			33	665/B-1		0.46	0.186	Patta Land
			34	665/B-2A		0.08	0.032	Patta Land
			35	665/B-2C		0.21	0.085	Patta Land
			36	666-2A		0.01	0.004	Patta Land
			37	666-2C		0.14	0.057	Patta Land
			38	445/B		0.06	0.024	Govt. Land
			39	495/B-2		0.06	0.024	Govt. Land
			40	543/B		0.11	0.045	Govt. Land
			41	649/B		0.02	0.008	Govt. Land
			42	665/B-2B		0.17	0.069	Govt. Land
			43	666-2B		0.07	0.028	Govt. Land
			SUB TOTAL			10.370	4.200	
5	GUNTUR WEST	NALLA PADU RURAL	1	674-2		0.20	0.081	Patta Land
			2	680-1		0.23	0.093	Patta Land
			3	681-1		0.32	0.130	Patta Land
			4	683-2		0.115	0.047	Patta Land
			5	684-1B		0.05	0.020	Patta Land
			SUB TOTAL			0.915	0.371	
6	GUNTUR WEST	CHINA PALAKA LURU	1	185/B		1.20	0.486	Patta Land
			2	188-1		0.44	0.178	Patta Land
			3	188-3		0.04	0.016	Patta Land
			4	191-A		0.02	0.008	Patta Land
			5	223-3		0.10	0.041	Patta Land
			6	224-3		0.16	0.065	Patta Land
			7	242-3		0.19	0.077	Patta Land
			8	243-C2		0.33	0.134	Patta Land
			9	246-A3		0.27	0.109	Patta Land
			10	246-C2		0.33	0.134	Patta Land
			11	187		0.15	0.061	Govt. Land
			12	188-2		0.03	0.012	Govt. Land
			13	244		0.11	0.045	Govt. Land
			14	251		0.05	0.020	Govt. Land
			SUB TOTAL			3.420	1.385	
GRAND TOTAL (1+2+3+4+5+6)						42.635	17.268	

Sd/- K. SRINIVASA RAO
COMPETENT AUTHORITY (LA)&
REVENUE DIVISIONAL OFFICER, GUNTUR

ఇంటర్ విద్యలో సంస్కరణలు

» ఇకపై రెండో సంవత్సరంలోనే బోర్డు పరీక్షలు


ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా

అమరావతి/తాడేపల్లి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యలో విప్లవాత్మక సంస్కరణలకు ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టింది. ఒకేసారి నాలుగు కీలక మార్పులకు ప్రతిపాదనలు చేసింది. రాష్ట్ర బోర్డును దాదాపుగా సీబీఎస్ఈ తరహాలోకి మార్చేలా సంస్కరణలు తీసుకురావాలని నిర్ణయించింది. సిలబస్- పాఠ్యపుస్తకాల సవరణ, కొత్త సబ్జెక్టుల కాంబినేషన్లు, పరీక్షల విధానంలో సమూల మార్పులు, ఫస్టియర్‌లో బోర్డు పరీక్షల తొలగింపు అంశాలపై ఇంటర్ బోర్డు కార్యదర్శి కృతికా శుక్లా బుధవారం తాడేపల్లిలోని ఆ సంస్థ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ ప్రతిపాదనలను బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, ఈ నెల 26 వరకు అభిప్రాయాలు, అభ్యంతరాలను biereforms@gmail.com మెయిల్ ఐడీకి పంపాలని కోరారు. విద్యారంగ నిపుణులతో ఓ సమావేశం నిర్వహించి ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని, ఇవి ప్రతిపాదనలు మాత్రమేనని స్పష్టం చేశారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులను కలిపేలా ఎంబైపీసీని ప్రతిపాదిస్తున్నామని, దీన్ని తీసుకున్నవారు ఇంజనీరింగ్, వైద్య వృత్తి రెండువైపులా వెళ్లొచ్చని చెప్పారు. ప్రస్తుతం గణితం 1ఏ, 1బీ, 2ఏ, 2బీలుగా ఉండగా ఒకే సబ్జెక్టుగా మారుస్తామని, బోటనీ, జువాలజీని కలిపి బయాలజీ సబ్జెక్టుగా మారుస్తామని, ఒక్కటే పేపర్ ఉంటుందని స్పష్టం చేశారు. ఇకపై ఫస్టియర్, సెకండియర్‌లో ఏటా 500 మార్కులతో పరీక్షలు ఉంటాయన్నారు. ప్రతి సబ్జెక్టులోనూ ప్రాక్టికల్స్/అంతర్గత మార్కుల విధానం తెస్తామని చెప్పారు. ఇంగ్లిష్‌లో 20 మార్కులు, ఎంపిక చేసుకునే రెండో సబ్జెక్టులో 20, గణితం/ బయాలజీలో 20, కెమిస్ట్రీలో 30, ఫిజిక్స్‌లో 30మార్కులు చొప్పున ఇంటర్నల్స్/ప్రాక్టికల్ మార్కులు ఉంటాయని వివరించారు. మొత్తంగా థియరీలో 380 మార్కులు, ఇంటర్నల్స్‌కు 120 మార్కులు ఉంటాయని తెలిపారు. ఆర్ట్స్ గ్రూపుల్లోనూ ఇంటర్నల్స్ ఉంటాయన్నారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో 500 మార్కుల చొప్పున పరీక్షలు జరిగినా, రెండో సంవత్సర పరీక్షలు మాత్రమే బోర్డు నిర్వహించాలని ప్రతిపాదించినట్లు శుక్లా చెప్పారు. ఫస్టియర్ పరీక్షలను కాలేజీలు సొంతగా నిర్వహించుకుంటాయన్నారు. మెయిన్ సబ్జెక్టుల్లో ఒకదానిలో ఫెయిల్ అయినా, ఆప్షనల్ సబ్జెక్టులో పాస్ అయితే ఇంటర్ ఉత్తీర్ణత సాధించినట్లు పరిగణిస్తామని చెప్పారు. ఆప్షనల్ సబ్జెక్టుతో కలిపి 5 సబ్జెక్టుల్లో తప్పనిసరిగా పాస్ కావాలన్నారు. సంస్కరణలు 2025-26లో ఫస్టియర్‌కు, 2026-27లో సెకండియర్‌కు అమల్లోకి వస్తాయని.. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, స్టేక్‌హోల్డర్స్ నుంచి వచ్చిన సూచనల ఆధారంగానే తుది నిర్ణయం ఉంటుందని, ఇప్పుడే ఫస్టియర్ పరీక్షలు రద్దు చేసినట్లు కాదన్నారు.

17 వర్సిటీలకు సెర్చ్ కమిటీల ఏర్పాటు

» వీసీల నియామకానికి వీలైనంత త్వరగా పేర్లు సిఫారసు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో వైస్ చాన్సలర్ల నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించింది. 17 వర్సిటీలకు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ కమిటీలు మూడు పేర్లను ప్రభుత్వానికి సిఫారసు చేస్తాయి. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి చైర్మన్‌గా రంగనాథ్



విజయవాడ(ఆటోనగర్), జనవరి8 (ఆంధ్రజ్యోతి): బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి క్యాపిటల్ సెంటర్ చైర్మన్‌గా గుడివాడ అమ్మ కన్‌స్ట్రక్షన్స్ అధినేత మాటూరి రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.నాగమల్లేశ్వరరావు ప్రకటించారు. బుధవారం విజయవాడలో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ, కోశాధికారిగా కె.పి.కిరణ్, ఉపాధ్యక్షులుగా పట్నాయక్, రాజేష్, సంయుక్త కార్యదర్శిగా వి.వెంకట నారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగ సమస్యల పట్ల సానుకూలంగా ఉండటం శుభ సూచకమన్నారు.

డయాఫ్రం వాల్‌పై నేడే కీలక భేటీ

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ నిర్మాణానికి సంబంధించి గురువారం కీలక సమావేశం జరుగనుంది. ప్లాస్టిక్ కాంక్రీట్ మిక్సర్ వాడకంపై అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ (ఐఈపీ) ఈ సందర్భంగా తన అభిప్రాయం వెల్లడించనుంది. సాయంత్రం ఆరున్నర గంటలకు డేవిడ్ బ్రియాన్ పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో (అమెరికా), సీన్ హించ్‌బెర్గర్, చార్లెస్ రిచర్డ్ డొనెల్లీ(కెనడా)తో కేంద్ర జల శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కాంట్రాక్టు సంస్థలు బావర్, మేఘా ఇంజనీరింగ్, కెల్లర్ ప్రతినిధులు వర్చువల్‌గా భేటీ అవుతారు. విజయవాడ నుంచి జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ప్రభుత్వ సలహాదారు-ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరవుతారు. మరోవైపు.. పార్లమెంటరీ స్థాయీ సంఘం సభ్యులు శనివారం (11న) పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో రెండ్రోజులు పర్యటిస్తారు.

విశాఖ సెంట్రల్ జైలులో మరో సెల్‌ఫోన్

» ఇప్పటి వరకు 4 స్వాధీనం

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కేంద్ర కారాగారంలో మరో సెల్‌ఫోన్ లభ్యమైంది. దీంతో ఇప్పటివరకు దొరికిన సెల్‌ఫోన్ల సంఖ్య నాలుగుకు చేరింది. గత నెల 31న చేపట్టిన తనిఖీల్లో రెండు, ఈ నెల మూడో తేదీన ఒకటి లభ్యమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జైలులో ఇంకా ఎన్ని సెల్‌ఫోన్లు ఉన్నాయో వెలికితీసేందుకు సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేశారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా జైలు సిబ్బంది మంగళవారం గంగా బ్లాక్ వద్ద పరిశీలిస్తుండగా పాత వంటశాల వెనుక భాగంలోని కాలువలో ఒక సెల్‌ఫోన్ కనిపించిందని జైలు డీఎస్పీ జవహర్‌బాబు తెలిపారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు

విజయవాడ (ధర్నాచౌక్), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జర్నలిస్టు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి పోరాడాలని ఐజేయూ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడిగా ఐవీ సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన కార్యక్రమానికి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ న్యాయవ్యవస్థలోనూ జర్నలిస్టులపై ప్రతికూల భావనలు వ్యక్తం కావడం బాధాకరమన్నారు. సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పేదలు బిల్లు కట్టకపోతే ఫీజులు పీకుతారు!

» రూ.కోట్లలో బకాయిలు పెడితే వసూలు చేయరా?

» టీడీపీ గ్రీవెన్స్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పేదలు ఒక నెల కరెంట్ బిల్లు కట్టకపోతే ఫీజులు పీక్కెళ్లే అధికారులు.. గుంటూరు జిల్లా చినకాకానిలోని టెక్స్‌టైల్స్ కంపెనీ రూ.కోట్లలో బకాయి పెట్టి, మూతపడినా, బిల్లు వసూళ్లలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో డిస్కంకు భారీ నష్టం జరిగిందని టీడీపీ గ్రీవెన్స్‌లో కె.వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ మంత్రి పీతల సుజాత, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అర్జీలు స్వీకరించారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూమిని వైసీపీ నేతలు కబ్జా చేసి, తమపై దౌర్జన్యం చేస్తున్నారని, వారి నుంచి ప్రాణహాని ఉందని నందివెలుగుకు చెందిన తోటకూర కోటేశ్వరరావు మొరపెట్టుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఢిల్లీ ఎన్నికలు

దేశ రాజధాని ఢిల్లీలో డెబ్బై అసెంబ్లీస్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరుగుతాయి, మరో మూడురోజుల తరువాత జనం ఎవరికి అధికారం కట్టబెట్టారో తేలిపోతుంది. పోటీ ప్రధానంగా ఆమ్ ఆద్మీ పార్టీ–బీజేపీ మధ్యే ఉందని, గతంలో పదిహేనేళ్ళు ఢిల్లీని ఏలిన కాంగ్రెస్, షీలాదీక్షిత్ అనంతరం చిక్కిశల్యమైనందున ఇప్పుడు ఉనికికోసం పోరాడుతోందని విశ్లేషకులు అంటున్నారు. కానీ, ఢిల్లీ నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన గత కాంగ్రెస్ పాలనను ప్రజలు మరిచిపోలేదని, ఆప్–బీజేపీ నిత్యకయ్యంతో విసిగివేసారిన జనం ఈ మారు తమకు ఓటేస్తారని ఆ పార్టీ నాయకుల వాదన. ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తు కుదరకపోవడం తమకు మేలుచేస్తుందని కూడా వారు నమ్ముతున్నారు. అవినీతి వ్యతిరేక పోరాటం నుంచి పుట్టుకొచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీని పాపాలపుట్టగా ముద్రవేయడం ద్వారా ఈమారు అధికారంలోకి రాగలనని బీజేపీ నమ్ముతోంది. శక్తిమంతుడైన లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేజ్రీవాల్‌ను ఎన్నిరకాలుగా ఇబ్బందిపెట్టవచ్చునో అన్నీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసింది. రెండు పర్యాయాలు ఢిల్లీని గెలుచుకొని, ముచ్చటగా మూడోమారు అధికారంలో కొనసాగడానికి ప్రయత్నిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ అధిక సంఖ్యలో సిట్టింగులను మార్చి, ప్రజాగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రయత్నిస్తోంది. అన్ని పార్టీలూ వాస్తవాలూ వాదనలతోకంటే ఉచితాలతోనే జనాన్ని సులువుగా గెలవవచ్చునన్న నమ్మకంతో వేల కోట్ల రూపాయల వరాలు కురిపిస్తున్నాయి.

ఢిల్లీ ఎన్నికల తేదీల ప్రకటనతో పాటుగానే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్నికల హామీల మీద కొన్ని విమర్శనాత్మకమైన వ్యాఖ్యలు చేశారు. ఉచితం సముచితంకాదు, చాలా రాష్ట్రాలు జీతాలకు కూడా వెతుక్కోవాల్సిన స్థితికి వచ్చేశాయి, ఉచితాల మీద ఓ కన్నేసి ఉంచుతాం అన్నారాయన. తమ హామీల వల్ల రాష్ట్రం మీద పడే ఆర్థిక భారాన్ని ప్రతీ పార్టీ ప్రజలకు తెలియచేయాలని కూడా ఆయన అన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఏమి చెప్పిందో, ఎన్నికల సంఘం ఏమి చేయబోతున్నదో కూడా ఆయన వివరించారు. ఈ సమస్య ఢిల్లీకి మాత్రమే పరిమితం కాదనీ, ఎన్నికలకు పోతున్న ప్రతీ రాష్ట్రమూ వరాల జల్లుల్లో తడుస్తున్నదని ఆయనకు తెలియనిదేమీ కాదు. ఇప్పుడు ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో అధికారంలో ఉన్న పార్టీలు కొత్త పథకాలేమీ ప్రకటించలేకపోవచ్చును గానీ, ఇప్పటికే చేతికి ఎముకలేనట్టుగా అన్ని పార్టీలు ప్రతీ ఓటరుకూ కచ్చితంగా ఎంతోకొంత ముట్టేట్టుగా నగదు బదిలీ పథకాలను ప్రకటించేశాయి. మూడురోజుల క్రితమే కాంగ్రెస్ కూడా 'ప్యారీ దీదీ యోజన' పేరుతో ప్రతీ మహిళకు నెలకు రెండున్నరవేలు ఇస్తానని హామీ ఇచ్చింది. కేజ్రీవాల్ ప్రకటించిన ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన కంటే ఇది నాలుగువందల రూపాయలు ఎక్కువ. రేవడీలను తప్పుబట్టే ప్రధాని మోదీ సైతం ఢిల్లీలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆప్ సంక్షేమ పథకాలేవీ రద్దుచేయబోదని గట్టి హామీ ఇచ్చారు. రోడ్లు, ఫ్లైఓవర్లు, కరెంటు, ప్రజా సౌకర్యాల గురించి గతంలో ఘనంగా చెప్పుకొనే పార్టీలు ఈ మారు ఉచితాల గురించే ఎక్కువగా మాట్లాడుతున్నాయని మేధావుల బాధ. భయానకమైన కాలుష్యం, నీరు, విద్యుత్ కొరతలు, పాడైన రోడ్లు, పరిమిత ప్రజారవాణా సహా పలు సమస్యలు ఢిల్లీ ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేస్తుంటే, వాటన్నింటినీ వదిలేసి జనానికి ఉపకరించని అంశాల చుట్టూ చౌకబారు విమర్శలతో ఎన్నికల ప్రచారం సాగుతోంది.

ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్నది అటుంచితే, ఏది వచ్చినా, ఢిల్లీ ప్రజలకు ఈ ఎన్నికలు గుర్తుండిపోతాయి. ఎన్నికల ప్రసంగాల్లో విమర్శలు కూడా లక్ష్మణరేఖను దాటేశాయి. ప్రధాని మోదీ సహా బీజేపీ నాయకులంతా తనను అవమానకరంగా విమర్శిస్తున్నారనీ, ప్రజల కోసం ఎటువంటి భాషనైనా భరిస్తానని కేజ్రీవాల్ బాధితుడి మొఖం పెడుతున్నారు. గత ఐదేళ్ళలో ఆయన, పార్టీలోని కొందరు సీనియర్ నాయకులు తీవ్రమైన అవినీతి ఆరోపణలు, కేసులు ఎదుర్కొన్నారు, జైలుశిక్ష అనుభవించారు. పొరుగు రాష్ట్రాల్లోకి కూడా విస్తరించగలిగిన ఆప్‌కు, తాను పుట్టిపెరిగిన ఢిల్లీని మళ్ళీ గౌరవంగా గెలుచుకోవడం మరింత ముఖ్యం. ఈ మారు కచ్చితంగా అలా జరగకుండా చేయాలన్నది ముప్పయ్యేళ్ళుగా అధికారంకోసం నిరీక్షిస్తున్న బీజేపీ పంతం.

గ్రంథాలయ శాస్త్రంలో అగ్రగణ్యుడు!

ఆరు దశాబ్దాల పాటు భారతదేశ గ్రంథాలయ శాస్త్రంలో అపూర్వ సేవలు అందించిన డాక్టర్ పి.ఎస్.జి. కుమార్ (పోగుల శేషగిరి కుమార్) జనవరి 3, 2025న తుది శ్వాస విడిచారు. లైబ్రరీ సైన్సెస్‌లో ఆయన చేసిన కృషికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. అందుకుగాను ఆయనకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది.

పి.ఎస్.జి. కుమార్ 1946 జూన్ 9న గుంటూరు జిల్లా బాపట్లలో జన్మించారు. ఆయన తండ్రి సాంబశివరావు, హోమియోపతి వైద్యుడిగా, గ్రంథాలయ నాయకుడిగా సేవలందించారు. తల్లి వెంకటరత్నమ్మ చిన్నవయసులోనే మరణించారు. తరువాత ఆయన అమ్మమ్మ బసవమ్మ, సవితి తల్లి భాగ్యలక్ష్మిల ఆధ్వర్యంలో పెరిగారు. ఆయనకు సోదరుడు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. 1972లో ఉదయశ్రీతో వివాహం జరిగింది. శైలజ, ఫణి భార్గవి ఇద్దరు కూతుర్లు.

పి.ఎస్.జి. కుమార్ ఎనిమిదవ తరగతిలో ఉన్నప్పుడు నాటకాల మీద ఆసక్తితో మిత్రులతో కలిసి 'ఆంధ్ర థియేటర్'ను స్థాపించారు. 1962లో రాష్ట్ర స్థాయి నాటక పోటీలలో ప్రథమ బహుమతి పొందారు. స్కూల్, కాలేజీ సమయంలో పెయింటింగ్, కథాకళి వంటి కళలలో నైపుణ్యం సాధించారు. 1969లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి గ్రంథాలయ శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ తీసుకున్నారు. తరువాత బెనారస్ విశ్వవిద్యాలయం నుండి మాస్టర్ డిగ్రీ, షఫీల్డ్ యూనివర్సిటీ నుండి డిప్లమా కోర్సు, గుల్బర్గా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పొందారు. 1972లో లక్నో కళాశాలలో ఉపన్యాసకుడిగా వృత్తి జీవితం ప్రారంభించారు. 1973లో నాగపూర్ విశ్వవిద్యాలయంలో ప్రభుత్వ ఉపన్యాసకుడిగా చేరారు. అక్కడ లెక్చరర్, రీడర్, ఆచార్యునిగా 29 సంవత్సరాలు సేవలందించారు. ముఖ్యంగా 24 సంవత్సరాలపాటు గ్రంథాలయ శాస్త్ర విభాగానికి అధిపతిగా వ్యవహరించారు. ఆయన ఆధ్వర్యంలో గ్రంథాలయ శాస్త్ర విభాగం సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి.



భారతదేశ లైబ్రరీ శాస్త్రంలో ఒక తెలుగువాడిగా పి.ఎస్.జి. కుమార్ విజయాలు మనందరికీ గర్వకారణం. ఆయన నాయకత్వంలో లైబ్రరీ ప్రొఫెషనల్స్‌కు సంబంధించిన సమర్థవంతమైన విధానాలు, నిబంధనలు రూపొందాయి.

ఆయన తన వృత్తి జీవితంలో అనేక గౌరవప్రదమైన పదవులను చేపట్టారు. ముఖ్యంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టీచర్స్ ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (IATLIS) అధ్యక్షులుగా సేవలందించారు. ఈ పదవిలో ఆయన గ్రంథాలయ శాస్త్ర ఉపాధ్యాయ సమస్యలపై విశేషమైన కృషి చేశారు, ఆ సమస్యల పరిష్కారాలకు నూతన మార్గాలను సూచించారు. ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ (ILA) అధ్యక్షునిగా 1994–96 వరకు పనిచేసిన పి.ఎస్.జి. కుమార్ లైబ్రరీ ప్రొఫెషనల్స్ హక్కులను, వారి అభివృద్ధికి అవసరమైన మార్పులను ప్రతిపాదించారు. ఆయన నాయకత్వంలో లైబ్రరీ ప్రొఫెషనల్స్‌కు సంబంధించిన సమర్థవంతమైన విధానాలు, నిబంధనలు రూపొందాయి. ఈ మార్పుల ద్వారా లైబ్రరీ రంగంలో సమానత్వం, అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణపై ముఖ్యమైన దృష్టికోణాలు వెలుగు చూసాయి.

పి.ఎస్.జి. కుమార్ భారతదేశ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రముఖ లైబ్రరీ, సమాచార సంస్థలతో సంబంధాలను కలిగి ఉన్నారు. ఆయన జాయింట్ కౌన్సిల్ ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్స్ ఇన్ ఇండియా (JOCLAI), సార్క్ దేశాల లైబ్రరీ అసోసియేషన్ (LASAARC) వంటి సంస్థలలో ఎడ్వైజరీ, నాయకత్వ పాత్రలను నిర్వహించారు. ఈ అన్ని స్థానాలూ ఆయన వృత్తి జ్ఞానాన్ని, లైబ్రరీ శాస్త్రానికి సంబంధించి అనేక అంశాలను అభివృద్ధి చేసేందుకు కీలకంగా పనిచేశాయి.

పి.ఎస్.జి. కుమార్ 70 పుస్తకాలు, 142 పరిశోధన పత్రాలు రచించారు. 'ఇండియన్ లైబ్రరీ క్రానాలజీ', 'ఇండియన్ ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్', 'యూనివర్సిటీ గ్రాంట్స్ కరిక్యులం సిరీస్', 'లైబ్రరీ ఇన్ ఇండియా సిరీస్' వంటి పుస్తకాలు ఆయనకు ఎంతో పేరు తెచ్చాయి. ఆయన తన రచనలను అనేక జాతీయ, అంతర్జాతీయ గ్రంథాలయ శాస్త్ర జర్నల్స్‌లో ప్రచురించారు. 'లైట్ అండ్ షేడ్స్ ఆఫ్ మై లైఫ్' అనే ఆత్మకథలో పి.ఎస్.జి. కుమార్ తన జీవితంలోని అద్భుత ఘట్టాలను, కష్టాలను, విజయాలను పాఠకులకు తెలియజేశారు. లైబ్రరీ శాస్త్రంలో చేసిన సేవలకు ఆయన 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు'ను అందుకున్నారు. 'డా. పి.ఎస్.జి. కుమార్ లైబ్రరీ ఫౌండేషన్'ను కూడా స్థాపించారు.

పి.ఎస్.జి. కుమార్ స్థాపించిన ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా లైబ్రరీ శాస్త్రం అభివృద్ధికి సహకరించే అనేక కార్యక్రమాలు, సేవలు కొనసాగించబడుతున్నాయి. ఈ ఫౌండేషన్ ఆయన ఆశయాలను ప్రతిబింబిస్తూ, లైబ్రరీ శాస్త్రంలో కొత్త దిశలో పరిశోధనలను ప్రోత్సహించడంలో, మరింత అవగాహన కల్పించడంలో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నది. భారతదేశ లైబ్రరీ శాస్త్రంలో ఒక తెలుగువాడిగా ఆయన విజయాలు మనందరికీ గర్వకారణం. ఆయన వేసిన దారిలో భారతదేశంలోనే గాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న లైబ్రరీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు కృషి చేస్తూనే ఉంటారు.

○ డా. రవికుమార్ చేగోని
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ గ్రంథాలయ సంఘం

ఆశ కలిగించి, ఆవిరైన 'భగవత్' బోధ!

దేశ మత సామరస్యం, ఆధ్యాత్మిక వైవిధ్యం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ చూడని సంక్షోభాన్ని, దాడిని ఎదుర్కొంటున్న సమయంలో, రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్‌ఎస్‌ఎస్) అధినేత వాటికి ప్రాణం పోసినట్టు మాట్లాడారు. మసీదుల కింద హిందూ ఆలయాలను వెతికి వివాదాలు రేకెత్తించడం మానుకొమ్మని ఆయన తన అనుచర గణాలకు పిలుపు ఇచ్చారు. గత డిసెంబరు 19న పూణేలో ఒక సభలో మాట్లాడుతూ భగవత్ ఈ హితబోధ చేశారు. దీనికి దేశంలోని సెక్యులర్‌వాదులు ఎంతో హర్షించారు. మైనారిటీ మతాల పెద్దలు కూడా సంతృప్తి చెందారు. నవశకం ప్రారంభం కాబోతోందా అనే ఆశాభావ వాతావరణం కనిపించింది.

అయోధ్య వివాదాస్పద స్థలం హిందూ సంస్థలకు, బాలరాముడికి చెందాలంటూ 2019లో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దానితో ఆ స్థలంలో బ్రహ్మాండమైన రామ మందిర నిర్మాణం జరిగింది. మొన్నటి లోక్‌సభ ఎన్నికలకు ముందు దాని మహా ప్రారంభోత్సవం జరిగింది. ఈ చర్యతో లోక్‌సభలో 400 స్థానాలు గెలుచుకుంటామని ఆశించిన బీజేపీకి 240 సీట్లే వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజలు ఎల్లకాలం ఆలయ సెంటిమెంట్లకు, పరమత ద్వేషానికే ప్రాధాన్యం ఇస్తారనే భ్రమలు వదులుకోవాలని, ప్రజల జీవన సమస్యలను పాలకులు పట్టించుకోనప్పుడు కేవలం విగ్రహ పుష్టితో ఓట్ల వృష్టి ఎంతోకాలం సాగదని ఈ ప్రజా తీర్పు హెచ్చరించింది. అయితే ఊతకర్రల మీద ఆధారపడి అధికారంలోకి వచ్చినా హిందుత్వ ఎజెండాను పూర్తిస్థాయిలో అమలు పరచడానికి బీజేపీ పాలకులు వెనుకాడటం లేదు. అయోధ్య విజయంతో బలం పుంజుకున్న పరివార్ శక్తులు ముస్లింలపై ద్వేషాన్ని రగిలించే కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలో గల షాహీ జామా మసీదుపై తాజాగా వివాదం లేవదీశారు. అక్కడ అంతకు పూర్వమున్న హరిహర ఆలయాన్ని కూల్చివేసి మొఘల్ చక్రవర్తి బాబర్ 1526లో ఆ మసీదును నిర్మించాడని స్థానిక కోర్టుకు వెళ్లారు. మసీదు సర్వేకి సంభాల్ కోర్టు గత ఏడాది నవంబర్ 19న ఆదేశించింది. అదే రోజు జిల్లా అధికారుల పర్యవేక్షణలో సర్వే నిర్వహించారు. రెండవసారి సర్వేకి నవంబర్ 24న అధికారులు తమ సిబ్బందితో వెళ్లడంతో మసీదును కూల్చివేయడానికి వచ్చారనే భయం కమ్ముకొని పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకున్నారు. జనాన్ని అదుపు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగారు. ఆ ఘర్షణల్లో అయిదుగురు దుర్మరణం పాలయ్యారు.


akbar

ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ వ్యాఖ్యల్లో వ్యక్తమైన సర్వమత సామరస్యం, సమధర్మం భారత రాజ్యాంగ స్ఫూర్తి అయిన సెక్యులరిజానికి చేరువైనది. కానీ, పరివార్ శక్తులు తన వ్యాఖ్యలపై వ్యతిరేకంగా స్పందించిన తర్వాత ఆయన ఇక కిమ్మనలేదు.

మసీదులు, దర్గాల కింద ఆలయాలున్నాయని, వాటి పునరుద్ధరణకు ఆదేశించాలని కోరుతూ హిందూ సంస్థలు స్థానిక కోర్టులకు ఎక్కితే, కొన్ని కోర్టులు అటువంటి మసీదులపై సర్వేకి ఆదేశించాయి. వారణాసిలో 1670లో నిర్మించిన గ్యాన్‌వాపి మసీదు వివాదం ఇందులో ముఖ్యమైనది. దీని కింద విశ్వనాథుని ఆలయం ఉందని ఆలయ పునరుద్ధరణ శక్తులు వాదిస్తున్నాయి. 1669లో ఔరంగజేబు ఆదేశాలపై అక్కడి విశ్వనాథ ఆలయాన్ని కూల్చివేసి ఆ శిథిలాల మీద మసీదు నిర్మించారన్నది వారి వాదన. మసీదు దక్షిణ భాగంలో పూజలు చేసుకోడానికి స్థానిక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులతో క్షణం జాగు చేయకుండా అక్కడ ఆరాధన ప్రారంభించారు. ఇది 2024 ఫిబ్రవరి 1న జరిగింది. అందుకు నిరసన సంకేతంగా ఆ మరుసటి రోజు శుక్రవారం నాడు అసాధారణ స్థాయిలో 3000 మంది ముస్లింలు ఆ మసీదులో ప్రార్థనకు హాజరయ్యారు. గ్యాన్‌వాపికి కూడా బాబ్రీ మసీదుకు కలిగిన పరిస్థితే కలుగుతుందని వారు భయపడుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మధురలో కృష్ణుడి గుడిని కూల్చివేసి ఔరంగజేబు అక్కడ షాహీ దర్గాను కట్టాడన్నది మరో వివాదం. ఈ వివాదాలు దేశంలో మత సామరస్యాన్ని దారుణంగా దెబ్బ తీస్తూ ఎక్కడికక్కడ మందుపాతరలను సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో– నాయకులం అయిపోవాలనే అత్యాశతో మసీదుల కింద శివలింగాల కోసం వెతకడం మానుకోండని మోహన్ భగవత్ హెచ్చరించడం బాగుంది. 'ప్రతి రోజూ ఒక కొత్త వివాదాన్ని రేకెత్తిస్తుంటే దానిని ఎలా అనుమతిస్తారు? ఇది ఇలా కొనసాగడానికి వీల్లేదు. మనం కలిసి బతకగలమని చూపించాలి,' అని కూడా భగవత్ హితవు చెప్పారు. 'ప్రపంచానికి శాంతి సామరస్యాలు కావాలి, భారతదేశం తన భిన్నత్వంలో ఏకత్వ సంప్రదాయాన్ని, అందరినీ కలుపుకొనిపోయే సమ్మిళిత తత్వాన్ని ప్రదర్శించి విశ్వగురువుగా నిరూపించుకోవాలి' అని కూడా అన్నారు ఆయన.

భగవత్ పూణే ప్రసంగం సద్దుమణగకముందే ఆర్‌ఎస్‌ఎస్ సోదర సంస్థలు తాము అందుకు అంగీకరించబోమని కరాఖండిగా స్పష్టం చేశాయి. మతసంబంధ విషయాల్లో మతసంస్థలే నిర్ణయం తీసుకోవాలి కాని ఆర్‌ఎస్‌ఎస్ కాదని అఖిల భారతీయ సంత్ సమితి దృఢంగా ప్రకటించింది. మత నాయకుల నిర్ణయాలను ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు గౌరవించాలని కూడా సంత్ సమితి స్పష్టం చేసింది. మసీదులను కూల్చి ఆలయాలు నిర్మించవలసిన స్థలాలు ఇంకా 56 ఉన్నాయని ఈ సమితి ప్రధానకార్యదర్శి స్వామి జితేంద్రానంద సరస్వతి వెల్లడించారు. మోహన్ భగవత్ తమను శాసించలేరని, ఆయనకు ఆ స్థాయి లేదని జగద్గురు రామభద్రాచార్య అభిప్రాయపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్ వార పత్రిక 'ది ఆర్గనైజర్' మోహన్ భగవత్ హితబోధను సుతిమెత్తగా చెత్త బుట్టకు చేరవేసింది. 'మసీదుల కింద గల గుడులను పునరుద్ధరించాలన్నది మన జాతీయతా గుర్తింపు సంబంధమైనది, నాగరికతా న్యాయం కోసం ఉద్దేశించినది. దీనిని కుహనా సెక్యులర్ అద్దంలో హిందూ ముస్లిం గొడవగా చూడరాదు' అని ఆ పత్రిక తన సంపాదకీయంలో పేర్కొని, అలా అధినేత మాటనే కొట్టిపారేసింది. ఈ దేశానిది హిందూ జాతీయతేనని నొక్కివక్కాణించింది.

మోహన్ భగవత్ వ్యాఖ్యల్లో వ్యక్తమైన సర్వమత సామరస్యం, సమధర్మం భారత రాజ్యాంగ స్ఫూర్తి అయిన సెక్యులరిజానికి చేరువైనది. పరివార్ శక్తులు ఆయన వ్యాఖ్యలపై వ్యతిరేకంగా స్పందించిన తర్వాత ఇక భగవత్ కిమ్మనలేదు. ప్రధాని మోదీ గాని, హోమ్ మంత్రి అమిత్ షా గాని నోరు విప్పలేదు అంటే వారు కూడా మోహన్ భగవత్ మాటను గౌరవించడం లేదనుకోవాలి.

1991 నాటి ప్రార్థనా మందిరాల చట్టంపై తన తీర్పు వెలువడే వరకు మసీదుల కింద మందిరాలున్నాయని వాదిస్తూ వాటిపై సర్వే జరిపించాలని కోరే వ్యాజ్యాలను అనుమతించరాదని దేశంలోని కోర్టులన్నిటికీ సుప్రీంకోర్టు డిసెంబర్ 13న ఆదేశాలు జారీ చేసింది. రాజ్యాంగంలోని సమానత్వ హక్కును, 'సౌభ్రాత్రం' అనే పదాన్ని గమనిస్తే సెక్యులరిజం రాజ్యాంగ ప్రధాన లక్షణమని బోధపడుతుంది అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. సెక్యులరిజం ఎల్లప్పుడూ రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమేనని ధ్రువపరిచింది. రాజ్యాంగ పీఠిక నుంచి సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని వేసిన కేసులను గత నవంబర్ 25న కొట్టివేస్తూ ఈ అభిప్రాయాన్ని ప్రకటించింది.

దేశంపై హిందూ రాజ్యాన్ని, హిందూ సంస్కృతిని రుద్దాలన్నది ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని సర్దార్ వల్లభభాయ్ పటేల్ స్వయంగా అన్నారు. అటువంటి సంస్థ అధినేత చేసిన మతసామరస్య ఉద్బోధ వెనువెంటనే అపహాస్యం పాలుకావడం ఆశ్చర్యపోవలసిన విషయం కాదు. వాస్తవానికి నిజమైన హిందూమతావలంబులు ఎవ్వరూ హిందుత్వ మోదీత్వ శక్తుల మతవైరతత్వాన్ని మెచ్చరు. దేశంలో ఇంతకాలంగా భిన్న మతస్థుల మధ్య సహజీవన సామరస్యాలు సురక్షితంగా కొనసాగాయంటే అది ఇక్కడి బహుళత్వ సంస్కృతి గొప్పదనమే. దానిని వమ్ము చేయడానికి జరుగుతున్న కుట్ర కొంతైనా ఆగుతుందేమోనన్న ఆశ కల్పించిన భగవత్ ఉద్బోధకు ఈ గతి పట్టడం బాధాకరం. ప్రజల్లో ప్రజాస్వామ్యం, సెక్యులరిజం పట్ల గౌరవ అభిమానాలను పెంచడానికి ప్రజాస్వామిక శక్తులు పునరంకితం కావడమొక్కటే శరణ్యం.

▪ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

భయం పీడ నుంచి బయటపడేయండి!

ఒక వ్యక్తి ముఖ్యమంత్రిగా మళ్ళీ అధికారంలోకి వస్తే, 'వామ్మో'... అన్న ఆందోళన బహుశా ఏ రాష్ట్రంలోనూ ఉండకపోవచ్చు. ఇది ఏపీలోనే ఆందోళనగా మారింది. జగన్ అంటే ఎందుకు అంతగా భయం? అంటే ఐదేళ్ళ జగన్మోహన్‌రెడ్డి పరిపాలన చూసాక, అందరికీ కలిగిన అభిప్రాయం ఇదే! బాధ్యత కలిగిన పాలకుడిగా ఆయన వ్యవహరించలేదు. ఏదో పందెంలో బానిసలను గెలుచుకున్న యజమానిలా రాష్ట్రాన్ని గెలుచుకున్నట్టు భావించారు. తానే సర్వాంతర్యామి అన్నట్లుగా తలబిరుసుతో ప్రవర్తించారు. అంతా నా ఇష్టం అన్న ధోరణిలోనే ఐదేళ్ళ 'కథ' నడిపించారు. రాష్ట్రంలోని సర్వ వ్యవస్థలు తన పాదాల కింద దాసోహంలా ఉండాలి అన్న ధోరణిలోనే శాసించారు. ఐఏఎస్, ఐపీఎస్, తుదకు న్యాయస్థానాలలో కూడా తన మాట చెల్లుబాటు అయ్యేలా పాలించారు.

మాజీ సభాపతి కోడెల శివప్రసాద్ ఆత్మహత్య సంఘటనలోనూ; ఎంపీ రఘురామ కృష్ణంరాజు అరెస్టు విషయంలోనూ; దేవినేని ఉమ, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ధూళిపాళ నరేంద్ర వంటి ముఖ్యమైన నాయకుల అరెస్టులు ఇందుకు నిదర్శనం. నిజానికి వీరు చేసిన భారీ నేరాలు, భారీ మోసాలు ఏమీ లేవు. ఏదైనా ఉన్నా, విచారించే కేసులే తప్ప, అరెస్టులు చేసి, వేధించి జైళ్ళకు పంపేవి కావు. 70 ఏళ్ళ రంగనాయకమ్మ, 73 ఏళ్ళ జర్నలిస్ట్ అంకబాబు వంటి వారిపైనా ఇదే తరహా దాడి. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్, ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావులకూ మినహాయింపు లేదు. మహిళలపై అత్యాచారాల సంఘటనల పట్ల చలనం లేదు. దళితుల శిరోముండనాలు, మూత్ర విసర్జనలను పట్టించుకోలేదు. అమరావతి రైతుల ఉద్యమం పట్ల ఒక ముఖ్యమంత్రిగా వ్యవహరించాల్సిన తీరు ఇసుమంతైనా వ్యక్తం చేయలేదు. కోర్టుల్లో కూడా అధికారులను చేతులు కట్టుకొని నిలబడేలా చేశారు. చంద్రబాబు ఇంటిపై, మంగళగిరి పార్టీ కార్యాలయంపై దాడులు చేయించారు. చంద్రబాబు అరెస్టు విషయంలో కూడా వెనక్కి తగ్గలేదు. అమర్ రాజా బ్యాటరీని తరిమికొట్టి, దాని యజమాని గల్లా జయదేవ్‌ను రాజకీయాల నుంచి దూరం చేశారు. లులూ మాల్‌ను రాకుండా చేశారు. కియా కంపెనీని బెదిరించారు. దీంతో చాలా మంది రాష్ట్రం వదిలి వెళ్లి పోయారు.

ఇప్పటికీ జగన్ పాలనా కాలంలో జరిగిన నేరాలు, ఘోరాలు, మోసాలు తవ్వేకొద్దీ వస్తూనే ఉన్నాయి. ముంబై నటి కాదంబరి సంఘటన, కాకినాడ పోర్ట్ భూముల బెదిరింపుల వ్యవహారం, రేషన్ బియ్యం తరలింపు, పేర్ని నాని ఉదంతం, రిషికొండ ఖర్చు, సోషల్ మీడియా వంటి చాలా అంశాలు వెలుగు చూస్తునే ఉన్నాయి. ఏపీకి వచ్చే పారిశ్రామికవేత్తలు రేపటి భవిష్యత్తు గురించి భయపడుతున్నారంటే గత ఐదేళ్ళ పాలనా రక్తపు మరకల గుర్తులే కారణం. పారిశ్రామికవేత్తలు ఏపీకి వచ్చేందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు అన్న మాట ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ నోట వస్తున్నదంటే పారిశ్రామికవేత్తల భయానికి నిలువెత్తు నిదర్శనం ఇది. ప్రజా రాజధాని అమరావతి భద్రతపై కూడా ప్రశ్నలు లేకపోలేదు. మూడు రాజధానుల అంశాన్ని ఇప్పటికీ జగన్ వెనక్కి తీసుకోకపోవడం గమనార్హం. మళ్ళీ మేం అధికారంలోకి రాగానే సప్త సముద్రాల ఆవల ఉన్న లాకొచ్చి, అందరినీ జైల్లో పెడతాం అని ఇప్పటికీ జగన్ బెదిరిస్తున్నారు. చంద్రబాబు అప్పటికి బతికుంటే, మళ్ళీ జైలుకు పంపుతాం అంటున్నారు ఎంపీ విజయసాయిరెడ్డి. మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా పులి పంజా విసురుతోందని అంటున్నారు. అంటే వాళ్ళు కలగనేది జరిగితే, భవిష్యత్తు ప్రశ్నార్థకం అనే కదా?

మరోవైపు జగన్ కేసులకు పదేళ్ళు పైబడినా పరిష్కారం లభించలేదు. సీబీఐ, ఈడీ వంటి విచారణ సంస్థలు కూడా జగన్ కేసుల పర్వాన్ని మహాభారతం టీవీ సీరియల్‌లా నడిపించటం జగన్ బలానికి ప్రధాన కారణం కావచ్చు. కేంద్ర ప్రభుత్వం అండతోనే జగన్ కేసులు సుదీర్ఘ విచారణ దిశగా సాగుతున్నాయి అంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఘనాతిఘన విజయం ఇచ్చినా, అందులో బీజేపీ భాగస్వామ్యంగా ఉన్నా, పరిస్థితిలో మార్పు పెద్దగా కనిపించటం లేదు. జగన్ భయాలకు కూటమి ప్రభుత్వం ఖచ్చితంగా సమాధానం చెప్పాలి. శాంతిభద్రతలు లేనిచోట అభివృద్ధి ఉండదు అని గ్రహించాలి. రాష్ట్రాన్ని అభివృద్ధితో పాటు భయం పీడ నుంచి బయటపడేలా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

— పోతుల బాలకోటయ్య, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షులు

సినిమా ఒక విచిత్రమైన సరుకు!

మొన్నటి డిసెంబరు నెలాఖరులో, ఆ సంవత్సరంలో వచ్చిన సినిమాలు ఎన్నో; అవి ఎన్ని కోట్లు వసూలు చేశాయో; ఎన్ని సినిమాలు ఘోరంగా దెబ్బ తిన్నాయో; ఏ హీరో రేటు ఎన్ని కోట్లుగా పెరిగిందో– వగైరా వగైరా వార్తలూ, లెక్కలూ పత్రికల్లోనూ, టీవీ చానళ్ళలోనూ వచ్చాయి. 2024వ సంవత్సరంలో దాదాపు 160 తెలుగు సినిమాలు విడుదలయ్యాయట! వాటిల్లో ఒక పదో, పదకొండో మాత్రమే బ్రహ్మాండంగా ఆడి, భారీ వసూళ్ళు సాధించాయట! ఒక సినిమా 300 కోట్లు! ఇంకోటి 500 కోట్లు! మరొకటి 1000 కోట్లు! ఒక సినిమా అయితే, 1800 కోట్లు వసూలు చేసిందట! కానీ, బొత్తిగా ఆడని, పెట్టిన పెట్టుబడిలో కనీసం కూడా రాని, సినిమాలే ఎక్కువట! అలా నష్టపోయిన నిర్మాతలు ఎందరోనట! ఒక నిర్మాత, గుండెపోటు వచ్చి ఆస్పత్రి పాలయ్యాడనీ; ఇంకో నిర్మాత, ఉన్న ఆస్తులన్నీ అమ్మేసుకుని అప్పులు తీర్చి బికారి అయ్యాడనీ; మరొక నిర్మాత ఇంటి ముందు, సినిమాకి అప్పులిచ్చిన వాళ్ళు ధర్నా చేశారనీ– ఇలాంటి వార్తలు కూడా విన్నాం. ఈ మధ్య సినిమాలు తియ్యడానికి అప్పులిచ్చేవాళ్ళు (ఫైనాన్షియర్లు) ఆ నిర్మాతలకి సంబంధించిన ఆస్తుల పత్రాలు ముందే తీసుకుని పెట్టుకుంటున్నారట!

కొన్ని సినిమాలే బాగా ఆడడమూ, ఎక్కువ సినిమాలు ఆడకపోవడమూ అనే దానికి –కథ, దర్శకత్వం, నటన, సంగీతం, పబ్లిసిటీ వంటి –అనేక కారణాలుంటాయి. అవన్నీ ఇక్కడ చర్చించలేం. ఒక ముఖ్యకారణం మాత్రం, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో, ఏ ఒక్క సరుకుకి సంబంధించీ కూడా, ఆ సరుకుని తయారు చేయించే పరిశ్రమదారులకు, ఒక ఉమ్మడి ప్లాను అంటూ ఉండకపోవడం! ఎందుకంటే, ప్రైవేటు పెట్టుబడిదారులు –వాళ్ళు సబ్బుల పెట్టుబడిదారులైనా, సినిమాల పెట్టుబడిదారులైనా– ఎవరికి వారు, తమ సరుకుల్ని పెద్ద ఎత్తున అమ్ముకోగల మనుకుంటారు. ఉదాహరణకి, ఒక ప్రాంతంలో ఉన్న జనాభాకి ఎన్ని సబ్బులు అవసరమో, ఆ సంఖ్యకి కొంచెం అటూ ఇటూగా, వాటిని తయారు చేయించరు. వంద సబ్బులు అవసరమైన చోట, వెయ్యి సబ్బులు తయారు చేయిస్తే, వాటిని వాడేవాళ్ళెవరు? సినిమాలైనా అంతే! జనాలు నెలకి ఒక కొత్త సినిమా చూస్తారనుకుంటే, పది పన్నెండు కాకుండా, ఏకంగా 160 సినిమాలు తీస్తే, ఎంత బాగున్నా, ఎన్నని చూస్తారు? దీన్నే 'అమితోత్పత్తి' అంటారు. పెట్టుబడిదారీ సమాజానికి ఉన్న ఈ లక్షణాన్ని 'అంటువ్యాధి'గా వర్ణిస్తాడు మార్క్సు. మార్కెట్‌లోకి, అవసరాన్ని మించి కుప్పలు తెప్పలుగా సరుకులు వచ్చి పడుతోంటే, అన్నిటికీ ఒకే రకమైన డిమాండు ఉండదు గదా!

సినిమా తియ్యడానికి, 'పెట్టుబడి' పెట్టడమూ, 'లాభాలు' సంపాదించడమూ జరుగుతుంది కాబట్టి, సినిమా కూడా పెట్టుబడిదారీ పరిశ్రమే. 'సినిమా ప్రదర్శన' ఒక 'అమ్మకం సరుకు.' టిక్కెట్లు కొని, సినిమాని చూడడం అంటే, అది ఆ సరుకుని కొనడమే. అన్ని సరుకుల తయారీలో లాగే, సినిమా అనే సరుకు తయారీలో కూడా కావలిసినవి రెండు. 1) ఉత్పత్తి సాధనాలు (కెమెరాలూ, మేకప్ సామాన్లూ, బట్టలూ, సెట్టింగులూ వగైరాలు). 2) ఉత్పత్తిదారులు (డైరెక్టర్లూ, నటీనటులూ, టెక్నీషియన్లూ, వగైరాలు). అయితే, ఈ ఉత్పత్తిదారుల్లో రచనా, డైరెక్షనూ, నటనా, సంగీతమూ – వంటి 'కళాత్మక నైపుణ్యాలు' కొన్ని అవసరం అవుతాయి. కుండల్ని తయారు చెయ్యడంలోనూ, చెప్పుల్ని కుట్టడంలోనూ కూడా నైపుణ్యాల్లో తేడాలు ఉంటాయి. అటువంటి వస్తువుల్ని తయారు చేసే శ్రమల కన్నా, రచనా, గానం, నటనా – వంటి నైపుణ్యాల విషయాలు వేరు. వీటికి 'కళ' అనే ఒక వేరే లక్షణం కలుస్తుంది. సినిమా వంటి పరిశ్రమలు 'నిజం కళల్ని' వదిలేసి, 'వ్యాపార కళల్ని' పడతాయి!

ఏ 'సరుకు' విషయంలో అయినా, దాని తయారీకి అవసరమయ్యే పాతా–కొత్తా 'శ్రమల మొత్తమే, దాని విలువ'. ఆ సరుకుని అమ్మితే వచ్చే డబ్బు, ఆ సరుకు 'విలువే.' సప్లై, డిమాండ్లని బట్టి, ఏదైనా మార్పు జరిగితే, ఆ 'విలువ' కన్నా, అమ్మకం ధర, కొంత తగ్గడమో, పెరగడమో జరుగుతుంది. 'సినిమా'ని కూడా ఒక 'అమ్మకం సరుకు'గానే అర్థం చేసుకోవాలి. ఒక సినిమాని తయారుచెయ్యడానికి, 'ఉత్పత్తి సాధనాల ఖర్చు'ని, 'లక్ష' అనుకుందాం. డైరెక్టర్ నించీ, లైట్ బాయ్ వరకూ తీసుకునే ఛార్జీల ఖర్చుని, '2 లక్షలు' అనుకుందాం. (ఉదాహరణ తేలిగ్గా ఉండడం కోసం 'లక్ష' అనే అతి చిన్న మాట వాడుతున్నాం. అసలైతే, సినిమాలు తీయడానికి యాభై లక్షలు తక్కువ కాకుండా, వెయ్యి కోట్ల వరకూ ఖర్చు పెడతారట!) ఆ సినిమా కోసం ఖర్చులు పెట్టిన నిర్మాతకి వచ్చిన లాభాన్ని, '1 లక్ష' అనుకుందాం. నిర్మాత చేతికి వచ్చేది లాభం! అంటే, ఆ సినిమా ప్రదర్శనలు పూర్తి అయ్యేటప్పటికి, దాని వల్ల మొత్తం రావలిసిన డబ్బుని, ఈ ఉదాహరణలో 4 లక్షలు అనుకోవాలి. అందులో నించి 'ఉత్పత్తి సాధనాల మొదటి లక్షని' తీసేస్తే, మిగిలిన 3 లక్షలూ, ఆ సినిమా తయారీ కోసం శ్రమలు చేసిన నటులతో కలిసి, మిగతా శ్రామికులందరిదీ అవుతుంది.

ఉదాహరణకి, 4 లక్షల ఖర్చుతో తయారైన ఒక సినిమాకి, 'డిమాండ్' పెరిగిపోయి, ఎక్కువ మంది చూసి, ఎక్కువసార్లు చూసి, దానికి మొత్తం మీద 1 కోటి డబ్బు వచ్చిందనుకుందాం. ఆ డబ్బు ఎక్కడి నించి వచ్చినట్టు? ఆ సినిమా తయారుకావడానికి జరిగిన రకరకాల శ్రమల నించే వచ్చినట్టు. ఆ సినిమా వల్ల 1 కోటి డబ్బు వచ్చిందంటే, ఆ కోటిలో నించి, 'ఉత్పత్తి సాధనాల' లక్షని తీసివేస్తే, ఇంకా మిగిలే 99 లక్షలూ, ఆ సినిమా తయారీలో శ్రమలు చేసిన కార్మికుల 'శ్రమ విలువే!' కానీ, ఆ శ్రమ విలువ రెండు భాగాలుగా ఉంటుంది. ఒకటి: సినిమా తీయడానికి అవసరమైన శ్రమలు చేసిన వారికి (లైట్ బోయ్ నించీ సూపర్ స్టార్ వరకూ అనేక మందికి) ఇచ్చిన జీతభత్యాలు. రెండు: ఆ శ్రామికులు, తాము జీతాలుగా పొందిన దానికన్నా అదనంగా చేసే శ్రమ విలువ. (అదే అదనపు విలువ! దాన్ని పెట్టుబడిదారుడు 'లాభం' అంటాడు.)

ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. సినిమాకి డిమాండ్ పెరిగి, ఎక్కువ టిక్కెట్లు అమ్ముడై, ఆ రకంగా వచ్చిన డబ్బు, ఎన్ని కోట్లు వస్తే, అన్ని కోట్లూ, సినిమా కార్మికుల శ్రమ విలువే అవుతుందా? ఈ విషయం గురించి వివరంగా చర్చించడానికి ఇక్కడ చోటు చాలదు. క్లుప్తంగానే చూడగలం! ఒక నటి గానీ, నటుడు గానీ, డైరెక్టర్ గానీ, ఎక్కువ డిమాండ్‌తో పదేసి లక్షలో, కొన్ని కోట్లో తీసుకున్నారనుకుందాం. అది వాళ్ళ 'ధర' అన్నమాట! అలా తీసుకుంటే, వాళ్ళు ఎంత ఎక్కువ తీసుకుంటే, ఆ ఎక్కువ అంతా, వాళ్ళ శ్రమ విలువేనా?– దీనికి జవాబు, 'కొంతవరకూ అవును', 'కొంతవరకూ కాదు' అని! పెట్టుబడిదారీ సమాజం మొత్తంలో, అనేక సరుకుల తయారీ కోసం జరిగే శ్రమల విషయంలో, జనరల్ సూత్రంగా చూస్తే, ఇది నిజమే! కానీ, మార్క్సు వివరించినట్టు కొన్ని ప్రత్యేక సందర్భాలలో "విలువ పరిమాణానికీ, డబ్బు రూపంలో దాని వ్యక్తీకరణకీ మధ్య" పొంతనే వుండదు ('ఇన్ కన్సిస్టెన్సీ'). ఈ పాయింటుని వివరించడానికి, మార్క్సు, 'పరువు, ప్రతిష్ఠ' అనే విషయాల్ని ఉదాహరణగా తీసుకుంటాడు, ఇలా: "డబ్బు అనేది, సరుకుల విలువల రూపం మాత్రమే అయినప్పటికీ, ధర అనేది విలువను బొత్తిగా వ్యక్తం చెయ్యకపోవచ్చు. 'అంతరాత్మ, గౌరవం' (కీర్తి, పరువు ప్రతిష్ఠలూ) వగైరాలు, తమంత తాముగా సరుకులు కానప్పటికీ, వాటి యజమానులు, వాటిని అమ్మకానికి పెట్టడం సాధ్యమే! ఆ రకంగా వాటి ధర వల్ల అవి సరుకుల రూపం ధరిస్తాయి. కనుక, విలువ అనేది లేని వస్తువులకు సైతం ధర అనేది వుండవచ్చు. అటువంటి సందర్భాలలో, ధర అనేది... ఊహాత్మకం!" (కాపిటల్-1, 'సరుకులూ, డబ్బూ' చాప్టరులో.)

మార్క్సు వివరణని, సినిమాలకి అన్వయించి చూద్దాం. ఉదాహరణకి, ప్రేక్షకుల్లో 'గౌరవాన్ని' (అభిమానాన్ని) సంపాదించిన–అంటే, డిమాండు ఉన్న–ఒక హీరో చేసే నటన అనే శ్రమకీ, దాని కోసం అతను తీసుకునే కోట్ల డబ్బుకీ పొంతన ఉండదు. అతను, తన పట్ల ప్రేక్షకులకు ఉన్న అభిమానానికి కూడా ఒక ధర పెట్టి, దాన్ని ఒక సరుకుగా అమ్మకానికి పెడతాడన్నమాట! అందుకే, 2024 సంవత్సరంలో, తెలుగు సినిమాల్లో హీరోలు కొందరు 30 కోట్లూ, కొందరు 50, కొందరు 100, కొందరు 200 కోట్లూ తీసుకున్నారట! ఈ మధ్య విడుదలై, తొక్కిసలాట జరిగిన సినిమాలో, హీరో 350 కోట్లు తీసుకున్నాడని ఒక వార్త. ఇది నిజమైనా కాకపోయినా, ప్రేక్షకుల్లో డిమాండు ఉన్న హీరోలు, కోట్లలో డబ్బుని డిమాండ్ చేస్తారనేదాన్ని నమ్మకుండా ఉండనక్కురలేదు. 'డిమాండ్ల' పేరుతో, తాము చేసే 'నటన' అనే శ్రమకి, లక్షలూ, కోట్లూ సంపాదించే పెద్ద పెద్ద సినిమా నటీనటులందరినీ 'శ్రమ దోపిడీ వర్గం'లో జమ కట్టెయ్యవచ్చు! కారణం, వాళ్ళ ఆస్తులూ, అహంకారాలూ, విలాసాలూ, వ్యసనాలూ!

హీరోలూ, హీరోయిన్లూ, డైరెక్టర్లూ, సినిమాల కోసం చేసే శ్రమకీ, ఆ శ్రమకి బదులుగా తీసుకునే కోటాను కోట్ల డబ్బు రాశులకీ, ఏ సంబంధమూ లేని పరిస్థితే, సినిమాని, మిగతా సరుకుల ప్రపంచం నించీ భిన్నమైన, ప్రత్యేకమైన, ఒక విచిత్రమైన సరుకుగా చేస్తుంది!


ప్రేక్షకుల్లో 'గౌరవాన్ని' (అభిమానాన్ని) సంపాదించిన– అంటే, డిమాండు ఉన్న– ఒక హీరో చేసే నటన అనే శ్రమకీ, దానికోసం అతను తీసుకునే కోట్ల డబ్బుకీ పొంతన ఉండదు. అతను, తన పట్ల ప్రేక్షకులకు ఉన్న అభిమానానికి కూడా ఒక ధర పెట్టి, దాన్ని ఒక సరుకుగా అమ్మకానికి పెడతాడన్న మాట!


srini

• రంగనాయకమ్మ

మంచు దారిలో..

బారెడు పొద్దెక్కినా పొగమంచు నగరాన్ని వీడట్లేదు. ఉదయం 9 గంటలైనా బయటకు రావాలంటే వెన్నులో వణుకు పుడుతోంది. ఇక జాతీయ రహదారిపై వెళ్తున్న వారి పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. ఎదురుగా వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని దుస్థితి. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో నగరంలోని కనకదుర్గమ్మ వారధి కొంతదూరం ఇలా మంచులో కనుమరుగై కనిపించింది.


కనకదుర్గమ్మ వారధి వద్ద..


6లో

పుస్తక ప్రపంచం


8లో

ఉత్కంఠగా..

వాలీబాల్ పోటీలు

సంక్రాంతి బిజీనెస్

కిటకిటలాడుతున్న షాపింగ్ మాల్స్

- రద్దీగా మారిపోయిన బీసెంట్ రోడ్డు
- లెనిన్‌సెంటర్, బందరు రోడ్డుల్లోనూ ఇదే పరిస్థితి
- మల్టీప్లెక్స్ మాల్స్‌లోని షాపులు కిటకిట
- పండుగ నేపథ్యంలో భారీ ఆఫర్ల ప్రకటన


బీసెంట్ రోడ్డులో వినియోగదారుల రద్దీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సంక్రాంతి షాపింగ్‌ల సందడి తారస్థాయికి చేరింది. వారం రోజులుగా నగరంలోని వస్త్ర దుకాణాలు కిటకిటలాడుతూనే ఉన్నాయి. చిన్నచిన్న వస్త్ర దుకాణాల నుంచి భారీ షోరూమ్‌లు, మల్టీప్లెక్స్ స్టోర్‌ల వరకు అన్నీ కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది పది రోజుల పాటు సెలవులు రావటం, దూరప్రాంతాల నుంచి బంధువులు వస్తుండటం, సకుటుంబ సమేతంగా సొంతూర్లకు వెళ్తుండటంతో అందరికీ పండుగ దుస్తులు కొనేందుకు షాపులకు తరలివస్తున్నారు. బీసెంట్ రోడ్డు ఇసుకేస్తే రాలనంతగా కిక్కిరిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లానే కాకుండా కోస్తా జిల్లాల నుంచి కూడా బీసెంట్ రోడ్డుకు షాపింగ్ కోసం వస్తున్నారు. ఆ తర్వాత లెనిన్ సెంటర్‌లో కూడా ఆ స్థాయిలోనే కొనుగోళ్లు జరుగుతున్నాయి. బందరు రోడ్డు అయితే, సంక్రాంతికి సెంటరాఫ్ అట్రాక్షన్‌గా మారింది. కార్పొరేట్ వస్త్ర దుకాణాలన్నీ బందరు రోడ్డుపైనే ఉన్నాయి. ఈ మాల్స్ అన్నీ భారీగా పండుగ ఆఫర్లను ప్రకటించాయి. ఎమ్మార్పీపై 50 నుంచి 60 శాతం మేర తగ్గింపును ప్రకటించడంతో పాటు కొనుగోలుపై బహుమతులు అందజేస్తున్నారు. రూ.5 వేలు షాపింగ్ చేసిన వారికి వాచీలు, కుక్కర్లు, స్మార్ట్‌ఫోన్లు, డైనింగ్ కిట్స్ ఇస్తున్నారు. ఇక మాల్స్‌ను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించి వినియోగదారులను మిగతా 6లో..

శరవేగంగా..

విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం డబ్లింగ్ పూర్తి

కృష్ణాజిల్లా అభివృద్ధి రైలు పట్టాలెక్కింది. విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం, భీమవరం-నరసాపురం, నరసాపురం-నిడదవోలు మార్గంలో డబుల్ రైల్‌లైన్ అందుబాటులోకి వచ్చింది. విద్యుదీకరణ పనులు కూడా పూర్తికావడంతో బుధవారం విశాఖపట్నం పర్యటనలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించిన ఈ సరికొత్త లైన్ అందుబాటులోకి రావడంతో ఉమ్మడి గోదావరి, కృష్ణాజిల్లాల్లో అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ పరిశ్రమకు మంచిరోజులు వచ్చినట్టైంది.

భీమవరం-నరసాపురం-నిడదవోలు మార్గం కూడా..

- కృష్ణాజిల్లా ఆర్థికవృద్ధికి కీలకంగా మారనున్న మార్గం
- 221 కిలోమీటర్లు.. రూ.3 వేల కోట్లతో డబ్లింగ్, విద్యుదీకరణ
- 2019లో పట్టాలెక్కిన పనులు.. వేగంగా అందుబాటులోకి..
- విశాఖలో ప్రారంభించి జాతికి అంకితం చేసిన ప్రధాని

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు విజయవాడ నుంచి మచిలీపట్నం మధ్య రైలు ప్రయాణం చాలా భారంగా సాగేది. ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయింది. ఈ మార్గంలో ప్రయాణం వేగవంతంగా సాగేందుకు అన్ని మార్గాలు తెరుచుకున్నాయి. విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం, భీమవరం-నరసాపురం, నరసాపురం-నిడదవోలు మార్గంలో రైల్వేలైన్‌ను డబుల్ లైనుగా మార్చారు. డబ్లింగ్ పనులతో పాటు విద్యుదీకరణ కూడా పూర్తి చేయడంతో ఈ మార్గంలో ప్రయాణం వేగంగా సాగనుంది. ఈ రైలు మార్గాన్ని బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖపట్నంలో ప్రారంభించి, జాతికి అంకితం చేశారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మాణం

దక్షిణ మధ్య రైల్వేలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును మచిలీపట్నం ఎంపీ బాలశౌరి 2019లో పట్టాలెక్కించారు. సుమారు 221 కిలోమీటర్ల మేర మిగతా 6లో..



పెనుగంచిప్రోలులో క్యాసినో

- ఏర్పాట్లు చేస్తున్న గుడివాడ క్యాసినో కింగ్ అనుచరులు
- జూదగాళ్ల కోసం ఏసీ రూమ్‌లు, ఫంక్షన్ హోళ్లు బుక్
- రూ.లక్షల్లో అడ్వాన్సుల చెల్లింపు

8లో

మొండి బకాయిలు

బ్రాహ్మణవీధి వెంకటేశ్వరస్వామికి దేవదాయ శాఖ బకాయి

- షాపుల అద్దెలు రూ.అరకోటి వరకూ పెండింగ్
- ఇందులో దేవదాయ శాఖ జిల్లా కార్యాలయం బకాయి రూ.35 లక్షలు
- పట్టించుకోని అధికారులు. నోటీసులతో సరి

(విజయవాడ/వన్‌టౌన్-ఆంధ్రజ్యోతి) : వేంకటేశ్వరస్వామి సొమ్మంటే అధికారులకు అలుసుగా మారింది. వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానానికి గవర్నరుపేటలోని అన్నపూర్ణ థియేటర్ రోడ్డులో మాజీ ఎంపీ కేశినేని నాని భవనం సమీపంలో ఓ భవన సముదాయం ఉంది. వీటిలో మొత్తం 14 షాపులున్నాయి. అద్దెదారుల్లో కొందరే ప్రతినెలా అద్దె చెల్లిస్తుండగా, మిగిలిన వారు నెలల తరబడి బకాయి ఉన్నారు. ఈ బకాయిలు మొత్తం రూ.44 లక్షల పైచిలుకు ఉన్నాయి. ఇక్కడ పనిచేసిన, చేస్తున్న దేవస్థానం ఈవోలు అద్దె బకాయిలు వసూలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎప్పటికప్పుడు అద్దె బకాయిలు కొండలా పేరుకుపోయాయి. కొందరు ఈవోలు షాపు యజమానులతో లాలూచీపడి.. వారి వద్ద ఎంతోకొంత డబ్బు తీసుకుని బకాయిలు వసూలు చేయటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ భవన సముదాయంలోని రెండో షాపు అద్దెదారుడు రూ.3.02 లక్షలు, మూడో షాపు అద్దెదారుడు రూ.3.60 లక్షలు, నాల్గో షాపు అద్దెదారుడు రూ.37 వేలు, 8వ షాపు అద్దెదారుడు రూ.1.72 లక్షలు, కేశినేని భవనం సమీపంలో ఉన్న ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయం వారు సుమారు రూ.35 లక్షలు బకాయిలు చెల్లించాలి. గతంలో జిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా చేసిన శాంతి.. ఈ షాపుల వారితో కుమ్మక్కై, భారీగా అద్దెలను పక్కదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. దీంతో కొంతమంది షాపులవారు తాము అద్దె చెల్లించామని, ఎలాంటి మిగతా 6లో..

కన్నకూతురే కడతేర్చింది

ఆ తల్లి పాలిట కన్నకూతురే కాలయముడిగా మారింది. తన వివాహేతర సంబంధానికి అభ్యంతరం చెప్పిన తల్లిని ప్రియుడితో కలిసి క్రూరంగా చంపేసింది. రక్తపు మడుగులో కొన ఊపిరితో కొట్టుకుంటున్న మాతృమూర్తిని చూసి కూడా మనసు కరగలేదు. ఎవరో దుండగులు హత్య చేశారని పోలీసులు అనుమానించారు. దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన తర్వాత కుమార్తె కుట్రకోణం బయటపడింది. ఆ వివరాలను ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ గురుప్రకాశ్ బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు.

కొండపల్లిలో వృద్ధురాలి హత్యలో కూతురే నిందితురాలు

- ప్రియుడితో కలిసి రోకలితో మోది దారుణ హత్య
- వివాహేతర సంబంధాన్ని అంగీకరించనందుకే..
- ఏడు గంటలు రక్తంలో కొట్టుకున్నా కనికరించని వైనం
- కుమార్తె సహా ప్రియుడు అరెస్టు


నిందితులు జీవమణి, నాగుర్‌వలి

విజయవాడ/ఇబ్రహీంపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో గుంటక్వారీ ప్రాంతానికి చెందిన యోహాన్, ఎస్తేరు అలియాస్ చెంచమ్మ భార్యాభర్తలు. యోహాన్ పాస్టర్‌గా పనిచేసి చనిపోయాడు. తర్వాత ఆయన భార్య ఎస్తేరు పాస్టర్‌గా మారారు. వారికి ముగ్గురు కుమార్తెలు. రెండో కుమార్తె జీవమణి కొండపల్లి ఐడీబీ కాలనీలో ఉంటోంది. ఈమెకు బత్తుల ఏసుబాబు అనే వ్యక్తితో వివాహమైంది. వారికి 14 ఏళ్ల కూతురు ఉంది. కుమార్తె పుట్టగానే జీవమణి.. ఏసుబాబు నుంచి విడిపోయింది. నాలుగేళ్ల క్రితం ఏసుబాబు చనిపోయాడు.

మరో వ్యక్తితో ప్రేమాయణం

ఐడీబీ కాలనీకి చెందిన షేక్ నాగుర్‌వలీ.. జీవమణి తండ్రి యోహాన్ వద్దకు వచ్చి ప్రార్థనలు చేయించుకునేవాడు. భర్తతో విడిపోయాక నాగుర్‌వలీతో ఆమె పరిచయం పెంచుకుంది. అతడితో వివాహేతర సంబంధం నడుపుతోంది. దీనికి తల్లి ఎస్తేరు అభ్యంతరం చెప్పింది. అయినా జీవమణిలో మార్పు రాలేదు. జీవమణి కుమార్తె అంటే ఎస్తేరుకు చాలా ఇష్టం. కొద్దిరోజుల క్రితం ఈ అమ్మాయి నాగుర్‌వలీతో మోటారు సైకిల్‌పై వెళ్లడాన్ని ఎస్తేరు చూసింది. దీన్ని తట్టుకోలేకపోయిన ఆమె ఆరో తేదీన కుమార్తె జీవమణితో గొడవపడింది. నాగుర్‌వలీ ఇంటికి వెళ్లి గొడవ చేసింది. ఈ పరిణామానికి కోపం పెంచుకున్న జీవమణి, నాగుర్‌వలీ ఆరోజు సాయంత్రం ఎస్తేరు ఇంటికి వచ్చారు. ఇంట్లో చాలాసేపు ఆమెతో గొడవపడ్డారు. నాగుర్‌వలీ ఆమెను సిమెంట్ ఇటుకకు వేసి బలంగా కొట్టాడు. తర్వాత జీవమణి రోకలితో తల్లి తలపై మోదింది. దాడి తర్వాత ఎస్తేరు చాలాసేపు రక్తపు మడుగులో ఉండిపోయింది. ఆమె కొన మిగతా 6లో..

అమరావతిలో మరో రూ.11,467 కోట్ల

పనులకు ఆమోదం

20 ఇంజనీరింగ్ పనులకు పరిపాలనా అనుమతులు

- ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం
- సంక్రాంతి తర్వాత ఊపందుకోనున్న టెండర్ల ప్రక్రియ
- మార్చిలో పనులు ప్రారంభించే అవకాశం

విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి మరో రూ.11,467.27 కోట్ల విలువైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రాజధానిలో అత్యంత కీలకమైన 20 ఇంజనీరింగ్ పనులకు బుధవారం ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి కిందటి కేబినెట్ సమావేశంలో రూ.21 వేల కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదం ప్రకారం అందులో సగం రూ.11,467.27 కోట్ల పనులకు తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మిగిలిన సగం పనులకు మరికొద్ది రోజుల్లో పరిపాలనా అనుమతులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు మొత్తం రూ.31 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇప్పటికే అమరావతిలో రూ.20 వేల కోట్ల పైచిలుకు వ్యయంతో కూడిన పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఈ మేరకు సీఆర్‌డీఏ కూడా టెండర్ల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటి వరకు రూ.10 వేల కోట్ల మేర పనులకు సీఆర్‌డీఏ, ఏడీసీలు టెండర్లు పిలిచాయి. దీంతో సంక్రాంతి తర్వాత అమరావతిలో నిర్మాణ పనులు జరగటానికి ఆస్కారం ఏర్పడింది.



'భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతిరావు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ రామకృష్ణ, సీనియర్ పాత్రికేయులు

ప్రతిఫలం ఆశించని పాత్రికేయుడు మానికొండ

విజయవాడ కల్చరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తింపును, ప్రతిఫలాన్ని ఆశించకుండా పాత్రికేయ వృత్తిని నిర్వహించిన ఘనత మానికొండ చలపతిరావుకు దక్కుతుందని పలువురు పాత్రికేయ వక్తలు తెలిపారు. పుస్తక మహోత్సవంలో బుధవారం రామోజీరావు సాహిత్యవేదికపై నిర్వహించిన కార్యక్రమంలో ఆకుల అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం ధృవతార మానికొండ చలపతి రావు' పుస్తకాన్ని జర్నలిజం మిత్రులంతా కలసి ఆవిష్కరించారు. సభకు అధ్యక్షత వహించిన శరత్‌చంద్ర జ్యోతిశ్రీ మాట్లాడుతూ, నేటియుగంలో జర్నలిజం విలువలు దిగజారుతున్నాయని, అదే సమయంలో విలువలు కలిగిన జర్నలిస్టులపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి తరానికి మానికొండ చలపతిరావు లాంటి శిఖరాయమాన పాత్రికేయుడిని పరిచయం చేయడానికి ఈ రచన ఉపయోగపడుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ, రాజధానిలో మానికొండ చలపతిరావుకు స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రచయిత ఆకుల అమరయ్య, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, ఎస్.వెంకట్రావు, సీహెచ్ సతీష్‌రావు, ఆనందం, సాగర్ కుమార్, రాఘవ, విశాలాంధ్ర మేనేజర్ మనోహర్ నాయుడు పాల్గొన్నారు.



రైతును ముంచుతున్న పాలకుల విధానాలు, అసమానతలు-ఆర్థిక విధానాలు, విద్వేష రాజకీయాలు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న బీవీ రాఘవులు, తదితరులు

మతోన్మాద, విద్వేష రాజకీయాలు : బీవీ రాఘవులు


నేటి రాజకీయాలను మతోన్మాదం, విద్వేషం నడిపిస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. పుస్తక మహోత్సవంలో వి.రాంభూపాల్ రచించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'రైతును ముంచుతున్న పాలకుల విధానాలు, అసమానతలు-ఆర్థిక విధానాలు, విద్వేష రాజకీయాలు' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రార్థనా స్థలాల చట్టాన్ని నేటి రాజకీయవర్గాలు అపహాస్యం చేస్తున్నాయన్నారు. పాత తప్పిదాలను సరి చేయడానికి కొత్తగా తప్పిదాలు చేయడం సరికాదన్నారు. ప్రకృతి వ్యవసాయం వెనుక వర్గపోరాట ధోరణి ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకుడు ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ, నాగరికత పేరుతో సమాజంలో ప్రకృతి సహజమైన మౌలిక విలువలకు దూరం కావడం దురదృష్టకరమన్నారు. రచయిత రాంభూపాల్ మాట్లాడుతూ, వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు పెరగడం వల్ల, వ్యవసాయ రుణాలు నిజమైన రైతులకు అందకపోవడం వల్ల, గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల రైతులకు భారమైపోతుందన్నారు.

అనువాదంలో విశేష కృషి చేసిన శ్రీనివాస గౌడ్

తనదైన అభివ్యక్తికోసం తపించి సాధించిన యువకవుల్లో శ్రీనివాస్ గౌడ్ అగ్రగణ్యుడని ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నారు. పి.శ్రీనివాస గౌడ్ రాసిన 'అంబపలుకు' కవితాసంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కవిత్వ భాషను, అందులో తనదైన శైలిని, బహుళార్థకతను సాధించడానికి ఎంతో ప్రతిభ, కృషి అవసరమన్నారు. సభకు అధ్యక్షత వహించిన బండ్ల మాధవరావు మాట్లాడుతూ, శ్రీనివాస్ గౌడ్ సాహితీరంగంలో వేగంగా ఎదుగుతూ, తనదైన గుర్తింపు సాధిస్తున్నాడని చెప్పారు. సుంకర గోపాల్ పుస్తకాన్ని సమీక్ష చేస్తూ సమాజంలోని ఎనిమిది కీలకాంశాలపై శ్రీనివాస్ గౌడ్ ప్రభావవంతంగా కవితలను సృజించారన్నారు. యాకూబ్, సత్యాజీ, శాంతిశ్రీ, పద్మకళ, కలిమిశ్రీ, పి.శ్రీనివాస్ గౌడ్ సభలో పాల్గొని ప్రసంగించారు.

పుస్తకం.. కొత్త పుంతలు

- మహోత్సవంలో కొత్త ఒరవడిని చూస్తున్నాం
- ప్రచురణకర్తలను ఆదుకోవాలి
- వీబీఎఫ్ఎస్ కార్యదర్శి మనోహరనాయుడు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్) : "సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో పుస్తకం పరిస్థితి ఏమిటి అన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోంది. మ్యానియా, మీడియా ఏదైనా, ఎన్ని కొత్త ఒరవడులు తీసుకున్నా దానికి ఎలాంటి ఢోకా లేదని పుస్తక మహోత్సవం నిరూపిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్ పుస్తక ప్రదర్శనలో కనిపించిన పరిస్థితులు ఇప్పుడు విజయవాడ పుస్తక మహోత్సవంలో కనిపిస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహరనాయుడు. పుస్తక మహోత్సవంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ, "పదేళ్ల తర్వాత విజయవాడ పుస్తక మహోత్సవంలో పాఠకుల రద్దీ కనిపిస్తోంది.. పుస్తక పఠనం తగ్గిందన్న సమయంలో పాఠకుల నుంచి ఈస్థాయిలో స్పందన రావడం సంతోషం కలిగిస్తోంది.. కొన్నాళ్లుగా నిరాశ నిస్పృహల్లో ఉన్న ప్రచురణకర్తల్లో ఆనందం కనిపిస్తోంది.. కొద్దిరోజుల క్రితం నిర్వహించిన పుస్తక ప్రియుల పాదయాత్రలో 4వేలమంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పాదయాత్రల్లో ఇంత పెద్దమొత్తంలో విద్యార్థులు పాల్గొన్న దాఖలాలు లేవు. పుస్తకానికి మంచి రోజులు వస్తున్నాయన్న విశ్వాసం కలుగుతోంది. రోజుకు 1000 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులు పుస్తక మహోత్సవానికి వస్తున్నారు. యువత ఎక్కువగా హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు వచ్చేవారు. ఈ ఏడాది ఆ ఒవరడి విజయవాడలో కనిపిస్తోంది. ఇంజనీరింగ్ విద్యార్థులు అధికసంఖ్యలో రావడం గమనార్హం. విద్యాసంస్థల నుంచి వస్తున్న విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, బాలసాహిత్యం, హారీపాటర్ కథలు, అమరచిత్రకథ, మాంగా కామిక్స్ పుస్తకాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వాటితోపాటు హర్రర్ కథల పుస్తకాలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రతిభావేదికపై నిర్వహిస్తున్న కథల పోటీలు పిల్లల్లో సాహిత్యాభిలాషను పెంపొందిస్తున్నాయి. ఎన్నడూ లేనివిధంగా దేశం నలుమూలల నుంచి 103 మంది ఇంగ్లీష్ ప్రచురణకర్తలు ఈ పుస్తక మహోత్సవంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు." అని వెల్లడించారు.



● జానపదానికి విజ్ఞానకోశం

జనం నుంచి పుట్టుకొచ్చినవి జానపదులు. ఈ జానపదాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఉంటాయి. ప్రాంతీయ అస్తిత్వాలతో స్థానిక మాండలికాలతో ముడిపడి ఈ జానపదాలు ఉంటాయి. దక్షిణ భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న జానపదాలకు ద్రవిడ విశ్వవిద్యాలయం విజ్ఞాన పదకోశాన్ని రూపొందించింది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో ఉన్న జానపదాల పుట్టుపూర్వోత్తరాలతో దక్షిణ భారతీయ జానపద విజ్ఞాన కోశం పేరుతో పుస్తకాన్ని ముద్రించింది. దీని వెల రూ.1000లు. కృష్ణా, గుంటూరు, ఖమ్మం, గోదావరి జిల్లాల్లో ఉండే గ్రామదేవత అంకమ్మ ఉత్సవాలు, ఆ సంబరాల్లో జరిగే జాపనదాల గురించి ఈ పుస్తకంలో వివరించారు. కన్నడలో అంకెయాటగా ప్రసిద్ధి చెంది తెలుగులోకి అంకెలఆటగా వచ్చిన కన్నడ జానపదంపై వివరణ ఇచ్చారు. గోదావరి జిల్లాలో ఎక్కువగా సాగే అగ్నిగుండ ప్రదర్శనలపై ఈ విజ్ఞానకోశంలో ప్రస్తావించారు. స్టాల్ నంబరు 31లో ఉన్న విజయవాణి ప్రింటర్స్‌లో ఈ పుస్తకం అందుబాటులో ఉంది.



స్కాన్ చేస్తే పుస్తకం ఉచితం



విజయవాడ సిటీలైఫ్ : పుస్తక మహోత్సవంలో ప్రతి పుస్తకానికి ఒక ధర ఉంటుంది. ఏ స్టాల్‌కు వెళ్లి పుస్తకం కొనుగోలు చేసినా డబ్బులు చెల్లించాలి. స్టాల్ నంబరు 33, 34లో ఏర్పాటు చేసిన పద్మావతి బుక్ డిస్ట్రిబ్యూటర్స్ మాత్రం దీనికి భిన్నం. ఇక్కడ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పుస్తకాన్ని ఉచితంగా తీసుకోవచ్చు. ఈ స్టాల్‌కు ఎదురుగా ఉచితంగా పుస్తకాలు అందజేయడానికి ఒక ర్యాక్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ఒక క్యూఆర్ కోడ్‌ను అమర్చారు. ర్యాక్ నిండా ఇంజనీరింగ్ పుస్తకాలు ఉంటాయి. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రేటింగ్ ఇచ్చిన తర్వాత ర్యాక్‌లో నచ్చిన పుస్తకాన్ని తీసుకుని వెళ్లవచ్చు. పద్మావతి బుక్ డిస్ట్రిబ్యూటర్స్ ఇంజనీరింగ్ విద్యకు సంబంధించిన పుస్తకాలను ముద్రించారు. కొవిడ్ సమయంలో రెండేళ్లపాటు లాక్‌డౌన్ ఉండడంతో ఈ పుస్తకాలు గొడౌన్‌లో ఉండిపోయాయి. తర్వాత ఒక్కో అంశానికి సంబంధించిన పుస్తకాల్లో కొత్త అంశాలను చేర్చారు. అప్‌డేట్ సమాచారంతో పుస్తకాలు రావడంతో ఈ పుస్తకాల కొనుగోళ్లు జరగలేదు. ఎంతోకొంత మంది విద్యార్థులకు ఈ పుస్తకాలు ఉపయోగపడతాయన్న ఉద్దేశ్యంతో నిర్వాహకులు వాటిని ఉచితంగా అందజేస్తున్నారు.

పాఠక హృదయాల్లో నిలిచిన రచయిత శారద

- పెనుగొండ లక్ష్మీనారాయణ



విజయవాడ కల్చరల్ : ప్రజల్లో జీవించి, ప్రజల కష్టాలు ప్రతిఫలించేలా ప్రజల కోసం రచనలు చేసిన గొప్ప రచయిత నటరాజన్ అని అరసం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. పుస్తక మహోత్సవంలో శారద కలంపేరుతో గుర్తింపు పొందిన కథారచయిత సుబ్రహ్మణ్యం నటరాజన్ శతజయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనదైన శైలితో, వ్యక్తీకరణతో సామాజిక స్పృహను కనబరుస్తూ పాఠకుల హృదయాల్లో నిలిచిపోయిన రచయిత నటరాజన్ అని చెప్పారు. ప్రముఖ రచయితగా గుర్తింపు పొందినప్పటికీ దుర్భర దారిద్ర్యాన్ని గడపవలసి వచ్చిందన్నారు. తమిళుడైనా తెలుగు ప్రాంతంలో హోటల్ సర్వర్‌గా జీవితాన్ని ప్రారంభించి, తనకున్న పఠనాసక్తితో అనతికాలంలో గుర్తింపు పొందిన రచయితగా మారాడన్నారు. శరత్‌చంద్ర జ్యోతిశ్రీ సభకు అధ్యక్షత వహించారు. గోళ్ల నారాయణరావు, విశాలాంధ్ర మనోహర్ నాయుడు ప్రసంగించారు.

పంచతంత్ర కథలంటే ఇష్టం

- వీరేందర్, స్లేట్ స్కూల్



విజయవాడ సిటీలైఫ్ : నాకు పంచతంత్ర కథలంటే చాలా ఇష్టం. ఎక్కువగా ఈ పుస్తకాలు చదువుతాను. మాకు స్కూల్‌లో నెలకు ఒక లైబ్రరీ పిరియడ్ ఉంటుంది. అప్పుడు మాత్రం ఇంగ్లీష్ కథల పుస్తకాలు చదువుతాను. పంచతంత్రం కథలు నైతిక విలువలు ఎలా ఉంటాయో తెలుపుతాయి.



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రెవెన్యూ అర్జీలపై ప్రత్యేక దృష్టి

- జిల్లా అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

కృష్ణలంక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో 33 రోజులపాటు రెవెన్యూ సదస్సులు జరిగాయని, మొత్తం 4,813 వరకు పిటీషన్లు వచ్చాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వాటిలో ఇప్పటివరకు 1,819 అర్జీలను పరిష్కరించడం జరిగిందని, గడువులోగా మిగిలిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద చివరిరోజు గూడూరుపాడు రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) స్టాల్ కార్యకలాపాలను ఆయన పరిశీలించారు.

అధికారులు అప్రమత్తంగా వుండాలి

భూ వివాదాలు లేని గ్రామాలే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సదస్సులు నిర్వహించిందని, వీఆర్వో, తహసీల్దార్, సర్వేయర్ తదితర క్షేత్రస్థాయి అధికారులు అర్జీల పరిష్కారంలో అప్రమత్తంగా వుండాలని కలెక్టర్ ఆదేశించారు. సదస్సులో గ్రామస్థులు కోరిన భూ రికార్డుల వివరాల పత్రాలను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, గుంటుపల్లి సర్పంచ్ బి.కవిత తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో ఖచ్చితత్వానికి ప్రాధాన్యత

కృష్ణలంక : రీసర్వేలో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ గ్రామాల్లో రీసర్వేపై వర్క్‌షాప్ నిర్వహించారు. పైలట్‌గా ఎంపిక చేసిన ఒక్కో మండలంలోని ఒక్కో గ్రామంలో సర్వే ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందుకు తీసుకెళ్లేందుకు సూచనలు చేశారు. రీసర్వే బృందాలు షెడ్యూల్ ప్రకారం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, టి.తివిక్రమరావు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గది మినీ ల్యాబ్ కావాలి

- సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతి తరగతి గది మినీ ల్యాబ్ కావాలని, వచ్చే ఏడాది నుంచి సైన్స్ ఫెయిర్‌ను నాలుగైదు రోజుల పాటు నిర్వహిస్తామని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు చెప్పారు. విజయవాడలో జరిగిన పాఠశాల విద్య రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఫెయిర్ ప్రాజెక్టులను వీడియోల రూపంలో పాఠశాలలకు పంపే ఆలోచన చేస్తున్నామన్నారు. వ్యక్తిగత విభాగంలో 15, గ్రూప్ విభాగంలో 10, టీచర్ ఎగ్జిబిట్స్ విభాగంలో 10 ప్రాజెక్టులను ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

సౌతిండియా సైన్స్ ఫెయిర్‌కు జగ్గయ్యపేట బాలుర ప్రాజెక్టు

జగ్గయ్యపేట : నీటి విద్యుత్ వాహక ఆధారంగా వరదలు, తుఫాన్లు వచ్చినపుడు బ్రిడ్జిలు, వాహనాలు కొట్టుకుపోకుండా రక్షించే ప్రాజెక్టు రూపొందించిన జగ్గయ్యపేట బాలుర హైస్కూల్ విద్యార్థుల నమూనా పాండిచ్చేరిలో జరగనున్న సౌతిండియా సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైంది. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గార్లపాటి చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో పదోతరగతి విద్యార్థులు ఎం.నాగతేజ, వై.భార్గవధనుష్‌లు ఈ ప్రాజెక్టును రూపొందించారు.

మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనం పైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

అమరావతి అభివృద్ధికి సహకారం

బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరీ ఆవిష్కరణలో లంకా దినకర్

లబ్బీపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధిలో కూటమి ప్రభుత్వానికి తనవంతు సహకారం అందిస్తానని బీజేపీ రాష్ట్ర నేత, 20 పాయింట్ల అమలు కమిటీ రాష్ట్ర చైర్మన్ లంకా దినకర్ అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా-2025 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సహకారంతో ముందుకు వెళతామని అన్నారు. ఈ సందర్భంగా బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి, అమరావతి క్యాపిటల్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమరావతి క్యాపిటల్ నూతన కమిటీ చైర్మన్‌గా పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శులుగా సంయుద్దీన్‌రాజా, ఎస్.సత్యనారాయణలతో పాటు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు, బీఏఐ రాష్ట్ర చైర్మన్ అత్తులూరి నాగమల్లేశ్వరరావు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఎస్.రమేష్, బీఏఐ జాతీయ ఉపాధ్యక్షులు డి.పంకజ్ రెడ్డి, నెరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు జి.చక్రధర్, బాలాజీ, శంకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా..

(5వ పేజీ తరువాయి)

డబ్లింగ్, విద్యుదీకరణ పనుల కోసం రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ సుమారు రూ.3 వేల కోట్లను ఖర్చు చేసింది. విజయవాడ, ఉప్పులూరు, ఇందుపల్లి, గుడివాడ, మోటూరు, పెడన, కౌతవరం, మచిలీపట్నం వరకు డబ్లింగ్, విద్యుదీకరణ చేశారు. ఉప్పులూరు-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం నడుమ 69 కిలోమీటర్ల పనులను ఒకే విడతలో పూర్తిచేయడం రైల్వే చరిత్రలోనే అరుదు. ఈ 69 కిలోమీటర్ల డబుల్ లైన్‌ను అత్యాధునిక సాంకేతికతతో నిర్మించారు. 25 టన్నుల యాక్సల్ లోడ్‌ను తట్టుకునేలా ఈ లైన్‌ను నిర్మించారు. ఈ మార్గంలో 110 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించవచ్చు. 60 కేజీల ప్రీ స్ట్రెస్డ్ సిమెంట్ స్లీపర్స్‌ను దీని నిర్మాణంలో ఉపయోగించారు. 11 మేజర్ వంతెనలు, 22 మైనర్ వంతెనలు నిర్మించారు. ఈ మార్గంలోని 24 రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్లను విద్యుదీకరించారు. ఈ ప్రాజెక్టు కారణంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ పరిశ్రమ ఊపందుకుంటుంది.

మొండి బకాయిలు

(5వ పేజీ తరువాయి)

బకాయిలు లేవని చెబుతున్నారు. దీంతో అద్దె వసూలు వ్యవహారం గందరగోళంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

నోటీసులు ఇస్తున్నాం : ఎన్.సన్యాసిరావు, ఈవో

దేవస్థానానికి చెందిన షాపుల యజమానులు అద్దె బకాయిపడిన విషయం వాస్తవమే. అలాంటి వ్యాపారులకు నోటీసులు జారీ చేశాం. ఏసీ కార్యాలయం అద్దె బకాయి గురించి పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఆ కార్యాలయానికి కూడా నోటీసులు అందజేశాం. రెండు నెలలు అద్దె బకాయి ఉన్నవారికి నూటికి రూ.2 చొప్పున వడ్డీ వసూలు చేస్తున్నాం.

సంక్రాంతి బిజీనెస్ (5వ పేజీ తరువాయి)

ఆకర్షిస్తున్నారు. మల్టీప్లెక్స్ మాల్స్‌లోని వస్త్ర దుకాణాల్లో కూడా రద్దీ ఎక్కువగానే ఉంది. ఎంత కొంటే అంత ఫ్రీ అని ప్రకటించటంతో ఈ మాల్స్ నిత్యం కిటకిటలాడుతున్నాయి. రిలయెన్స్ మాల్స్‌లో రూ.2,500 కొంటే రూ.2,500 విలువచేసే దుస్తులు ఉచితంగా ఇచ్చే ఆఫర్లు ప్రకటించారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే, పండుగకు రెండు రోజుల ముందు షాపింగ్‌లు మరింత ఎక్కువగా ఉంటాయని చెబుతున్నారు.

కన్నకూతురే కడతేర్చింది (5వ పేజీ తరువాయి)

ఊపిరితో ఉందన్న విషయాన్ని గుర్తించిన నిందితులిద్దరూ ఇంటి తలుపులు దగ్గరకు వేసి వెళ్లిపోయారు. ఆమె కేకలు వేస్తే చుట్టుపక్కల వారు వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్తారన్న అనుమానంతోనే ఇలా చేశారు. ఎస్తేరు రక్తపు మడుగులో ఏడు గంటలపాటు కొట్టుకుని ప్రాణాలు కోల్పోయింది. గంపలగూడెంలో ఉన్న పెద్దకుమార్తె దేవమణి నిత్యం తల్లికి ఫోన్ చేస్తుంటుంది. ఏడో తేదీన ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆమె ఇంటికి వచ్చింది. తలుపులు తీసి చూడగా, ఎస్తేరు చనిపోయి కనిపించింది. దీనిపై ఆమె ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండపల్లిలో జీవమణి, నాగుర్‌వలీని పోలీసులు అరెస్టు చేశారు. జీవమణి ఉపయోగించిన రోకలిని సీజ్ చేశారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118,126, 137
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505



మర్యాదపూర్వక కలయిక



ప్రభుత్వాసుపత్రి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎస్ వి జయానంద్‌ను బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వి.వి నారాయణరావు, కార్యదర్శి డాక్టర్ ఐ.బాబ్జి, శ్యామ్ కుమార్, డాక్టర్ స్వరూప్‌కాంత్, డాక్టర్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు

ఏఎంహెచ్‌వో బాబూశ్రీనివాస్



మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో బాబూ శ్రీనివాస్

పటమట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ బాబూ శ్రీనివాస్ అన్నారు. సర్కిల్-3 పరిధిలోని పబ్లిక్‌హెల్త్ సెక్షన్ అధికారులందరికి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. శానిటరీ వర్కర్ల హాజరు, చెత్త తరలించే వాహనాలకు సంబంధించి ట్రిప్‌లు, వెయిటేజీ, చెత్త ఎక్కువగా పడే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి క్లీనింగ్, లిఫ్టింగ్, వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, అపరాధ రుసుం వివరాలు ట్రేడ్ లైసెన్సు, యాంటీ లార్వా యాక్టివిటీస్, స్వచ్ఛ సర్వేక్షన్ -2024కు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు.

ఎస్సీ కులగణనపై 12 వరకు అభ్యంతరాల స్వీకరణ

కృష్ణలంక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు ఎస్సీ సంక్షేమ, సాధికారిత జిల్లా అధికారి కె.ఎస్.శిరోమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7తో గడువు ముగియనుండటంతో మరొక ఐదు రోజులు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఈ నెల 16 వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తిచేసి తుది కులగణన సర్వే వివరాలను ఈ నెల 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు.

జాతీయ స్థాయి బాడీబిల్డింగ్‌కు దుర్గాప్రసాద్



విజయవాడ స్పోర్ట్సు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కానూరులో అశోక్ ఫిట్‌నెస్ సెంటర్‌లో ఈ నెల 3న జరిగిన జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ అర్హత పోటీల్లో మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాలకు చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్ సత్తా చాటాడు. 60 కేజీల బాడీ బిల్డింగ్‌లో జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఫిబ్రవరిలో కర్నాటకలో జరిగే పోటీల్లో దుర్గాప్రసాద్ పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ తెలిపారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో బుధవారం ప్రిన్సిపాల్‌తో పాటు డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్, ఫిజికల్ డైరెక్టర్ టీవీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

మోటివేషనల్ స్పీకర్ దామర్ల రాజేష్



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు వివిధ నైపుణ్యాలను పెంచుకోవాలని ఎంట్రప్రెన్యూర్, మోటివేషనల్ స్పీకర్ దామర్ల రాజేష్ అన్నారు. నలంద కళాశాలలో బుధవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో స్పార్కిల్-2025ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జీవితంలో ప్రతి విద్యార్థి సక్సెస్ అవ్వాలంటే 3సీ(క్యూరియాసిటీ, కొలాబరేషన్, కాన్ఫిడెన్స్) ముఖ్యమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని, పోటీల్లో గెలవడం ముఖ్యం కాదని ప్రతి పోటీలో పాల్గొనడం వలన కొత్త విషయాలు నేర్చుకోవచ్చని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొంటారని, వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఇది ఒక చక్కని వేదిక అని అన్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్ ఫర్ యంగ్ ఇండియన్ అమరావతి చాప్టర్ కనకాల హరికృష్ణ, వై.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

కౌలు రైతుల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, కౌలు రైతుల సంఘం నేతలు

గవర్నర్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు, రైతులకు ఉపయోగపడే విధంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం తీసుకువచ్చిన కౌలు రైతుల డైరీ-2025ను బుధవారం వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్, సివిల్ సప్లయ్స్ కమిషనర్ వీరపాండ్యన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీలు సచివాలయంలో ఆవిష్కరించారు. రైతులకు ఎదురైన వ్యవసాయ సమస్యలను పరిష్కరించుకునేందుకు, అధికారులకు ఫిర్యాదు చేసేందుకు పూర్తి సమాచారంతో డైరీ తీసుకువచ్చిన సంఘ నేతలను రాజశేఖర్ అభినందించారు. వ్యవసాయానికి సంబంధించి వివిధ శాఖలలో విడివిడిగా ఉన్న సమాచారాన్ని డైరీలో పొందుపరిచి, రైతులు, కౌలు రైతులు, ఉపాధి హామీ కూలీలకు ఉపయోగపడే విధంగా డైరీని తీసుకువచ్చినట్లు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు తెలిపారు. ఆవిష్కరణ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.ఢిల్లీరావు, నాబార్డ్ డీజీఎం ఎమ్మెస్సార్ చంద్రమూర్తి, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. రాధాకృష్ణ, రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకర్, నేతలు ఎన్. మురళీకృష్ణారెడ్డి, కె. నాంచారయ్య పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పెసిఫిక్ డ్రైవ్ రేపు

కృష్ణలంక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, ఒకేషనల్ ఉపాధి కల్పన అధికారి వై.సత్యబ్రహ్మం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావులు బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో థీసిస్ ఎంటర్‌ప్రైజెస్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ కంపెనీలోని ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఎస్సీ, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) పూర్తిచేసిన 24 నుంచి 30 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఈ నెల 10న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. మరిన్ని వివరాలకు 9347779032 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ...

ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈనెల 10న ఎన్టీఆర్ వికాస కార్యాలయం, కలెక్టరేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో డేటా వాలీ కంపెనీలో డేటా సైన్స్ ఇన్‌స్ట్రక్టర్, ఫిల్స్‌కార్ట్‌లో సీనియర్ అసిస్టెంట్, స్కానింగ్ కన్సల్టేషన్, సార్టింగ్, హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌లో సేల్స్ ఆఫీసర్, మెడ్‌ప్లస్‌లో ఆడిట్ అసిస్టెంట్, వేర్‌హౌస్ అసిస్టెంట్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఫార్మసిస్ట్, సీఎస్‌ఏ, హౌస్‌కీపింగ్, సెక్యూరిటీ గార్డ్స్, పానాసోనిక్, కె.ఐ.ఎం.ఎల్, హోండాయ్ మోబిస్ అండ్ ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఎస్ఎస్‌సీలోపు, ఇంటర్, డి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 45 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం ప్లస్ ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి వుంటుంది. వివరాలకు 7799376111, 9849465427లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచేది టీడీపీనే

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పార్టీ సభ్యత్వం ఇస్తున్న గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్న టీడీపీ తెలుగు వారి ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపించేలా చేస్తోందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూలు మైదానంలో బుధవారం తెల్లవారు జామున పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు అభివృద్ధి కాముకుడని, ప్రజలకు తాము ఏదైనా సాధించగలమనే నమ్మకాన్ని ఇస్తున్నారని ప్రజలకు తెలుసు కాబట్టే ప్రజలు స్వచ్ఛందంగా పార్టీలో చేరి సభ్యత్వాలను తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరిస్తూ పార్టీలో కిందస్థాయి నుంచి అగ్ర కమిటీలోని నాయకులను ఎన్నుకునే పద్ధతి ఒక్క టీడీపీలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ పొన్నగంటి సత్యనారాయణ, ఏ. శ్రీనివాస్, సూర్యనారాయణ, .జగదీష్, పేరేపి ఈశ్వర్, ఎండీ హయత్ ఖాన్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో రాష్ట్రంలో వెలుగులు

పటమట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో వెలుగులు వస్తున్నాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. 14వ డివిజన్ ఎస్ఎస్ఎం స్కూల్ పక్కన ఆయిల్‌మిల్ రోడ్డులో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ బుధవారం పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వయం ఉపాధి నిమిత్తం మట్ట వెంకటలక్ష్మికి బడ్డీకొట్టు, పెద్ది చిన్నమ్మకు తోపుడు బండిని ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలలు కాల వ్యవధిలో రూ.2 లక్షల కోట్లు అభివృద్ధి పనులు చేస్తున్నారంటే, రాబోయే కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చునన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలందరూ అండగా నిలబడాలని గద్దె కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వీరంకి డాంగేకుమారి, నర్రా కిషోర్, గరికపాటి శ్రీనివాసరావు, ముమ్మనేని ప్రసాద్, రాధా, రూప, యల్ల బాబు, యడ్లపల్లి శివనాగరాజు, శశి, గణేష్, గోవర్ధన్‌రెడ్డి, నాజర్‌వలీలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్

దుర్గామల్లేశ్వర దేవస్థానం, దుర్గాఘాట్‌లలో..





వన్‌టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భవానీ దీక్షల విరమణ ముగిసింది. సుమారు 4.50 లక్షల మందికి పైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. దీక్షలు విరమణలు చేయటానికి వచ్చిన భక్తులు సుమారుగా 2 లక్షల మంది వరకు ఉంటారు. వీరంతా అమ్మవారిని దర్శించుకోవటానికి ముందు ఘాట్లలో స్నానాలు చేయటం, అక్కడే దీక్షా వస్త్రాలను వదిలివేయటం జరుగుతుంది. పెద్ద ఎత్తున తలనీలాలు కూడా సమర్పించారు. ఈ క్రమంలో దుర్గాఘాట్‌లో, దేవస్థాన ప్రాంతాల్లో చెత్త డంప్ అయ్యింది. దుర్గగుడిలో శానిటేషన్ విభాగంపై ఇటీవల దేవదాయ శాఖ మంత్రి రామనారాయణ రెడ్డి కూడా ప్రస్తావించారు. ఈ క్రమంలో బుధవారం దుర్గగుడి ఈవో రామచంద్ర మోహన్ పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పేరుకుపోయిన చెత్తలను, వస్త్రాలను, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తరలించారు. దుర్గా ఘాట్లలో, పార్కింగ్ ప్రదేశాలలో, అన్నదాన విభాగంలో, మరుగుదొడ్లు, కార్యాలయాలు వంటి ప్రాంతాల్లో సిబ్బందిని మోహరించి చెత్తా, చెదారాలను, వ్యర్థాలను తొలగింపజేశారు.

శానిటేషన్ సిబ్బందికి, సూపర్‌వైజర్‌లకు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలని, నిరంతరం అప్రమత్తతతో ఉండాలని ఈవో ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న సీవోలు, ఆర్పీలు

కృష్ణలంక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కమ్యూనిటీ హాలులో బుధవారం నిర్వహించిన పట్టణ సమాఖ్య సమావేశంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకట నారాయణ మాట్లాడుతూ మెప్మా ప్రాజెక్టులో జరుగుతున్న ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్, ఎంఎస్ఎంఈ, పీఎం శ్వానిధి, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన, వీధి వ్యాపారులకు సోషియో ఎకనామిక్ సర్వే, కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు, రివాల్వింగ్ ఫండ్ తదితర విషయాలపై ఈ ఏడాది లక్ష్యం, ఇప్పటి వరకు సాధించిన ప్రగతిపై రివ్యూ చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ యూసీడీ విభాగం టీఈ ఫణికుమార్, సీవోలు, జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్, ఆర్పీలు, సమాఖ్య అధికారులు పాల్గొన్నారు.



పట్టాభిరాంకు చిత్రపటం ఇస్తున్న వల్లభనేని సతీష్, తోట పాండు తదితరులు

ప్రత్యేక పూజలు

మొగల్రాజపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం దంపతులు మాచవరం దాసాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు 26వ డివిజన్ ఇన్‌చార్జి , దేవస్థానం మాజీ చైర్మన్ వల్లభనేని సతీష్, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు తోట పాండు స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి కారంపూడి సత్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కడియం ప్రకాష్, శశి, దేవస్థానం ఈవో పాతూరి లోకేశ్వరి పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో ముగ్గుల పోటీలు

పటమట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాలలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ కూరగాయలతో భిన్న రకాల శిల్ప ఆకృతులను విద్యార్థులు తయారు చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన మెహందీ స్టాల్‌లో పోటీపడి విద్యార్థినులు మెహిందీ పెట్టించుకున్నారు. పాఠశాల రీజినల్ ఇన్‌చార్జి పద్మ మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో తెలుగు లోగిళ్లలో కనిపించే సందడిని విద్యార్థులకు అందించాలనే ఉద్దేశ్యంతో ముందస్తు సంబరాల్లో భాగంగా తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో పాఠశాల ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



సంక్రాంతి బొమ్మల కొలువు రేపు

గవర్నర్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని ఫోరం ఫర్ ఆర్టిస్టు, ఎంబీవీకే ఆధ్వర్యంలో ఈ నెల 10న ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సంక్రాంతి బొమ్మల కొలువు ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు బాధ్యులు సునీల్‌కుమార్, పి.విజయ తెలిపారు. బొమ్మల కొలువుకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. కళలు, సంప్రదాయాలు కొనసాగించడానికి మహిళలను ప్రోత్సహించడానికి చేసే ప్రయత్నానికి అందరూ సహకరించాలని కోరారు. పోటీల్లో పాల్గొనేవారు 93462 93779, 77993 08775లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. నిర్వాహకులు కె.సత్యవతి, ఎ.సంధ్యారాణి, శ్రవణ్, పి.పావని తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు అపహరణ

ఉయ్యూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు మార్చి రూ. 40వేలు తీసుకుని అగంతకుడు ఉడాయించిన సంఘటన బుధవారం ఉయ్యూరు ఎస్‌బీఐ ఏటీఎం వద్ద జరిగింది. గండిగుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభలో పూజారి శ్రీనివాసాచార్యులు కాటూరు రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంలో కార్డుతో డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఎర్రర్ వచ్చింది. వెనుకున్న వ్యక్తి తీసి ఇస్తానని కార్డు తీసుకుని డబ్బు తీసేందుకు ప్రయత్నిస్తున్నట్టు నటించి రావడంలేదని కార్డు ఇచ్చి వెళ్లిపోయాడు. శ్రీనివాసాచార్యులు మరోసారి ప్రయత్నించగా డబ్బులు రాకపోవడంతో కార్డును పరిశీలించగా, ఆ కార్డు తనది కాదని గ్రహించాడు. బ్యాంకుకి వెళ్లి విచారించగా అప్పటికే తన ఖాతా నుంచి రూ. 40వేలు తీసినట్టు తెలిసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.1.02 లక్షలు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం


విద్యాధరపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో పేకాట ఆడుతున్న నిర్వాహకులతో పాటు ఎనిమిది మందిని భవానీపురం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. భవానీపురం శివాలయం ఎదురుగా ఉంటున్న గొల్లపల్లి వెంకటరెడ్డి ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్న సమాచారం టాస్క్‌ఫోర్స్ అధికారులకు తెలిసింది. పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,02,230లు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కారాదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

ముగిసిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

» నూతన రాష్ట్ర కమిటీ కార్యవర్గం ఏకగ్రీవం



నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో నాలుగు రోజులుగా జరుగుతున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా యూటీఎఫ్ నూతన రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కె.సురేష్‌కుమార్, ఏఎన్ కుసుమకుమారి, ప్రధాన కార్యదర్శిగా కేఎస్ఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావు ఎన్నికయ్యారు. మొత్తం 15మంది రాష్ట్ర కార్యదర్శులతో నూతన కమిటీ ఎన్నికైంది. నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవడానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

ఇంకెన్నాళ్లీ.. రాళ్లసీమ?

» అధికారులకు కరువు బృందం చీఫ్ ప్రశ్న



రాయలసీమలో ఎన్నాళ్లు ఈ పరిస్థితి అని ప్రశ్నిస్తున్న కేంద్ర కరువు బృందం చీఫ్ పెరిన్‌దేవి

బి.కొత్తకోట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'రాయలసీమను ఇంకెంతకాలం రాళ్లసీమగానే పెడతారు. ఏటా పంటపోయింది. కరువు.. కరువు అనడం తప్ప మార్పు తీసుకు రారా? రైతులకు సలహాలిచ్చి మార్పు తీసుకురావాల్సింది మీరే కదా.. మీరే మారకపోతే వారినెలా మారుస్తారు' అంటూ కేంద్ర బృందానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పెరిన్‌దేవి అన్నమయ్య జిల్లా అధికారులను ప్రశ్నించారు. బి.కొత్తకోట మండలంలోని పొలాలను పరిశీలించిన కరువు బృందం.. తుమ్మణంగుట్టలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించింది. ఈ సందర్భంగా పెరిన్‌దేవి మాట్లాడుతూ 'గత పదేళ్లుగా ఇలాంటి ఫొటోలే చూపిస్తున్నారు. మార్పు కోసం ప్రయత్నాలు చేయరా?. కరువు నుంచి రైతును గట్టెక్కించే మార్గాలే లేవా?' అని జిల్లా అధికారులను నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు.

గుర్తింపులేని ఉపాధ్యాయ సంఘాలతో రేపు చర్చలు

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందని ఉపాధ్యాయ సంఘాలతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు, జీవో 117కు ప్రత్యామ్నాయం, పదోన్నతులు, ఇతరత్రా అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

'పాఠశాల విద్య'లోని ఎస్సీ ఉపకులాల వివరాలివ్వండి

ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో పాఠశాల విద్యలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందిలో ఎస్సీ, ఎస్సీ ఉపకులాలకు చెందినవారి వివరాలను పంపాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. అలాగే విద్యార్థుల్లోనూ ఎస్సీ విద్యార్థులు, వారి ఉపకులం వివరాలను పంపాలని నిర్దేశించింది.

సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తుల డీఏ పెంపు

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల కరువు భత్యాన్ని(డీఏ) 50శాతం నుంచి 53శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే న్యాయాధికారుల డీఏ కూడా 50 శాతం నుండి 53శాతానికి పెంచింది. గతేడాది జులై 1నుంచి ఈ పెంపు అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర పండుగగా వడ్డె ఓబన్న జన్మదినం

బ్రిటిష్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడిన వడ్డె ఓబన్న జన్మదినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏటా జనవరి 11న ఆయన జన్మదినం సందర్భంగా ప్రభుత్వంలోని అన్ని శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, ముఖ్యంగా బీసీ వెల్ఫేర్ శాఖ దీనిపై చర్యలు తీసుకోవాలని సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

రూ.25లక్షలతో పేదలకు ఆరోగ్యశ్రీ: ఆనంద్‌సూర్య

అమరావతి, జనవరి8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ అద్భుత పాలనను చూసి, వైసీపీ ఓర్వలేకపోతోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య మండిపడ్డారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'వైసీపీ పాలనలో.. ప్రజలకు ఉపయోగపడే సీఎంఆర్ఎఫ్ నిలిపివేశారు. రూ.25లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని ఎన్నికల ముందు కల్లబొల్లి కబుర్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ నిధులు దారి మళ్లించారు. కేంద్రం ఇచ్చే ఆయుష్మాన్ భవ పథకానికి చిల్లులు పెట్టారు' అని ఆరోపించారు. పేదలకు రూ.25లక్షల వరకు ఆరోగ్యశ్రీ అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆనంద్ చెప్పారు.

పశుగణనలో లోపాలుంటే చర్యలు

» కేంద్ర పశుసంవర్థక శాఖ జాయింట్ కమిషనర్ వినోద్‌కుమార్

పశుగణనలో ఏపీ మొదటి స్థానంలో ఉందని కేంద్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమశాఖ జాయింట్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర పశుసంవర్థకశాఖ కార్యాలయంలో ఆయన పశుగణన, ఇతర అంశాలపై సమీక్ష జరిపారు. సర్వేలో లోపాలు ఉంటే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో 73 శాతం పశుగణన పూర్తయిందని రాష్ట్ర పశుసంవర్థకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు చెప్పారు.

రైతులకు మూల విత్తనం ఇవ్వాలి: అగ్రి డైరెక్టర్

విత్తనాల ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు ఏపీ సీడ్స్ అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రసాదంపాడులోని ఏపీ సీడ్స్ కార్యాలయంలో విత్తన ఉత్పత్తి కేంద్రాలు, ప్రదర్శన క్షేత్రాలపై ఆయన సమీక్షించారు. రైతులకు మేలైన మూల విత్తనం ఇవ్వాలని, విత్తన సేకరణలో ఇతర రకాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సమగ్రశిక్ష ఉద్యోగులకు ఎంటీఎస్ అమలుచేయాలి

విజయవాడ (ధర్నాచౌక్), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇచ్చిన జీవో 2 ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల తరహాలో సమగ్రశిక్షలో పనిచేసే 25 వేల మంది ఉద్యోగులకూ మినిమం టైం స్కేల్ వర్తింపజేసి న్యాయం చేయాలని సమగ్రశిక్ష యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సమగ్రశిక్ష ఉద్యోగులకు న్యాయం చేస్తామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు.

ఆలిండియా మోటార్స్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ దక్షిణ భారత ఉపాధ్యక్షుడిగా వైవీ ఈశ్వరరావు



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో వై.వి.ఈశ్వరరావు

విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా మోటార్స్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) దక్షిణ భారత ఉపాధ్యక్షుడిగా ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఢిల్లీలో ఏఐఎంటీసీ కేంద్ర కార్యవర్గ సమావేశంలో ఈశ్వరరావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యాక కేంద్ర వాణిజ్యశాఖమంత్రి పీయూష్ గోయల్‌ను ఈశ్వరరావు కలిశారు. పలు రాష్ట్రాల్లో బోర్డర్ చెక్‌పోస్టులను తొలగించాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ల సీనియారిటీ జాబితా

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిచేస్తున్న 22 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ స్పెషల్ గ్రేడ్‌లకు, 49 మంది వర్కింగ్ మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-1 కేడర్‌కు సంబంధించి ప్రభుత్వం సీనియారిటీ జాబితా ప్రకటించింది. అలాగే, 13 మంది గ్రేడ్-2 కేడర్‌కు, 26 మంది గ్రేడ్-3 కేడర్‌కు సీనియారిటీ జాబితా ప్రకటిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

సంక్రాంతికి

పెనుగంచిప్రోలులో క్యాసినో

» ఏర్పాట్లు చేస్తున్న గుడివాడ క్యాసినో కింగ్ అనుచరులు

» జూదగాళ్ల కోసం ఇప్పటికే ఏసీ రూమ్‌లు, ఫంక్షన్ హాళ్లు బుక్..రూ.లక్షల్లో అడ్వాన్సుల చెల్లింపు

(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల)

సంక్రాంతికి నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో భారీగా కోడి పందేలు, జూదం నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గం పెనుగంచిప్రోలులో క్యాసినో తరహాలో జూదం నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గుడివాడలో నిర్వహించిన క్యాసినో కింగ్ అనుచరులు ముగ్గురు పెనుగంచిప్రోలులో ఏర్పాట్లు చేయిస్తున్నారని తెలుస్తోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జూదగాళ్లు మూడు రోజులు ఇక్కడే ఉండేందుకు, వారికి తగిన సదుపాయాలు కల్పించేందుకు ముందుగానే ఏసీ రూమ్‌లు, మామిడి తోటల్లోని ఫంక్షన్ హాళ్లను రూ.లక్షలు అడ్వాన్సులుగా ఇచ్చి అద్దెకు తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. భారీ ఏర్పాట్లపై స్థానిక ఇంటిలిజెన్స్ అధికారులు ఇప్పటికే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. క్యాసినో నిర్వహణ కోసం ముఖ్యులైన కొంత మందిని కలిసి నిర్వాహకులు నగదు అందజేస్తున్నారని తెలిసింది.

మామిడితోటలు, రియల్ ఎస్టేట్ వెంచర్లనలో బరులు

నందిగామ డివిజన్ పరిధిలో అధికార పార్టీ నేతలతో కలిసి కోడి పందేల నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారు. చందర్లపాడు, పల్లగిరి, అనాసాగరం, పరిటాల, గండేపల్లి, భీమవరం, గరికపాడు, తొర్లగుంటపాలెం, జగ్గయ్యపేట, బూదవాడ, లింగాల ప్రాంతాల్లో మామిడి తోటలను, ఖాళీగా ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లను ఖాళీ స్థలాలను బాగుచేస్తున్నారు.

కోడి పందేలు, జూదానికి అనుమతి లేదు

'నందిగామ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో కోడి పందేలు, జూదం నిర్వహణకు అనుమతి లేదు. పందేలు, జూదం జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.' అని రూరల్ డీసీపీ మహేశ్వరరాజు విలేకరులకు తెలిపారు.

ప్రత్యేక బృందాలు నియమించాం

'ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల వారీగా ప్రత్యేక బృందాలను నియమించాం. ఎక్కడికక్కడ ప్రత్యేక బృందాలు పర్యటిస్తూ, జూదం జరగకుండ చూస్తాయి. మాకు సమాచారం అందిస్తాయి.' అని నందిగామ ఏసీపీ తిలక్ పేర్కొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా కోట్లాది రూపాయల విలువ చేసే మట్టి తరలించిన ఆ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వంలోనూ అదే పంథా కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్తూరు తాడేపల్లి, పాతపాడులో అనధికారికంగా పోలవరం మట్టి తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనధికారికంగా మట్టి తరలిస్తున్న వారితో లాలూచీపడి వారి నుంచి భారీ ముడుపులు అందుకుంటున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.



మట్టి తరలిస్తున్న టిప్పర్లు, డ్రైవర్లతో మాట్లాడుతున్న నున్న పోలీసు



అనధికార మట్టి తోలకాలు

కొత్తూరు తాడేపల్లి, పాతపాడులో పోలవరం కాలువ మట్టి తరలిస్తున్న వైసీపీ నేతలు

» ముడుపులందడంతో మిన్నకుంటున్నారని అధికారులపై ఆరోపణలు

వన్‌టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లిలో స్థానిక వైసీపీ నాయకులు వారం నుంచి పోలవరం కాలువ మట్టిని రాత్రి వేళలో పదుల సంఖ్యలో వాహనాల్లో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది ప్రభుత్వ అధికారుల అండదండలతోనే ఈ తోలకాలు జరుగుతున్నాయని అంటున్నారు. ఫిర్యాదు చేస్తే అధికారులు తమ సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారే తప్ప మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మట్టి తవ్వే యంత్రాలు, మట్టి తరలించే వాహనాలను కనీసం అడ్డుకోలేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు, సిబ్బంది వెళ్లిన కొద్దిసేపటికే మరలా మట్టి తరలిస్తున్నారని అంటున్నారు. మంగళవారం రాత్రి 9 గంటలకు కొత్తూరు తాడేపల్లి నుంచి 17 టిప్పర్లలో గుణదలలోని ఓ వెంచర్‌కు మట్టి తరలిస్తున్నారని సమాచారమందడంతో నున్న పోలీసులు వచ్చారు. 7 వాహనాలను ఆపి డ్రైవర్ల నుంచి వాహనాల సీ బుక్‌లు, సెల్‌ఫోన్లు, వాహనాల తాళాలు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వెనక వస్తున్న 10 టిప్పర్ల డ్రైవర్లు వారి వాహనాలను దారి మళ్లించి జన సంచారం లేని ప్రాంతంలో నిలుపుదల చేశారు. పోలీసులు టిప్పర్లను ఆపారని సమాచారం తెలుసుకున్న కొత్తూరు తాడేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు బి.రాజు నున్న పోలీసు స్టేషన్ అధికారులతో బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు మంతనాలు జరిపినట్లు సమాచారం. తరువాత పోలీసు అధికారులు ఆ వాహనాలపై ఎలాంటి కేసు లేకుండా వదిలివేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఓ అధికారికి పెద్ద మొత్తంలో ముడుపులు అందాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పాతపాడులో 15 రోజుల నుంచి యథేచ్ఛగా..

నున్న - పాతపాడు మధ్య పోలవరం కాలువ మట్టిని పాతపాడుకు చెందిన వారు 15 రోజుల నుంచి యథేచ్ఛగా రాత్రివేళలో పదుల సంఖ్యలో వాహనాలు (టిప్పర్లు)లో తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో పాతపాడుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు కీలకంగా వ్యవహరించినట్లు స్థానికులు చెబుతున్నారు. రోజూ లక్షలాది రూపాయల విలువ చేసే మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే చెబుతున్నారు. దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ప్రభుత్వ అధికారులు స్పందించి మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇన్సెంటివ్‌లు చెల్లించండి

» ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు పీటీడీ ఎన్ఎంయూఏ లేఖ

వన్‌టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు 2022 జులై నుంచి పెండింగ్‌లో ఉన్న స్పాట్, మంత్లీ ఇన్సెంటివ్‌లను చెల్లించాలని ప్రజా రవాణ సంస్థ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(పీటీడీ ఎన్ఎంయూఏ) బుధవారం ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు ఓ లేఖ ఇచ్చింది. ఇప్పటికే రాతపూర్వకంగా ఈ అంశాన్ని తెలియజేశామని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ సమావేశంలోనూ చెల్లింపులకు ఆమోదం తెలిపి ఏడాది అవుతున్నప్పటికీ కార్యాచరణకు అడుగు పడలేదని అందులో పేర్కొంది. ఇప్పటికైనా విజ్ఞప్తిని మన్నించి బకాయిలతో సహా చెల్లింపులకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. డీపీటీవోల మీటింగ్‌లోనూ ప్రతి నెలా దీనిపై సమీక్ష జరపాలని కోరింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఇంజనీరింగ్)కు ఇచ్చిన మరో లేఖలో ప్రమాద రహిత సర్వీసు రికార్డు ఉన్న డ్రైవర్లకు 2023-24, 2024-25 సంవత్సరాలకు సేఫ్టీ డ్రైవింగ్ అలవెన్స్‌ను ఇవ్వాలని పీటీడీ ఎన్ఎంయూఏ కోరింది. ప్రమాదరహిత డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ అలవెన్సు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ చాలా డిపోల్లో ఇవ్వడం లేదని, రెండేళ్ల నుంచి ఇవ్వాల్సిన అలవెన్స్‌లు ఇప్పటికైనా చెల్లించేలా యూనిట్లకు తగు ఆదేశాలు ఇవ్వాలని కోరింది.

ఏపీ స్కలింగ్, రోయింగ్ అధ్యక్షుడిగా తరుణ్ కాకాని



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు తరుణ్ కాకాని, కార్యవర్గం

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్కలింగ్, రోయింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నగరంలోని ఓ హోటల్‌లో జూమ్ ద్వారా బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమరావతి బోటింగ్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకానిని తిరిగి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పి.భాస్కరరెడ్డి(అనంతపురం), ఎం.పవిత్ర కొండ్రెడి(ఎన్టీఆర్), సెక్రటరీ ఎన్.పవన్‌కుమార్(ఎన్టీఆర్ జిల్లా), జాయింట్ సెక్రటరీలుగా రంభా ప్రసాద్(ఎన్టీఆర్), శ్రీనివాస్ పడి(శ్రీకాకుళం) స్పెషల్ ఇన్వైటీగా పీసీ మస్తాన్(కడప), ట్రెజరర్‌గా పి.లావణ్య(కృష్ణా), ఈసీ మెంబర్లుగా కె.కృష్ణమూర్తి(ఏలూరు జిల్లా), రాఘవేంద్ర(ఎన్టీఆర్), జి.కిషోర్(గుంటూరు)ను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ పి.శ్రీరామ్, శాప్ పరిశీలకుడిగా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, లీగల్ అర్బిటర్ హైకోర్టు న్యాయమూర్తి డి.రమేష్‌కుమార్ వ్యవహరించారు. ఎంపికైన కార్యవర్గం 2029 వరకు పదవిలో ఉంటుంది. గత నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 106 మంది క్రీడాకారులను తయారు చేశామని, గోవా జాతీయ క్రీడల్లో ఏపీ టీమ్ క్వార్టర్స్‌కు చేరిందని అధ్యక్షుడు తరుణ్ కాకాని వివరించారు. ఈ క్రీడను మరింత ప్రాచుర్యంలోకి తేవడంతో పాటు విజయవాడలోనే జాతీయ రోయింగ్ చాంపియన్‌షిప్ నిర్వహణకు అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన వివరించారు.

కార్పొరేట్ కళాశాల విద్యార్థిని మృతి

» యాజమాన్యమే కారణమంటున్న తల్లి, బంధువులు

» అనారోగ్యంతోనే అంటున్న యాజమాన్యం

» మృతి వార్త విని తండ్రికి గుండెపోటు



విద్యార్థిని గంగాభువనేశ్వరి(ఫైల్)



కళాశాల వద్ద రోదిస్తున్న తల్లి

పెనమలూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒక కార్పొరేట్ జూనియర్ కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థిని మృతి చెందింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఒక కార్పొరేట్ కళాశాలలో పిఠాపురానికి చెందిన రామిశెట్టి గంగాభువనేశ్వరి(18) నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. మంగళవారం రాత్రి జ్వరంతో బాధపడుతూ జ్వరం తగ్గేందుకు టాబ్లెట్లు వేసుకుని నిద్రకు ఉపక్రమించింది. అర్ధరాత్రి రెండు మూడు గంటల మధ్య తీవ్రమైన తలనొప్పి రావడంతో తోటి విద్యార్థినులు సిక్ ఇన్‌చార్జికి తెలిపారు. మెరుగైన వైద్యం కోసం దగ్గరలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ విద్యార్థినిని పరీక్షించిన వైద్యులు మార్గం మధ్యలోనే మృతి చెందిందని తెలిపారు. దీంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించింది. కళాశాల వద్దకు చేరుకున్న మృతురాలి తల్లి, బంధువులు తమ కుమార్తె మృతికి యాజమాన్యమే కారణమని ఆరోపించారు. కళాశాల యాజమాన్యం, పోలీసులు కారణాలు వెల్లడించాలని, తమ కుమార్తెకు ఎటువంటి అనారోగ్యం లేదని వాదించారు. కుమార్తె మృతి చెందిన వార్త విని తండ్రి గుండెపోటుకు గురైనట్లు విద్యార్థిని బంధువులు తెలిపారు. విద్యార్థిని మృతికి కారణాలు పోస్టుమార్టంలో తేలాల్సి ఉంది.

నిజాలు నిగ్గు తేల్చాలి: ఏబీవీపీ

లాంగ్ టర్మ్ కోసం కాకినాడ నుంచి విజయవాడ వచ్చిన విద్యార్థి మృతిచెందడం దారుణమని, తెలంగాణ తరహాలోనే రాష్ట్రంలోనూ కార్పొరేట్ కళాశాలలను కట్టడి చేయాలని, మహిళా కమిషన్, విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాలని ఏబీవీపీ నాయకుడు గోపీ డిమాండ్ చేశారు. కార్పొరేట్ మాయలో పడి తల్లిదండ్రులు విద్యార్థులను ఒకచోట బంధించి ఉంచి హాస్టళ్లలో బలిపశువులను చేస్తున్నారని, చనిపోయిన విద్యార్థిని కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

పోలీసు విచారణకు తులసిబాబు

» అనుచరుల ఓవరాక్షన్.. పోలీసులతో వాగ్వాదం

» తమను కూడా లోపలికి పంపాలని దౌర్జన్యం

» విజయవాడ నుంచి ర్యాలీగా వచ్చిన తులసిబాబు

» ఒంగోలులో పొద్దుపోయేవరకు కొనసాగిన విచారణ



విచారణకు హాజరైన తులసిబాబు

ఒంగోలుక్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబు బుధవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అనుచరులతో కలసి విజయవాడ నుంచి కార్లతో భారీ ర్యాలీగా ఇక్కడికి వచ్చారు. ఆయన అనుచరులు ఓవరాక్షన్ చేశారు. పోలీసు కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద తమ కాన్వాయ్‌ని లోపలికి పంపాలని అక్కడ విధులలో ఉన్న పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. పోలీసులు తులసిబాబుని మాత్రమే లోపలకు అనుమతించి గేట్లు వేశారు. బయట ఉన్న తులసిబాబు అనుచరులు పోలీసులపై రెచ్చిపోయారు. 'యూనిఫామ్‌తో గుడివాడ రండి మీ అంతు చూస్తాం' అంటూ రెచ్చగొట్టే వాఖ్యలు చేశారు. ప్రధాన ద్వారాన్ని నెట్టుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో కొద్దిసేపు పోలీసులు, తులసిబాబు అనుచరుల మధ్య తోపులాట జరిగింది. కార్ల పార్కింగ్ సమయంలోనూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కాగా, తులసిబాబును బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు ఎస్పీ ఏఆర్.దామోదర్ విచారిస్తూనే ఉన్నారు. ఇదే సమయంలో రిటైర్డ్ సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్‌ను పోలీసు కస్టడీకి తీసుకొని ఒంగోలు తాలూకా స్టేషన్‌లో ఉంచారు. సీఐడీ కస్టడీ సమయంలో ప్రైవేటు వ్యక్తి తన గుండెల మీద కూర్చొన్నాడని ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తులసిబాబుకు పోలీసులు నోటీసు ఇచ్చి విచారణకు పిలిచిన విషయం విదితమే.

స్పందన శూన్యం!

» నగరంలో 2 లిక్కర్ మార్టులకు రెండు దరఖాస్తులే

» దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలతో బెంబేలు

» షాపు తెరవాలంటే రూ.5 కోట్లు పెట్టాల్సిందే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ జిల్లాలో రెండు లిక్కర్ మార్టులకు ఇటీవల టెండర్లు పిలిచారు. ఈ రెండు మార్టుల కోసం కేవలం రెండు దరఖాస్తులే వచ్చాయి. దరఖాస్తు ఫీజు భారీగా ఉండటం, భారీగా పెట్టుబడి పెట్టాల్సి ఉండడమే దీనికి ప్రధాన కారణం. దరఖాస్తు ఫీజుగా రూ.15 లక్షలను నిర్ణయించి, రాష్ట్రవ్యాప్తంగా నగరాల్లోనే ఈ మార్టులను ఏర్పాటు చేసుకునేలా టెండర్లు పిలిచారు. వీటికి భారీ స్పందన ఉంటుందని ఎక్సైజ్ శాఖ అధికారులు భావించారు. కానీ, విజయవాడలో రెండు మార్టులకు రెండే దరఖాస్తులు వచ్చాయి. 4వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో షాపు ఏర్పాటు చేయాలన్న నిబంధన కూడా వీటికి స్పందన కరువయ్యేలా చేసింది. నగరాల్లో అంత భారీగా స్థలం లభ్యం కావాలంటే రూ.50 లక్షలైనా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. టెండరు పాడుకున్న తర్వాత ఎక్సైజ్ శాఖకు రూ.కోటి డిపాజిట్ రూపంలో చెల్లించాలి. మార్ట్‌లో అన్నీ ప్రీమియం బ్రాండ్లు ఉంచితేనే కస్టమర్లను ఆకర్షించగలరు. అంతస్థాయిలో స్టాక్ ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం రూ.2.5 కోట్లు వెచ్చించాలి. ఇతరత్రా ఖర్చుల రూపేణా మరో కోటి వరకు అవుతుంది. మొత్తం మీద షాపు ప్రారంభించాలంటే రూ.5 కోట్లు పెట్టుబడి పెట్టాలి. ఇంత చేసినా కమిషన్ ఎంత అనేదానిపై సందిగ్ధత నెలకొంది. 20 శాతం కమిషన్ అని ప్రభుత్వం చెబుతున్నా, వివిధ పన్నులు, సెస్సులకు పోగా అందులో సగం కూడా గిట్టుబాటు కాదని మద్యం దుకాణదారులు చెబుతున్నారు. ఇటీవలే ప్రభుత్వం కమిషన్‌ను 14 శాతం గిట్టుబాటు అయ్యేలా చూస్తామని ప్రకటన చేసినా అది ఎప్పటి నుంచి అమలు అవుతుందనే ఆందోళన మద్యం వ్యాపారుల్లో ఉంది.

ఆంధ్రా లయోలా కళాశాలకు నోటీసులు

» నిబంధనల ఉల్లంఘనపై వివరణ కోరిన కృష్ణా యూనివర్సిటీ

మచిలీపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘించిందని విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలకు కృష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రార్ శోభన్‌బాబు ఈనెల 7వతేదీన నోటీసులు జారీ చేశారు. ఇటీవల ముగ్గురు సభ్యులతో కూడిన బృందం లయోలా కళాశాలను పరిశీలించింది. పలు నిబంధనలను ఉల్లఘించినట్లు గుర్తించింది. అటానమస్ హోదా ఉన్న లయోలా కళాశాల పలు నివేదికలను యూనివర్సిటీకి పంపకుండా జాప్యం చేసిందని, ఈ అంశంపై ఈనెల 9వతేదీలోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కళాశాల పరిపాలనాపరమైన అంశాలు, ఆర్థికపరమైన వ్యవహారాలు, గవర్నింగ్ బాడీ సమావేశాలు నిర్వహించకపోవడం, కళాశాల ప్రణాళికలు, జవాబుపత్రాల మూల్యాంకనం, పరీక్షల నిర్వహణ, నూతన కోర్సులను ప్రవేశపెట్టడం, అకడమిక్ కార్యక్రమాల వివరాలను తెలియజేయకుండా ఉంచారని పేర్కొన్నారు. కళాశాలకు అటానమస్ హోదా గడువు ముగిసినా పొడిగించకపోవడం, వివిధ కోర్సుల్లో అనుమతులు లేకుండా విద్యార్థులను చేర్చుకోవడం, నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు పెంచారని, యూనివర్సిటీకి తెలియజేయలేదని నోటీసులో పేర్కొన్నారు.

హోరాహోరీగా జాతీయ వాలీబాల్ పోటీలు

» సెమీస్‌కు తమిళనాడు, హరియాణ

విజయవాడ స్పోర్ట్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ జూనియర్ కళాశాల గ్రౌండ్స్ వేదికగా నిర్వహిస్తున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-19 బాలికల వాలీబాల్ టోర్నీలో ప్రీ క్వార్టర్స్, క్వార్టర్స్ బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఐదు సెట్ల పోరులో భాగంగా తొలి క్వార్టర్స్‌లో పశ్చిమబెంగాల్‌పై తమిళనాడు 3-1 సెట్ల తేడాతోను, ఉత్తర్‌ప్రదేశ్‌పై హరియాణ వరుస సెట్లలో ఏకపక్షంగా 3-0తో జయభేరి మోగించి సెమీస్ చేరాయి. పోటీల ఏర్పాట్లను రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు, జిల్లా కార్యదర్శి వి.రవికాంత్, టెక్నికల్ కమిటీ ప్రతినిధి దోనేపూడి దయాకర్‌రావు, ఉమ్మడి జిల్లా వాలీబాల్ అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు పర్యవేక్షిస్తున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులతో రాత్రి ఉల్లాసపూరిత వాతావరణంలో క్యాంప్ ఫైర్ నిర్వహించారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

» డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు



జిల్లా జైలులో మాట్లాడుతున్న లీగల్ సర్వీసెస్ అథారిటీ జిల్లా కార్యదర్శి కె.రామకృష్ణయ్య, పక్కన డీసీపీ కృష్ణమూర్తినాయుడు

ధర్నాచౌక్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల అనేక మానసిక, అనారోగ్య సమస్యలు వస్తాయని వీటికి దూరంగా ఉండాలని ఖైదీలకు డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు సూచించారు. నగరంలోని జిల్లా జైలును ఏపీఎస్ఎల్ఎస్ఏ ప్రతినిధులు బుధవారం సందర్శించారు. తొలుత జైలు పరిసరాలు, బ్యారక్‌లను పరిశీలించారు. మత్తుకు బానిసై నేరాలకు పాల్పడి జైలుకు వస్తున్నారని, మత్తు పదార్థాల వినియోగాన్ని మానుకోవాలని డీసీపీ సూచించారు. జైలులో వ్యక్తిగత శుభ్రత పాటించాలని, సత్ప్రవర్తనతో మెలగాలని, మంచివారిగా బయటకు వెళ్లాలని ఖైదీలకు డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని సూచించారు. కేసుల పరిశీలనలో న్యాయస్థానం ముఖ్యపాత్ర పోషిస్తోందని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.రామకృష్ణయ్య తెలిపారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జైలు పర్యవేక్షణాధికారి హంసపాల్, జైలు అధికారి ఎస్.గణేష్, జైలర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

గురువారం • 9 జనవరి 2025

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 81 కేంద్రాల్లో జనవరి 3, 4, 5, 6 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ రూ.6,000, ద్వితీయ రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతులు అందించాం. ప్రతి ఉమ్మడి జిల్లా స్థాయిలో విజేతగా నిల్చిన మహిళలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల విజేతలకు హైదరాబాద్‌లో జనవరి 10న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటక విజేతలిద్దరు... మొత్తం 15 మందికి జనవరి 11న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఫైనలిస్టులకు రూ.1,70,000కు పైగా బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్న ఫైనలిస్టులు, వారు జిల్లాస్థాయి పోటీల్లో తీర్చిన అందమైన రంగవల్లులు 'నవ్య' పాఠకుల కోసం...

సంతూర్ - ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు

ఫైనలిస్టులు వీరే


పి.జ్యోతి, శ్రీకాకుళం


మొలుగు రాజు, విజయనగరం


ఎ.సంతోషి, విశాఖపట్నం


వి.సావిత్రి, తూర్పుగోదావరి


వేణు భార్గవి, పశ్చిమగోదావరి


కె.నాగమల్లేశ్వరి, కృష్ణా


ఎ.సునీత, గుంటూరు


కవిత, ప్రకాశం


డి.ఉష, నెల్లూరు


వి.రెడ్డిరాణి, చిత్తూరు


పి.రమ్య, కడప


జి. శ్రీలక్ష్మి, కర్నూలు


ఎస్.రమ్యకృష్ణ, అనంతపురం


కె.భార్గవి, తమిళనాడు


రోహిణి, కర్ణాటక

క్వార్టర్స్‌లో భాంబ్రీ జోడీ

న్యూఢిల్లీ: యుకీ భాంబ్రీ జోడీ ఏఎస్‌బీ క్లాసిక్ ఏటీపీ టూర్‌లో క్వార్టర్ ఫైనల్స్ చేరింది. బుధవారం ఆక్లాండ్‌లో జరిగిన డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో యుకీ-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 6-4, 6-4తో శాండర్ అరెండ్స్ (నెదర్లాండ్స్)-లూకీ జాన్సన్ (బ్రిటన్) ద్వయంపై గెలిచింది.



ఏఎఫ్ఐ అథ్లెటిక్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా అంజు

నీరజ్ చోప్రా, సబ్లేకు చోటు

చండీగఢ్: దిగ్గజ లాంగ్ జంపర్ అంజూ బాబీ జార్జ్‌కు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ)లో కీలక పదవి లభించింది. తొమ్మిది మంది సభ్యులతో కూడిన అథ్లెటిక్స్ కమిషన్‌కు అంజూ చైర్‌పర్సన్‌గా నియమితురాలైంది. సభ్యులలో ఏకంగా ఆరుగురు మహిళలకు ఏఎఫ్ఐ స్థానం కల్పించింది. అలాగే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా పురుషుల విభాగం నుంచి నామినేట్ అయిన ప్రముఖుడు. కమిషన్ కొత్త సభ్యులుగా మాజీ రన్నర్లు జ్యోతిర్మయి సిక్దర్, సునీతా రాణి, ఎండీ వలసమ్మ, డిస్కస్ త్రోయర్ కృష్ణ పూనియా, స్టీపుల్ చేజర్ సుధా సింగ్ ఎంపికయ్యారు. 2003 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సొంతం చేసుకున్న అంజు.. ఏఎఫ్ఐ సీనియర్ ఉపాధ్యక్షురాలిగా కూడా వ్యవహరిస్తోంది. కాగా..గత అథ్లెటిక్స్ కమిషన్‌లో నలుగురే మహిళా సభ్యులుండడం గమనార్హం. ఇక..రెండుసార్లు ఒలింపిక్ పతకాలు సాధించిన నీరజ్ చోప్రా, 3000మీ. స్టీపుల్ చేజర్ అవినాష్ సబ్లే, కొత్తగా ఎన్నికైన ఏఎఫ్ఏ అధ్యక్షుడు బహదూర్ సింగ్ ఇతర పురుష సభ్యులు.

ప్రీక్వార్టర్స్‌కు ప్రణయ్, మాళవిక

మలేసియా ఓపెన్‌లో సాత్విక్ జోడీ బోణీ


ప్రణయ్

కౌలాలంపూర్: భారత స్టార్ హెచ్ఎస్ ప్రణయ్, వర్ధమాన షట్లర్ మాళవిక బన్సోడ్ మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల డబుల్స్‌లో ఏస్ జంట సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి కూడా శుభారంభం చేసింది. ఇండోర్ స్టేడియం పైకప్పు నుంచి నీళ్లు లీకైన కారణంగా మంగళవారం ప్రణయ్, బ్రయాన్ యాంగ్ (కెనడా) మధ్య తొలిరౌండ్ మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. మ్యాచ్ నిలిపివేసే సమయానికి ప్రణయ్ 21-12, 9-11తో ఉన్నాడు. ఈ మ్యాచ్‌ను బుధవారం కొనసాగించగా.. చివరకు ప్రణయ్ 21-12, 17-21, 21-15తో బ్రయాన్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్ ఆరంభ రౌండ్లో మాళవిక 21-15, 21-16తో స్థానిక ఫేవరెట్ గో జిన్ వీని చిత్తుచేసింది. సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 16-21, 21-5తో లోకల్ జంట టాంగ్ కాయ్ వీ/మింగ్ చెలూపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్‌కు చెందిన తనీషా/ధ్రువ్ జోడీ 21-13, 21-14తో దక్షిణ కొరియా జంట సంగ్ హ్యాన్/హే వోన్‌పై, సతీష్/ఆద్య ద్వయం 21-13, 21-15తో సహచర జోడీ సూర్య/అమృతపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌కు చేరాయి. మిగతా భారత షట్లర్లలో సింగిల్స్‌లో ప్రియాన్షు రజావత్, అనుపమ, ఆకర్షి కశ్యప్.. డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప/తనీషా జంట, రీతూపర్ణ/శ్వేతాపర్ణ ద్వయం ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై తొలి రౌండ్లోనే వెనుదిరిగారు.

చాంపియన్స్ బరిలో ఎవరు?

రాహుల్, జడేజా, షమికి చోటు దక్కేనా?

రోహిత్‌కే పగ్గాలు!



న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా టూర్‌లో ఘోరంగా విఫలమైన సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల కెరీర్ ముగిసిందంటూ ఊహాగానాలు బలంగా వినిపించాయి. కానీ, భారత క్రికెట్ బోర్డు వారికి చివరి అవకాశం ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. ఫిబ్రవరి 19 నుంచి హైబ్రిడ్ ఫార్మాట్‌లో పాకిస్థాన్/దుబాయ్‌లో జరిగే చాంపియన్స్ ట్రోఫీ (సీటీ)లో బరిలోకి దిగే భారత జట్టులో ఇద్దరికీ చోటు కల్పించనున్నట్టు సమాచారం. సారథిగా రోహిత్ శర్మనే కొనసాగించవచ్చు. అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ శనివారం భారత జట్టును ప్రకటించే అవకాశముంది. అయితే, వన్డే ఫార్మాట్‌లో ముగ్గురు సీనియర్లు కేఎల్ రాహుల్, షమి, జడేజా భవితవ్యంపై తీవ్రమైన చర్చ నడుస్తోంది. గత వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ తర్వాత షమి, జడేజాకు పూర్తిగా విశ్రాంతినివ్వగా.. రాహుల్ మాత్రం దక్షిణాఫ్రికా, శ్రీలంకతో సిరీస్‌లలో కనిపించాడు. కాగా, యువ కెరటం యశస్వీ జైస్వాల్ వన్డేల్లో అరంగేట్రం చేసే చాన్సుంది. పంత్‌కు చోటు లభిస్తే రాహుల్ అవసరం ఉండకపోవచ్చు. ఇక, ఎంపికలో కోచ్ గంభీర్ హవా నడిస్తే సంజూ శాంసన్‌కు చోటు దక్కినా ఆశ్చర్యపోనవసరం లేదు. చాంపియన్స్ ట్రోఫీలో భారత్ తమ తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో ఆడనుంది.



భారత బృందం (అంచనా)

రోహిత్ శర్మ (కెప్టెన్), గిల్, యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లి, రాహుల్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి/బిష్ణోయ్, వాషింగ్టన్ సుందర్, బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్/షమి, రింకూ/తిలక్.

అక్షర్‌కే ఓటు!

పరిమిత ఓవర్ల క్రికెట్‌లో జడేజా ఆకట్టుకోలేకపోతున్నాడు. అతడితో పోల్చితే అక్షర్ పటేల్ ప్రదర్శన మెరుగ్గా ఉంది. దీంతో సెలెక్టర్లు అక్షర్‌వైపే మొగ్గే చాన్స్ లేకపోలేదు. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కూడా సత్తాచాటుతున్నాడు. లెగ్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పూర్తి ఫిట్‌గా ఉంటే అతడి చోటుకు ఢోకా లేదు. ఒకవేళ అనుకోని పరిస్థితులు ఎదురైతే రవి బిష్ణోయ్ లేదా వరుణ్ చక్రవర్తిలో ఒకరిని ఎంపిక చేసే చాన్సులున్నాయి. ఇక, షమి ఫిట్‌నెస్ విషయమై ఇంత వరకు స్పష్టత రాలేదు. ఇటీవలే విజయ్ హజారే ట్రోఫీలో షమి బౌలింగ్ చేశాడు. మరోవైపు స్టార్ పేసర్ బుమ్రా వెన్నునొప్పిపై బీసీసీఐ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఒకవేళ అతడు చాంపియన్స్ ట్రోఫీకి దూరమైతే మాత్రం జట్టుకు పెద్దదెబ్బే. ఇక, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా ఉండడంతో.. నితీశ్ కుమార్ పరిస్థితి ప్రశ్నార్థకమైంది. రిజర్వ్ ఆటగాళ్లుగా రింకూ సింగ్ లేదా తిలక్ వర్మ ఎంపికయ్యే ఆస్కారముంది.

టాప్‌లోనే బుమ్రా

ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్



దుబాయ్: స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. బుధవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో బుమ్రా మొత్తం 908 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో భారత్ ఆడిన చివరి, ఐదో టెస్ట్‌కు ముందు 907 పాయింట్లతో నెంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న బుమ్రా... ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో రెండు వికెట్లు తీసి మరో పాయింట్‌ను పెంచుకున్నాడు. ఇక, స్పిన్నర్ రవీంద్ర జడేజా, బోలాండ్‌తో కలిసి సంయుక్తంగా 9వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు దీంతో బుమ్రా తర్వాత భారత్ నుంచి టాప్-10లో ఉన్న బౌలర్‌గా జడ్డూ నిలిచాడు. ఆసీస్ సారథి కమిన్స్ రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. బ్యాటర్ల జాబితాలో పంత్ మూడు స్థానాలు ఎగబాకి 9వ ర్యాంక్‌లో, యశస్వీ జైస్వాల్ 4వ స్థానంలో ఉన్నారు. జో రూట్ నెంబర్‌వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.

బంగారు బాతును చంపుకోవద్దు

బుమ్రాకు కెప్టెన్సీపై కైఫ్ హితవు

ముంబై: బుమ్రాకు టెస్ట్ కెప్టెన్సీ అప్పగించడంపై బీసీసీఐ ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సూచించాడు. ఇటీవలి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ సిరీస్‌లో తొలి, ఆఖరి టెస్టులకు బుమ్రా సారథ్యం వహించిన సంగతి తెలిసిందే. కాగా..రోహిత్ టెస్ట్ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్న క్రమంలో బుమ్రాకే పూర్తిస్థాయి నాయకత్వం అప్పజెపుతారంటూ వార్తలొస్తున్నాయి. ఈనేపథ్యంలో కైఫ్ స్పందిస్తూ కెప్టెన్సీ బుమ్రాపై అదనపు ఒత్తిడి తెస్తుందన్నాడు. అందువల్ల అతడిని పూర్తిస్థాయి సారథిగా నియమించడం ద్వారా బంగారు బాతును చంపుకోవద్దని బోర్డుకు హితవు పలికాడు.

న్యూజిలాండ్‌దే సిరీస్

తీక్షణ హ్యాట్రిక్ వృథా
శ్రీలంక ఓటమి

హామిల్టన్: శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో వన్డే ఉండగానే న్యూజిలాండ్ కైవసం చేసుకుంది. బుధవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 113 పరుగులతో ఘన విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించగా తొలుత న్యూజిలాండ్ 255/9 స్కోరు చేసింది. రచిన్ రవీంద్ర (79), చాప్‌మన్ (62) హాఫ్ సెంచరీలు సాధించారు. రెండో వికెట్‌కు రచిన్, చాప్‌మన్ 112 పరుగులు జోడించారు. తీక్షణ (4/44) హ్యాట్రిక్ సహా నాలుగు వికెట్లతో అదరగొట్టాడు. ఛేదనలో శ్రీలంక 30.2 ఓవర్లలో 142 పరుగులకే కుప్పకూలింది. కమిందు మెండిస్ (64) అర్ధ శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. ఓ రూర్క్ (3/31) మూడు, డఫి (2/30) రెండు వికెట్లు పడగొట్టారు.

అంతర్జాతీయ క్రికెట్‌కు గప్తిల్ గుడ్ బై

తెల్లబంతుల ఫార్మాట్‌లో తిరుగులేని ఓపెనర్
వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు

ఆక్లాండ్: తెల్లబంతుల ఫార్మాట్‌లో తిరుగులేని న్యూజిలాండ్ బ్యాటర్‌గా పేరుపొందిన మార్టిన్ గప్తిల్ అంతర్జాతీయ క్రికెట్‌కు బుధవారం రిటైర్మెంట్ ప్రకటించాడు. 38 ఏళ్ల గప్తిల్ 2009 నుంచి 2022 వరకు 14 ఏళ్ల పాటు కివీస్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈక్రమంలో 198 వన్డేలు, 122 టీ20లు, 47 టెస్టులు ఆడాడు. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఈ కుడిచేతి వాటం ఓపెనర్ మెరుపులు చూసి తీరాల్సిందే. టీ20లలో 3531 పరుగులు చేసిన మార్టిన్..ఈ ఫార్మాట్‌లో అత్యధిక రన్స్ సాధించిన టాప్ న్యూజిలాండ్ బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. వన్డేలలో 7346 రన్స్‌తో రాస్ టేలర్ (8607), స్టీఫెన్ ఫ్లెమింగ్ (8007) తర్వాత అత్యధిక పరుగులు చేసిన మూడో కివీస్ బ్యాటర్ గప్తిల్ కావడం విశేషం. ఓవరాల్‌గా మూడు ఫార్మాట్లలో 367 మ్యాచ్‌లు ఆడిన అతడు అన్నింటిలో కలిపి 23 సెంచరీలు సాధించాడు. ఇక..2015 వన్డే వరల్డ్ కప్‌లో వెస్టిండీస్‌పై క్వార్టర్ ఫైనల్లో మార్టిన్ డబుల్ సెంచరీ (163 బంతుల్లో 24 ఫోర్లు, 11 సిక్సర్లతో 237 నాటౌట్)తో కదం తొక్కాడు. తద్వారా వన్డే ప్రపంచ కప్‌లో అత్యధిక రన్స్ చేసిన రికార్డును ఇప్పటికీ తన పేరిట నమోదు చేశాడు. అలాగే ఓవరాల్‌గా వన్డేలలో అది రెండో అత్యధిక స్కోరు కూడా. 2022లో చివరిసారి కివీస్‌కు ఆడాడు. కివీస్ దేశవాళీ క్రికెట్‌లో ఆక్లాండ్ ఏసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న గప్తిల్ టీ20 ఫ్రాంచైజీ క్రికెట్‌లో కొనసాగుతానని ప్రకటించాడు. 'న్యూజిలాండ్ జాతీయ జట్టుకు ఆడాలనేది నా కల. అలాంటిది నా దేశానికి ఏకంగా 350కిపైగా మ్యాచ్‌ల్లో ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వంగా ఉంది' అని గప్తిల్ పేర్కొన్నాడు.



డోపింగ్‌లో దొరికిన రన్నర్ అర్చన

న్యూఢిల్లీ: మారథాన్ అథ్లెట్ అర్చన లక్ష్మణ్ జాదవ్ డోప్ పరీక్షలో పట్టుబడింది. ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్‌ను విధించారు. అర్చన గత అక్టోబరులో ఢిల్లీ మారథాన్‌లో పాల్గొని నాలుగో స్థానంలో నిలిచింది. ఆ సమయంలో ఆమె రక్త నమూనాలను ఏఐయూ సేకరించింది. వివిధ పరీక్షల అనంతరం ఆ నమూనాల్లో నిషేధిత ఆక్సాండ్రోలోన్ ఉత్ప్రేరకాలు ఉన్నట్టు కనుగొన్నారు.

సిడ్నీ పిచ్..పర్లేదు

ఐసీసీ రేటింగ్

సిడ్నీ: ఇటీవలే ముగిసిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో తొలి నాలుగు టెస్టులు జరిగిన పిచ్‌లకు ఐసీసీ 'ఉత్తమ' రేటింగ్ ఇచ్చింది. అయితే, ఆఖరి మ్యాచ్‌కు వేదికైన సిడ్నీ పిచ్‌కు 'సంతృప్తికర' రేటింగ్ లభించింది. సహజంగా బ్యాటింగ్ వికెట్ అయిన సిడ్నీ.. ఈసారి పేసర్లకు సహకరించడంతో మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. 'పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్ పిచ్‌లు ఉత్తమం. సిడ్నీ వికెట్ సంతృప్తికరం' అని ఐసీసీ ప్రకటించింది.

బిజినెస్

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి

న్యూఢిల్లీ: భారత కరెన్సీ సరికొత్త జీవనకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 17 పైసలు క్షీణించి రూ.85.91 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతోపాటు ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకడం ఇందుకు ప్రధాన కారణం. ఈక్విటీ మార్కెట్లో నష్టాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం కూడా రూపాయిని మరింత బలహీనపరిచాయి.

సెన్సెక్స్ 50 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ సూచీలు బుధవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఒకదశలో 712 పాయింట్ల మేర క్షీణించిన సెన్సెక్స్.. చివరికి 50.62 పాయింట్ల నష్టంతో 78,148.49 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 18.95 పాయింట్లు కోల్పోయి 23,688.95 వద్ద క్లోజైంది. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు అంచనాలను నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి 6.4 శాతానికి తగ్గించడంతో పాటు డిసెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై అమ్మకాలకు పాల్పడ్డారు.

డా. అగర్వాల్స్ ఐపీఓకు సెబీ ఆమోదం

న్యూఢిల్లీ: నేత్ర వైద్య సేవల సంస్థ డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీఓలకు సెబీ ఆమోదం తెలిపింది. డాక్టర్ అగర్వాల్స్ హెల్త్‌కేర్ ఐపీఓలో భాగంగా రూ.300 కోట్ల తాజా ఈక్విటీ జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 6.95 కోట్ల షేర్లను విక్రయించనుంది. దీంతో పాటు చెన్నై రియల్టీ సంస్థ కాసగ్రాండ్ ప్రీమియర్ బిల్డర్, మధ్యప్రదేశ్‌కు చెందిన టోల్ కలెక్షన్ అండ్ ఈపీసీ ఇన్‌ఫ్రా కంపెనీ హైవే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇథనాల్ ప్లాంట్ల తయారీలోని రీగ్రీన్-ఎక్సెల్ ఈపీసీ ఇండియా ఇష్యూలకు కూడా అనుమతించింది.

● హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ రూ.410 కోట్ల ఐపీఓకు అద్భుత స్పందన లభించింది. బుధవారంతో ముగిసిన ఈ ఇష్యూకు ఏకంగా 182.57 రెట్ల బిడ్లు వచ్చాయి.

ఏడీఐఏ నుంచి జీఎంఆర్ గ్రూప్‌నకు రూ.6,300 కోట్లు

న్యూఢిల్లీ: అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) నుంచి జీఎంఆర్ గ్రూప్‌నకు రూ.6,300 కోట్ల పెట్టుబడి నిధులు అందాయి. జీఎంఆర్ గ్రూప్ ఈ నిధులను ప్రధాన కంపెనీ జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీఈపీఎల్) రుణభారం తగ్గించేందుకు ఉపయోగించనుంది. ఇందుకు బదులుగా జీఎంఆర్ గ్రూప్ ఈ నెల 7న ఏడీఐఏకు జీఈపీఎల్ అనుబంధ కంపెనీ జీఎంఆర్ ఇన్‌ఫ్రా ఎంటర్‌ప్రైజెస్‌లో ఆప్షనల్లీ కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేసింది.

బర్డ్ ఢిల్లీలో వాటా: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ విమానాశ్రయాల అనుబంధ వ్యాపారాల్లోకీ విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బర్డ్ ఢిల్లీ జనరల్ ఏవియేషన్ సర్వీసెస్ (బీడీజీఏఎస్‌పీఎల్) ఈక్విటీలో 50 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.15.02 కోట్లు ఖర్చు చేసినట్టు రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది.

ఇండియాఏఐతో మైక్రోసాఫ్ట్ జట్టు



2026 నాటికి 5 లక్షల మందికి 'ఏఐ'లో శిక్షణ

» మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రెసిడెంట్ చందోక్ వెల్లడి

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి చెందిన కృత్రిమ మేధ (ఏఐ) ప్రాజెక్ట్ 'ఇండియాఏఐ'తో అమెరికన్ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ చేతులు కలిపింది. ఈ భాగస్వామ్యంలో దేశంలోని విద్యార్థులు, టీచర్లు, డెవలపర్లు, ప్రభుత్వ అధికారులు, మహిళా పారిశ్రామికవేత్తలు సహా మొత్తం 5 లక్షల మందికి ఏఐలో శిక్షణ ఇవ్వనున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ వెల్లడించారు. "భారత్‌లో 20 లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు గత ఏడాదే ప్రకటించాం. ఇప్పటికే 24 లక్షల మందికి శిక్షణ అందించాం. వచ్చే ఐదేళ్లలో కోటి మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తాజాగా ప్రకటించడం జరిగింది. ఇందుకోసం ఇండియాఏఐ మిషన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ ఒప్పందంలో భాగంగా 5 లక్షల మందికి శిక్షణ అందిస్తాం" అని చందోక్ పేర్కొన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా మైక్రోసాఫ్ట్ 10 రాష్ట్రాలోని 20 నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఎన్ఎస్‌టీఐ), ఎన్ఐఈఎల్ఐటీ సెంటర్లలో ఏఐ ప్రొడక్టివిటీ ల్యాబ్స్‌ను మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రాల ద్వారా 20,000 మంది టీచర్లకు ఏఐ ఫండమెంటల్స్ శిక్షణ ఇవ్వడంతోపాటు 200 ఐటీఐల్లో 1,00,000 మంది విద్యార్థులకు ఫౌండేషన్ ఏఐ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే, 'ఏఐ క్యాటలిస్ట్' పేరుతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సైతం ఏర్పాటు చేయనున్నట్లు చందోక్ వెల్లడించారు. ఈ కేంద్రం ద్వారా గ్రామాల్లో ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహించడంతోపాటు లక్ష మంది ఏఐ డెవలపర్లకు మద్దతివ్వనున్నారు. సమాజానికి పనికివచ్చే పరిష్కారాల అభివృద్ధిని ప్రోత్సహించనున్నారు.

సరికొత్త ఆవిష్కరణల కోసం కృషి చేయాలి: నాదెళ్ల

కృత్రిమ మేధలో సరికొత్త ఆవిష్కరణల కోసం భారత్ కృషి చేయాలని, సొంత ఫౌండేషనల్ మోడల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని మైక్రోసాఫ్ట్ సారథి సత్య నాదెళ్ల అన్నారు. కానీ, ఇందుకు పెట్టుబడుల లేమి ప్రధాన అవరోధమని, ఒక్క పురోగతి మొత్తం స్థితిగతులను మార్చగలదన్నారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఏఐ టూర్ రెండో రోజు (బుధవారం) నాదెళ్ల ఈ వ్యాఖ్యలు చేశారు. భారతీయ భాషలు, ఏఐ ద్వారా పారిశ్రామిక పరివర్తనం అంశాల్లో భారత్ గొప్పగా కృషి చేయాలన్నారు. ప్రస్తుతం భారత్ గూగుల్, ఓపెన్ ఏఐ తదితర సంస్థలు అభివృద్ధి చేసిన ఏఐ ఇంజన్లు లేదా ఫౌండేషనల్ మోడల్స్‌ను ఉపయోగించుకుంటోంది.

విదేశీ మార్కెట్లపై మహీంద్రా ఫోకస్



ఇప్పటికే బలం ఉన్న చోట్ల కొత్త వాహనాల విడుదల

పూణె: దేశీయ మార్కెట్లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న మహీంద్రా అండ్ మహీంద్రా అంతర్జాతీయ మార్కెట్ల విస్తరణ వైపు దృష్టి సారించింది. దశలవారీగా అంతర్జాతీయ మార్కెట్లలో ఆటోమోటివ్ వ్యాపారాన్ని విస్తరించాలని యోచిస్తున్నట్టు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈఓ రాజేష్ జెజూరికర్ తెలిపారు. విదేశీ మార్కెట్లకు విస్తరించే ప్రయత్నంలో భాగంగా ప్రస్తుతం ఉన్న పంపిణీ చానళ్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న లైఫ్‌స్టైల్ పికప్ ట్రక్, కొత్తగా తయారుచేయనున్న విద్యుత్ వాహనాలు అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లలో ప్రవేశించేందుకు సహాయపడతాయని భావిస్తున్నట్టు తెలిపారు. కంపెనీకి ఇప్పటికే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, చిలీ, మొరాకో బలమైన మార్కెట్లుగా ఉన్నాయి. ఈ మార్కెట్లన్నింటిలోనూ స్కార్పియో పికప్‌కు మంచి ఆదరణ ఉన్నదంటూ ఎక్స్‌యూవీ 700, స్కార్పియో ఎన్, ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ వాహనాలను ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు ఆయన వెల్లడించారు. తయారీ దశలో ఉన్న లైఫ్‌స్టైల్ పికప్ వాహనం రైట్ హ్యాండ్ డ్రైవ్, లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ మార్కెట్లన్నింటి అవసరాలు తీర్చుతుందని జెజూరికర్ తెలిపారు. ప్రధానంగా పికప్ వాహనాలకు ఆసియాన్ మంచి మార్కెట్ అని, అక్కడకు తాము ఇంకా విస్తరించలేదని ఆయన అన్నారు. 2023 సంవత్సరంలో మహీంద్రా కంపెనీ "గ్లోబల్ పికప్" కాన్సెప్ట్ కారును ఆవిష్కరించింది. 2027 నాటికి అది ఉత్పత్తి దశను చేరుతుందని ఆయన చెప్పారు. ప్రపంచ మార్కెట్ల విస్తరణలో మూడో దశగా రైట్‌హ్యాండ్ డ్రైవ్ విద్యుత్ ఎస్‌యూవీలను ప్రవేశపెట్టనున్నట్టు ఆయన తెలిపారు. రైట్ హ్యాండ్ డ్రైవ్ మార్కెట్లలో స్థిరపడిన అనంతరం లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ మార్కెట్లలోకి ప్రవేశించాలనుకుంటున్నట్టు చెప్పారు. ఐసీఈ (ఇంటర్నల్ కంబుస్టన్ ఇంజన్) పోర్ట్‌ఫోలియోలో మరింత బలపడేందుకు 2025 సంవత్సరంలో ప్రయత్నిస్తామని జెజూరికర్ తెలిపారు. రాక్స్ మోడల్‌కు ఈ మార్కెట్లలో మంచి ఆదరణ ఉన్నదని, ఉత్పత్తి సామర్థ్యాలను మరింత పెంచవలసి ఉన్నదని చెప్పారు. అలాగే 3 ఎక్స్‌ఓ సామర్థ్యాలు కూడా పెంచుకోవలసి ఉన్నదన్నారు. 2025 సంవత్సర ప్రాధాన్యతల్లో విద్యుత్ వాహనాలు కీలకమని ఆయన తెలిపారు. గత నవంబరులో తాము ఆవిష్కరించిన బీఈ 6, ఎక్స్‌ఈవీ 9ఇ విద్యుత్ కార్ల డెలివరీ మార్చి నాటికి ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు.

బుధవారం కంపెనీ చకాన్ ప్లాంట్‌లో ఈవీ తయారీ, బ్యాటరీ తయారీ యూనిట్లను ప్రారంభించింది. ఏడాదికి 90 వేల విద్యుత్ కార్ల తయారీ సామర్థ్యాన్ని సాధించాలని కంపెనీ భావిస్తోంది. ఏడాదికి 1.2 లక్షల వరకు తయారీ సామర్థ్యం పెంచుకోగల వసతి ఈ ప్లాంట్‌లో ఉంది. 2022-27 సంవత్సరాల మధ్య కాలంలో విద్యుత్ వాహనాలపై రూ.16,000 కోట్లు పెట్టుబడి పెడుతున్నట్టు కంపెనీ ఇప్పటికే ప్రకటించింది.

షామీ ఇండియా నుంచి కొత్త 5జీ స్మార్ట్‌ఫోన్

ధర రూ. 9,9999 నుంచి రూ. 11,999



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): చైనా స్మార్ట్‌ఫోన్ల కంపెనీ షామీ ఇండియా భారత మార్కెట్‌లో 'రెడ్‌మీ 14సీ 5జీ' పేరుతో సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేస్తోంది. ఈ నెల 10వ తేదీ నుంచి అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు ఆఫ్‌లైన్ స్టోర్లలో ఈ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు ప్రారంభమవుతాయని కంపెనీ మార్కెటింగ్ విభాగం అసోసియేట్ డైరెక్టర్ సందీప్ శర్మ విలేకరులతో చెప్పారు. మూడు రంగులు, మూడు వేరియంట్లలో ఈ 5జీ స్మార్ట్‌ఫోన్ లభిస్తుంది. 50 మెగాపిక్సెల్ (ఎంపీ) కెమెరాతో పాటు సెల్ఫీల కోసం ప్రత్యేకంగా 8 ఎంపీ కెమెరాను ఈ స్మార్ట్‌ఫోన్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఫోన్ బ్యాటరీ సామర్థ్యం 5160 ఎంఏహెచ్. ఈ 'రెడ్‌మీ 14సీ 5జీ' స్మార్ట్‌ఫోన్‌తో పాటు కంపెనీ రూ.1,999 విలువైన 33 వాట్స్ చార్జర్‌ను ఉచితంగా ఇస్తోంది. 4జీబీ+64 జీబీ మోడల్ రూ.9,999, 4జీబీ+128 జీబీ మోడల్ ధర రూ.10,999గా, 6జీబీ+128 జీబీ మోడల్ ధర రూ.11,999గా కంపెనీ నిర్ణయించింది. గత ఏడాది విడుదల చేసిన రెడ్‌మీ 13సీ 5జీ మోడల్‌లానే రెడ్‌మీ14సీ 5జీ మోడల్‌కూ వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుందని ఆశిస్తున్నట్టు శర్మ చెప్పారు.

హైదరాబాద్‌లో బ్రిగేడ్ గేట్‌వే ప్రాజెక్టు

ఒక్కో ఫ్లాట్ ధర రూ.4-12 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బ్రిగేడ్ గ్రూప్ హైదరాబాద్‌లో మరో భారీ ప్రాజెక్టు ప్రారంభించింది. కోకాపేటలోని నియోపోలిస్ వద్ద దాదాపు రూ.4,500 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్టు చేపడుతోంది. ఇందులో ఇప్పటికే భూసేకరణ ఇతర ఖర్చుల కోసం రూ.1,000 కోట్లు ఖర్చు చేసినట్టు బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్ (బీఈఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అమర్ మైసూర్ చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 ఎకరాల్లో 45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే చోట వరల్డ్ ట్రేడ్ సెంటర్, బ్రిగేడ్ రెసిడెన్స్, బ్రిగేడ్ ఓరియన్ మాల్, మూడు వందలకుపైగా గదుల సామర్థ్యంతో ఇంటర్‌కాంటినెంటల్ హోటల్ ఏర్పాటు చేస్తారు. నాలుగేళ్లలో పూర్తి చేయాలనుకుంటున్న ఈ ప్రాజెక్టులో 'బ్రిగేడ్ రెసిడెన్స్' పేరుతో ఏర్పాటు చేసే వెంచర్‌లో ఒక్కో సూపర్ లగ్జరీ ఫ్లాట్ ధర విస్తీర్ణాన్ని బట్టి రూ.4 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు ఉంటుంది.

బిగ్ 'సి' సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ప్రముఖ మొబైల్ రిటైలింగ్ కంపెనీ బిగ్ 'సి' సంక్రాంతిని పురస్కరించుకుని కస్టమర్లకు ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటించింది. ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10,000 విలువ గల మొబైల్ ప్రొటెక్షన్‌తో పాటు రూ.5,999 విలువ గల స్మార్ట్ వాచ్ లేదా రూ.1,799 విలువ గల ఇయర్ బడ్స్ ఉచితంగా అందిస్తున్నట్టు కంపెనీ సీఎండ బాలు చౌదరి చెప్పారు. ఇవి కాకుండా ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.15,000 తక్షణ క్యాష్‌బ్యాక్, బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51 శాతం వరకు డిస్కౌంట్, ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ అవసరం లేకుండా మొబైల్ కొనుగోలు సదుపాయం, ఐఫోన్ కొనుగోలుపై రూ.5,000 తక్షణ డిస్కౌంట్, వివో, ఒప్పో ఫోన్ల కొనుగోలుపై 10% వరకు క్యాష్‌బ్యాక్, వన్‌ప్లస్, రియల్‌మీ మొబైల్స్ కొనుగోలుపై రూ.3,000వరకు డిస్కౌంట్, ఎంఐ మొబైల్స్ కొనుగోలుపై రూ.5.000వరకు డిస్కౌంట్ వంటి ఆఫర్లు అందిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఏటీఎం కార్డ్‌పై ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా మొబైల్, స్మార్ట్ టీవీ, లాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేసేందుకు ఆకర్షణీయమైన ఆఫర్ కూడా అందిస్తున్నట్టు చెప్పారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,820 ▲	72,250 ▲	1,00,000 ▲
విజయవాడ	79,700 ▲	75,200 ▼	92,000 ▼
విశాఖపట్నం	78,230 ▲	71,710 ▲	91,470 ▲
రాజమండ్రి	78,820 ▲	72,250 ▲	91,800 ▲
ప్రొద్దుటూరు	79,100 ▲	73,250 ▲	92,200 ▲
ముంబై	77,360 ▲	70,860 ▲	89,500 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	510
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	523	విశాఖపట్నం	515
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	116
వరంగల్	114	గుంటూరు	115
కరీంనగర్	114	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	95
కర్నూలు	114	నెల్లూరు	100
విశాఖపట్నం	107	అనంతపురం	100
గోదావరి	116		

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
విజయవాడ ● గురువారం 9 జనవరి 2025

కత్తి మీద సాములాంటి పాత్ర పోషించా



ఐశ్వర్య రాజేశ్ నటించిన తాజా చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఐశ్వర్య మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు అనిల్ రావిపూడి మొదట లుక్ టెస్ట్ కోసం నన్ను పిలిచారు. ఆ తర్వాత కథ చెప్పగానే విపరీతంగా నచ్చింది. ఆయన కథ చెప్పేటప్పుడే ఈ సినిమా ప్రేక్షకులని కడుపుబ్బా నవ్విస్తుంది అని అర్థమైంది. సినిమాలో కీలకమైన 'భాగ్యం' పాత్రలో కనిపిస్తా. కత్తి మీద సాములాంటి క్యారెక్టర్ ఇది. ఈ రోల్ పోషిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. వెంకటేశ్ అద్భుతమైన కో స్టార్. ఆయన కామెడీ టైమింగ్ చాలా బాగుంటుంది. ప్రేక్షకుల నాడి తెలిసిన దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ సినిమా పాటలు ఇప్పటికే సూపర్ హిట్ అయ్యాయి. భీమ్స్ సిసిరోలియో అందరినీ అలరించే సంగీతం ఇచ్చారు. ఇది ఫీల్ గుడ్ ఫ్యామిలీ సినిమా. ఇటువంటి కుటుంబ చిత్రం వచ్చి చాలా రోజులైంది. అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

ఇది సినిమా కాదు జీవితం



రాజేంద్రప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్ష సింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేశ్ చౌదరి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఇది సినిమా కాదు జీవితం. ఈ ప్రాజెక్ట్‌కు పనిచేసిన వారందరూ గర్వపడేలా ఉంటుందీ చిత్రం. మన కుటుంబంలోని వారంతా సంతోషంగా ఉండాలంటే ఏం చేయాలో చెప్పే చిత్రమిది" అని అన్నారు. అర్చన మాట్లాడుతూ "లేడీస్ టైలర్ వచ్చిన 38 ఏళ్లకు తిరిగి రాజేంద్రప్రసాద్‌తో పనిచేస్తుండడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెప్పారు. దర్శకుడు పవన్ ప్రభ మాట్లాడుతూ "మంచి విలువలున్న చిత్రమిది. కలకాలం ప్రేక్షకుల మదిలో గుర్తుండిపోతుంది" అని తెలిపారు.

శక్తిమంతమైన పాత్రలో...



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సంయుక్త హీరోయిన్. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమా టైటిల్ 'హైందవ' అని ప్రకటించారు. అద్భుతమైన విజువల్స్, యాక్షన్ సన్నివేశాలతో గ్లింప్స్ ఆకట్టుకుంది. సాయి శ్రీనివాస్ ఇందులో శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఆర్.కార్తీక శ్రీనివాస్, డీఓపీ: శివేంద్ర, సంగీతం: లియోన్ జేమ్స్.

హారర్ కామెడీలో...



వచ్చే నాలుగేళ్ల కాలంలో ఎనిమిది హారర్ కామెడీ చిత్రాలు నిర్మించనున్నట్లు మ్యాడ్‌లాక్ ఫిల్మ్స్ సంస్థ ఇటీవల ప్రకటించింది. అందులో భాగంగా ఈ ఏడాది రెండు చిత్రాల నిర్మాణం ప్రారంభించిందీ సంస్థ. వాటిల్లో 'థామా' చిత్రం దీపావళికి, మరో సినిమా 'శక్తి షాలిని' డిసెంబర్ 31న విడుదల చేయాలనేది మ్యాడ్‌లాక్ ప్రణాళిక. 'థామా' చిత్రంలో అయుష్మాన్ ఖురానా, రష్మిక, నవాజుద్దీన్ సిద్ధిఖి, పరేశ్ రావెల్.. ఇలా భారీ తారాగణమే ఉంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఇక రెండో సినిమా 'శక్తి షాలిని'లో కియారా అద్వాణీ కీలక పాత్ర పోషించనున్నారు. భారత జానపద కథల నుంచి స్ఫూర్తి పొంది తయారు చేసిన కథతో రూపుదిద్దుకొనే ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ షూటింగ్ ఏప్రిల్, మే నెలల్లో ప్రారంభం కానుంది. కియారా నటించిన తెలుగు చిత్రం 'గేమ్ ఛేంజర్' ఈ నెల 10న విడుదలవుతోంది.

టికెట్ల రేటు పెంపు... పది రోజులు చాలు

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

గేమ్‌ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాల టికెట్ల రేటు పెంపును పదిరోజుల వరకే పరిమితం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సినిమా టికెట్ల రేటు పెంపు విషయంలో గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులను అమలుచేయాలని స్పష్టం చేసింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. గేమ్‌ఛేంజర్, డాకు మహారాజ్ సినిమా టికెట్ల రేట్ల పెంపు, అధిక షోల ప్రదర్శనకు ప్రభుత్వం అనుమతించడాన్ని సవాల్ చేస్తూ గుంటూరుకు చెందిన అరిగెల శ్రీనివాసులు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా... పిటిషనర్ తరఫు న్యాయవాది శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు. టికెట్ ధరలను 14 రోజులు పెంచుకొనేందుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మెమో ఇచ్చిందన్నారు. సినిమా హీరోలు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి బంధువులు కావడంతోనే ప్రీమియర్ షో, టికెట్ ధర పెంపునకు అనుమతిచ్చారన్నారు. ప్రీమియర్ షో వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. గేమ్‌ఛేంజర్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు వెళ్లి వస్తూ ఇద్దరు యువకులు చనిపోయారని గుర్తుచేశారు. అర్ధరాత్రి ప్రీమియర్ షోను రద్దు చేయాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ... 'రాకెట్ ప్రయోగ కార్యక్రమానికి వెళ్లి వస్తూ వాహన ప్రమాదానికి గురై వ్యక్తులు మరణించారనే కారణంతో శ్రీహరికోటలో ప్రయోగాలు నిలిపివేయాలన్నట్లు మీ అభ్యర్థన ఉంది' అని వ్యాఖ్యానించింది. ప్రస్తుత పిల్‌పై తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొంటూ విచారణను వాయిదా వేసింది.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

ఎమర్జెన్సీ సినిమా చూడండి

ప్రియాంక గాంధీకి కంగనా రనౌత్ ఆహ్వానం



ఎమర్జెన్సీ చిత్రం చూడమని ఎంపీ ప్రియాంక గాంధీని ఆహ్వానించినట్లు బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్ తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో కంగనా రనౌత్ ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. ఈ నెల 17న విడుదలవుతున్న సందర్భంగా ఆమె సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను మీడియాతో పంచుకున్నారు. "ఇందిరాగాంధీకి ప్రియాంక మనవరాలు కావడంతో అందరికన్నా ముందుగా ఆమెకు 'ఎమర్జెన్సీ' సినిమా చూపిస్తే బావుంటుందనిపించింది. ఈ మధ్య పార్లమెంట్‌లో ప్రియాంక గాంధీని కలిశాను. మీరు తప్పకుండా 'ఎమర్జెన్సీ' చిత్రం చూడాలి. మీకు బాగా నచ్చుతుంది అని కోరాను. 'అవును నచ్చొచ్చు, వీలు చూసుకొని సినిమా చూస్తాను' అని ప్రియాంక గాంధీ చెప్పారు" అని కంగనా రనౌత్ తెలిపారు.

అలాగే ఇందిరాగాంధీ గురించి ఆమె ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో నిఖార్సైన బంధుప్రీతికి ఇందిరాగాంధీ నిదర్శనం అన్నారు. ఆమెను వారసత్వ రాజకీయాలకు ప్రతీకగా తాను భావిస్తున్నట్లు చెప్పారు. ఆమె ఎంతోమంది అభిమానించే నాయకురాలు, మూడుసార్లు ప్రధాని కావడం అంటే తమాషా కాదు అంటూనే, మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ తనయ కావడం వల్ల రాజకీయాల్లో ఎదిగారనీ, అందుకు తన ఘనమైన కుటుంబ నేపథ్యాన్ని ఉపయోగించుకున్నారని కంగన అన్నారు. అయితే 'ఎమర్జెన్సీ' చిత్రంలో వివాదాస్పద అంశాలను స్పృశించకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. "ఒక వ్యక్తిగా ఇందిరాగాంధీ నాకు నచ్చినా, నచ్చకున్నా ఆ పాత్రకు నూరుశాతం న్యాయం చేయడానికే ప్రయత్నించాను" అని చెప్పారు. గతేడాది సెప్టెంబర్‌లో 'ఎమర్జెన్సీ' చిత్రం విడుదల కావాల్సి ఉండగా, సెన్సార్‌బోర్డ్ అనుమతి లభించకపోవడంతో విడుదల వాయిదా పడింది. వివాదాస్పద సన్నివేశాలకు కత్తెర వేయడంతో అనుమతులు లభించాయి.

ఆ తరహా చిత్రాలకే ఆస్కార్‌లో పెద్ద పీట

దేశ వ్యతిరేకంగా రూపొందిన చిత్రాలకే ఆస్కార్ పురస్కారాల్లో పెద్దపీట వేస్తున్నారని కంగన విమర్శించారు. ఇలాంటి చిత్రాలకు ఏటా ఆస్కార్ నామినేషన్స్ దక్కడం ఓ తంతుగా మారిందన్నారు. మన సినిమాల విషయంలో వారు ప్రత్యేక ఎజెండా అమలు చేస్తున్నారనీ, దేశాన్ని తక్కువగా చూపించే 'స్లమ్‌డాగ్ మిలియనీర్' లాంటి చిత్రాలకు ఆస్కార్ పురస్కారాలు దక్కుతున్నాయని తెలిపారు.

ఆడపులి అరాచకం

'రాచకొండ ఒక అడవి లాంటిదబ్బా.. ఈడ బలంతో పోరాడే పులులు, బలగంతో పోరాడే ఏనుగులు, ఎత్తుకు పై ఎత్తు వేసే గుంటనక్కలు, కాసుకుని కాటేసే విష సర్పాలు ఉంటాయి. వాటి మధ్య జరిగే పోరులో రక్త పాతాలే తప్ప రక్త సంబంధాలు ఉండవు' అంటూ సాగింది 'రాచరికం' చిత్రం ట్రైలర్. అప్సరా రాణి, విజయ్‌శంకర్, వరుణ్ సందేశ్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు మారుతి విడుదల చేశారు. విలేజ పొలిటికల్ రివెంజ్ డ్రామా ఇదని దర్శక ద్వయం సురేశ్ లంకపల్లి, ఈశ్వర్ వాసే చెప్పారు. ఈశ్వర్ ఈ చిత్రానికి నిర్మాత.



ప్రేక్షకులకు చేరువవుతా



శ్రద్ధా శ్రీనాథ్ నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా శ్రద్ధా మీడియాతో ముచ్చటించారు.

"నేను ఈ సినిమాలో నందిని అనే పాత్రలో నటించాను. నటనకు ఆస్కారముండే పాత్ర ఇది. నందిని పాత్రను దర్శకుడు చాలా బాగా డిజైన్ చేశారు. ఇలాంటి పాత్రను నేను ఇప్పటివరకు చేయలేదు. ఈ క్యారెక్టర్ ప్రతీ విషయంలో ఎంతో స్పష్టతతో పాటు ఓపికగా ఉంటుంది. నేను నటించిన వాటిలో పూర్తి స్థాయి కమర్షియల్ సినిమా ఇదే. ఈ సినిమాతో ప్రేక్షకులకు మరింత చేరువవుతాను. బాలకృష్ణతో పనిచేయడం మరిచిపోలేని అనుభవం. ఆయనలో కొంచెం కూడా స్టార్ అనే ఫీలింగ్ చూడలేదు. ఆయన దర్శకులు ఏం చెప్తే అది చేయడానికి సిద్ధంగా ఉంటారు. దర్శకుడు బాబీ కొల్లి ఎంతో ప్రతిభ గల దర్శకుడు. ప్రతీ విషయంలో చాలా స్పష్టతతో ఉంటారు. ఈ సినిమాకు తమన్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇది మాస్ ప్రేక్షకులతో పాటు కుటుంబ ప్రేక్షకులను పాటు విపరీతంగా ఆకట్టుకునే సినిమా" అని చెప్పారు.



ప్రధానికి శ్రీమహావిష్ణువు ప్రతిమను బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పక్కన గవర్నర్ నజీర్

వివిధ ప్రాంతాల ప్రజల దశాబ్దాల కలలు నేరవేర్చేలా... రాష్ట్రాభివృద్ధికి ఊతం ఇచ్చేలా... వివిధ ప్రాంతాలను అనుసంధానం చేసేలా జాతీయ రహదారులు, రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ ప్రాజెక్టులు... రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి, లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు పారిశ్రామిక హబ్‌లు... ఇలా రూ.2,08,548 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఒకేరోజు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పూర్తయిన పలు ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. బుధవారం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రాజెక్టులన్నీ పూర్తయితే కోట్లాది రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలాగే వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణ సమయం తగ్గించేలా రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. తాజాగా మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ప్రాజెక్టుల గురించి క్లుప్తంగా...

-ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్



సంక్రాంతులు..

పట్టాలెక్కిన భారీ ప్రాజెక్టులు .. రూ.2 లక్షల కోట్లతో శ్రీకారం

భారీ పెట్టుబడులు, ఉద్యోగాలు వచ్చేలా నవశకానికి నాంది

పల్నాడు జిల్లా రోడ్లకు మహర్దశ

» చిలకలూరిపేట బైపాస్

పల్నాడు జిల్లా పరిధిలోని చిలకలూరిపేట బైపాస్ రోడ్డును ప్రధాని జాతికి అంకితం చేశారు. రూ.907 కోట్ల వ్యయంతో బైపాస్ నిర్మించారు. దేశంలోనే మోడల్ బైపాస్ ఇది. బైపాస్ విశాలమైన ప్రాంతాల్లో మెగా వాట్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాత్రి వేళ రహదారిపై ఏర్పాటు చేసిన లైటింగ్‌కు వినియోగిస్తారు.

దావులపల్లి జాతీయ రహదారి

నాగార్జున సాగర్-దావులపల్లి జాతీయ రహదారిని ప్రారంభించారు. రూ.230 కోట్ల వ్యయంతో 47 కిలో మీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ 312 కోట్ల వ్యయంతో 20 కిలో మీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు.

కొండమోడు రహదారి

కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారి పనులను ప్రారంభించారు. ఇప్పటికే రహదారి పనులకు నిధులు మంజూరు, భూసేకరణ, టెండర్ ప్రక్రియ పూర్తయింది. దశాబ్దాలుగా కొండమోడు రహదారిని విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు. ఇక గోతుల కష్టాలు తీరనున్నాయి. రూ.882 కోట్లతో పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. సుమారు 585 ఎకరాల భూమిని సేకరించారు. టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.

తిరుపతి సిగలో క్రిస్ సిటీ

ప్రధాని శంకుస్థాపన చేసిన క్రిస్ సిటీ తిరుపతి జిల్లా స్థాయిని అమాంతం పెంచనుంది. కృష్ణపట్నం పోర్టు, చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఆధారంగా చేసుకుని తిరుపతి జిల్లా చిల్లకూరు, కోట మండలాల పరిధిలో 10,834 ఎకరాలలో ఏర్పాటు చేయనున్నారు. ప్రాజెక్టు పూర్తయితే పలు పరిశ్రమలు ఏర్పాటవుతాయని, రూ.37,500 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా. దీని వల్ల 4,67,500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు.

221 కి.మీ. రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ

» ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు లబ్ధి

దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో 221 కిలోమీటర్ల రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తి చేయడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఆర్థికాభివృద్ధికి ఊతం లభించింది. వ్యవసాయ, ఆక్వాకల్చర్ రంగాలకు మరింత ఊపునివ్వడానికి ఈ లైన్ ఉపయోగపడనుంది. విజయవాడ-గుడివాడ, గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం-నరసాపురం, నరసాపురం-నిడదవోలు రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ పనులను రూ.3 వేల కోట్లతో 2020లో చేపట్టారు. 221 కిమీ ప్రాజెక్టును రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ శరవేగంగా పూర్తి చేసింది. అంతకుముందు ఈ మార్గంలో సింగిల్ లైన్ కారణంగా ప్రయాణానికి ఎక్కువ సమయం పట్టేది. డబ్లింగ్ పూర్తికావడంతో ప్రయాణం వేగవంతం కావడంతో పాటు విజయవాడ-విశాఖపట్నం రైల్వే రూట్‌లో ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది.

'అనంత' అభివృద్ధికి బాటలు

ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధికి బాటలు వేసేలా పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.160 కోట్లతో అనంతపురం-తాడిపత్రి బైపాస్ రహదారి 4వరుసల విస్తరణకు.. రూ.350 కోట్లతో గుత్తి నుంచి పెండేకల్లు వరకు రైల్వే డబ్లింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.208 కోట్లతో పూర్తి చేసిన మడకశిర-శిర, రూ.536 కోట్లతో నిర్మించిన బత్తలపల్లి-ముదిగుబ్బ 4వరుసల రహదారిని, రూ.998 కోట్లతో నిర్మించిన గుత్తి-ధర్మవరం రైల్వే లైన్‌ను ప్రారంభించారు.

అనకాపల్లి జిల్లాకు వరాలు



గ్రీన్ హైడ్రోజన్ హబ్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు శంకుస్థాపన చేశారు. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్-న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ) కలిసి దీనిని ఏర్పాటు చేస్తున్నాయి. ప్రభుత్వ రంగం (నేషనల్ గ్రీన్ హైడ్రో మిషన్)లో ఇది మొట్టమొదటి హరిత ఇంధన ప్రాజెక్టు. మొత్తం 1,600 ఎకరాల్లో రూ.1.85 లక్షల కోట్లతో రెండు దశల్లో నిర్మిస్తారు. రోజుకు 1,500 టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌తో పాటు 7,500 టన్నుల గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ యూరియా, గ్రీన్ మెథనాల్, సస్టెయినబుల్ ఏవియేషన్ ఇంధనం ఉత్పత్తి అవుతాయి. పలు దేశాలకు ఇక్కడి నుంచి హైడ్రోజన్‌ను ఎగుమతి చేస్తారు. గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణం పూర్తయితే (2032 నాటికి) ప్రత్యక్షంగా, పరోక్షంగా 57 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

బల్క్ డ్రగ్ పార్క్

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్క్ (బీడీపీ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా ఏపీఐఐసీ గతంలో సేకరించిన సుమారు రెండు వేల ఎకరాల్లో ఏర్పాటయ్యే బల్క్ డ్రగ్ పార్క్‌లో 'ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్' రూ.1,876 కోట్లతో మౌలిక వసతులను కల్పిస్తుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేస్తారు. దేశ, విదేశాలకు చెందిన ఫార్మా కంపెనీలు ఇక్కడ దాదాపు రూ.14 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. సుమారు 30 వేల మందికి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



కర్నూలుకు కానుక

» కల్వకుర్తి-నంద్యాల రహదారి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జాతీయ రహదారులు, రైల్వే డబ్లింగ్, విద్యుదీకరణ పనులకు మోక్షం లభించింది. భారతమాల ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానం చేసేలా ఆత్మకూరు మీదుగా కల్వకుర్తి-నంద్యాల వరకు 170 కిలో మీటర్ల జాతీయ రహదారి-167కే నిర్మించనున్నారు. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా సంగమేశ్వరం-నల్లకాల్వ, ఆత్మకూరు, వెలుగోడు-నంద్యాల వరకు 62 కిలోమీటర్లు రెండు వరుసల జాతీయ రహదారిని రూ.607 కోట్లతో నిర్మించనున్నారు. ఈ పనులకు ప్రధాని వర్చువల్‌గా భూమి పూజ చేశారు. సంగమేశ్వరం దగ్గర కృష్ణా నదిపై పర్యాటకులను ఆకట్టుకునేలా 900 మీటర్ల పొడవు ఐకానిక్ తీగల వంతెన నిర్మించాల్సి ఉంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే నంద్యాల, కడప జిల్లాల ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లేందుకు దాదాపు 70 కిలోమీటర్ల వరకు దూరం తగ్గనుంది.

ఆదోని బైపాస్ రోడ్డు

కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా హగరి నుంచి తెలంగాణలోని జడ్చర్ల వరకు ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, రాయచూరు మీదుగా జాతీయ రహదారి-167ను 2012-13లో నిర్మించారు. బైపాస్ రోడ్డు నిర్మించకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో ఆదోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా రూ.241.99 కోట్ల వ్యయంతో 12 మీటర్ల వెడల్పుతో రెండు లైన్ల బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

కాచిగూడ-డోన్ లైన్ డబ్లింగ్

కాచిగూడ (హైదరాబాద్)-డోన్ ప్రధాన రైల్వే మార్గం డబ్లింగ్, విద్యుదీకరణ చేపట్టాలనేది దశాబ్దాల కల. తెలంగాణలో మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. అక్కడి నుంచి నంద్యాల జిల్లా డోన్ వరకు గద్వాల, కర్నూలు మీదుగా 197 కిలోమీటర్లు చేయాల్సి ఉంది. తాజాగా రూ.2,208 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. కర్నూలు నుంచి బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేందుకు రైల్వే రవాణా మరింత వేగం పుంజుకుంటుంది.

విశాఖ రైల్వే జోన్

విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ. దీని కోసం దశాబ్దాలుగా పోరాటం చేస్తే 2019 ఎన్నికల ముందు ప్రధాని హోదాలోనే మోదీ హామీ ఇచ్చారు. 2020-21 కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. అయితే విశాఖలో రైల్వేకు ఇవ్వాల్సిన 52 ఎకరాల ప్రత్యామ్నాయ భూముల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తాత్సారం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పని పూర్తిచేయడంతో ఇప్పుడు శంకుస్థాపన చేశారు. విశాఖలో జోనల్ కార్యాలయం వల్ల కొత్త రైల్వే లైన్లు, కొత్త రైళ్లు, ప్రాజెక్టులు వస్తాయి. జోనల్ స్థాయి ఆస్పత్రి ఏర్పాటవుతుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా దూరప్రాంతాలకు విశాఖ నుంచి కొత్త రైళ్లు ప్రారంభమవుతాయి.

ఉమ్మడి విశాఖలో రైల్వే లైన్లు

విశాఖ రైల్వే స్టేషన్‌పై ఎక్కువ ఒత్తిడి పడుతున్నందున శివార్లలోని దువ్వాడ, సింహాచలం, గోపాలపట్నం రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం విశాఖ నుంచి ఆయా స్టేషన్లకు ఉన్న రైల్వే లైన్లను పెంచుతున్నారు. అందులో భాగంగా దువ్వాడ-సింహాచలం మధ్య రూ.302 కోట్లతో అదనంగా 3, 4 ట్రాకుల నిర్మాణం చేపడతారు. అలాగే విశాఖపట్నం-గోపాలపట్నం మధ్య రూ.159 కోట్లతో 3, 4 ట్రాకుల నిర్మాణం చేస్తారు. గంగవరం పోర్టు నుంచి స్టీల్‌ప్లాంటుకు ముడిసరుకు రవాణా కోసం ప్రస్తుతం ఉన్న లైన్లకు అదనంగా మరో రెండు 3, 4 ట్రాకులను రూ.154 కోట్లతో నిర్మించనున్నారు. పొరుగు జిల్లా విజయనగరంలో బొడార జంక్షన్ నుంచి విజయనగరం వరకు రూ.159 కోట్లతో రహదారి విస్తరణ చేస్తారు.

గుంటూరు-బీబీనగర్ రైల్వే డబ్లింగ్

గుంటూరు-బీబీనగర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. దశాబ్దాల తరబడి ఈ ప్రాజెక్టు కోసం 2 రాష్ట్రాల్లోని గుంటూరు, పల్నాడు, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం సింగిల్ లేన్‌గా ఉన్న గుంటూరు-బీబీనగర్ రైలు మార్గం డబ్లింగ్ చేస్తే సెక్షన్‌లో రైళ్ల నిర్వహణ సామర్థ్యం పెరుగుతుంది. తెలుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ వృద్ధి చెందుతుంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఈ మార్గం విజయవాడ-కాజీపేట-సికింద్రాబాద్‌కు ప్రత్యామ్నాయంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు రూ.2,853.23 కోట్లు అవసరమని అంచనా. ఈ ప్రాజెక్టుతో వేల మందికి ఉపాధి లభిస్తుంది.

రోడ్డు ప్రమాదాల కట్టడికి సహకరించండి

» కేంద్రమంత్రి గడ్కరీకి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వినతి

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఏపీలో రోడ్డు ప్రమాదాల కట్టడికి రోడ్లు బాగు చేసి సహకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర రవాణా మంత్రి రాంప్రసాద్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. అధికారుల బృందంతో ఢిల్లీ వెళ్లిన ఆయన.. రాజంపేట-రాయచోటి-కదిరి రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి తక్షణమే స్పందించి రోడ్డు బాగుచేసేందుకు హామీ ఇచ్చారు. రవాణా శాఖ పరిధిలో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)ల ఏర్పాటులో కేంద్ర సహకారం కావాలని రాంప్రసాద్ రెడ్డి కోరారు.

హంద్రీ-నీవా, గాలేరు-నగరి అనుసంధానం!

» కార్యాచరణపై అధ్యయనం చేయండి.. మంత్రి నిమ్మల ఆదేశం

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో కీలక ప్రాజెక్టులైన హంద్రీ-నీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రవంతి అనుసంధానంపై దృష్టిసారించాలని జల వనరుల శాఖ ఉన్నతాధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. బుధవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావుతోపాటు రాయలసీమ ప్రాంతానికి చెందిన చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా మంత్రి సమీక్ష జరిపారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు లేదా గండికోట రిజర్వాయరు నుంచి హంద్రీ-నీవాను అనుసంధానించే క్రమంలో ఆర్థికంగానూ, రైతులకు ప్రయోజనం చేకూర్చే కార్యాచరణపైనా అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. గాలేరు-నగరి నుంచి హంద్రీ-నీవాను కలిపే లింకు పనులకు సంబంధించిన పూర్తి సమాచారంతో త్వరలోనే సీఎంతో చర్చిద్దామన్నారు.

ఇంధన చార్జీలను ప్రభుత్వమే భరించాలి

విజయవాడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల్లో ప్రతి నెలా విధిస్తున్న ఇంధన చార్జీలను ప్రభుత్వమే భరించాలని విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక కన్వీనర్ ఎంవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. విజయవాడలో ఏపీఈఆర్సీ నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన బుధవారం మాట్లాడారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు వినియోగదారులు చెల్లింపులు చేయాల్సి రావడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందన్నారు. తిరుపతి నుంచి గురుస్వామి నాయుడు మాట్లాడుతూ కనీసం 100 యూనిట్ల వరకు ఒక స్లాబ్ ఉండేలా మార్పు చేయాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి పీవీఎస్ గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ సబ్సిడీని అన్ని చేపల చెరువులకు అమలు చేయాలని కోరారు. అలాగే, వినియోగదారుల సేవల కోసం ఏర్పడ్డ ఏపీఈఆర్సీ తమ పక్షాన నిర్ణయాలు తీసుకుంటోందన్న విశ్వాసం ప్రజల్లో లేదని, తక్షణమే సెకీ పీపీఏలను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. వినియోగదారులందరిపైనా భారం పడేలా స్మార్ట్‌మీటర్లను బిగించడం సరికాదన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న ఇంధన సర్దుబాటు భారాన్ని [illegible]

చంద్రబాబు చూపు మోదీపై: షర్మిల

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని రాష్ట్రం మొత్తం సీఎం చంద్రబాబు వైపు చూస్తుంటే.. ఆయన మాత్రం కేంద్ర నిధుల కోసం ప్రధాని మోదీ వైపు చూస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి బుధవారం ఎక్స్‌లో విమర్శించారు.

అందరికీ డబ్బులిచ్చేస్తాం: నవీన్‌బాబు

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవ కోసం థర్డ్ పార్టీ ఫండ్ (టీపీఎఫ్) సంస్థ పేరుతో రూ.కోట్లు వసూలు చేసిన వ్యవహారం కలకలం రేపుతోంది. దీనిపై టీపీఎఫ్‌లో ఉద్యోగులుగా చెప్పుకుంటున్న ప్రతినిధులు బుధవారం గుంటూరులో మీడియా ముందుకు వచ్చారు. వారిలో టీపీఎఫ్‌కు సౌత్ ఇండియా హెడ్‌గా చెప్పుకుంటున్న కొలగాని నవీన్‌బాబు వీడియో కాల్ ద్వారా వివరణ ఇచ్చారు. కంపెనీ నుంచి తమకు రూ.20 కోట్ల వరకు రావాల్సి ఉందని, ఆ మొత్తం కోసమే తాను కాంబోడియా వచ్చానని వివరణ ఇచ్చారు. ఆ డబ్బులు కంపెనీ నుంచి రాకపోతే తన ఆస్తులు అమ్మి అయినా అందరికీ డబ్బు చెల్లిస్తానని తెలిపారు.

భాష పోతే శ్వాస పోయినట్టే!

» పాలనంతా తెలుగులోనే జరపాలి

» వెంకయ్యనాయుడు పిలుపు

» జీజీయూలో ప్రపంచ తెలుగు మహాసభలు

రాజమహేంద్రవరం/రాజానగరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలన అంతా తెలుగులోనే సాగాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. పాలనా వ్యవహారాలు, ఉత్తర్వులు, ఆదేశాలు తెలుగులోనే ఉండాలని సూచించారు. రాజమహేంద్రవరం సమీపంలోని రాజానగరంలో ఉన్న గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీజీయూ)లో చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన రెండో ప్రపంచ తెలుగు మహాసభలను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, ప్రసంగించారు. 'రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఓట్లకే ప్రాధాన్యం ఇస్తున్నాయి. కానీ భాషకు విలువ ఇవ్వట్లేదు. భాష పోతే శ్వాస పోయినట్టే. తెలుగు భాష రానివాడు తెలుగోడే కాడు. తెలుగు మాట్లాడే వాడికే ఓటేయాలి. తెలుగు రానివాళ్లను ఇంటికి సాగనంపాలి. తెలుగు రాష్ట్రంలో పుట్టి ఇంగ్లిష్ మాట్లాడటం అంటు వ్యాధిలా మారింది.. ఆంగ్లంపై వ్యామోహం తగ్గించుకుని అమ్మభాషను కాపాడుకోవాలి.తెలుగు భాషలో అక్షరాన్ని మార్చకుండానే పదవిన్యాసం చేయవచ్చు. మీసంగతేంటో.. అనే వాక్యాన్ని మీ సంగతేంటో.. అని కూడా మలచవచ్చు. మాటమాటా పెరిగింది అనే వాక్యాన్ని మా టమాటా పెరిగిందనీ రాయవచ్చు. ఇంటి పేర్లు కూడా పూర్తిగా రాయకుండా ఇంగ్లీషు అక్షరాలు పెడుతున్నారు. ఎన్టీఆర్ తెలుగు భాషకు జీవం పోశారు. ఆయన తెలుగులోనే మాట్లాడేవారు. సినీ రచయితలు సంభాషణలు, పాటలు తెలుగులోనే రాయాలి' అని కోరారు.


ప్రపంచ తెలుగు మహాసభల్లో ముఖ్య ప్రసంగం చేస్తున్న వెంకయ్యనాయుడు, వేదికపై మాజీ ఎంపీ యార్లగడ్డ, గరికపాటి నరసింహారావు, ప్రొఫెసర్ చామర్తి రాజు తదితరులు

తెలుగు మాధ్యమం ప్రవేశపెడితేనే..

'తెలుగు అధికార భాషా సంఘం చైర్మన్ పదవి స్వీకరించమని సీఎం చంద్రబాబు స్వయంగా ఫోన్ చేసి అడిగారు. రెండు షరతులు పెట్టాను. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకూ తెలుగు మాధ్యమమే ఉండాలని, ఎల్‌కేజీలు, యుకేజీలు పీకేయాలని ఒక షరతు... డిగ్రీ వరకూ తెలుగును ప్రథమ భాషగా చేయాలనేది రెండోది. ఈ సంభాషణ జరిగి 2నెలలయింది. భాషకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఎవరు అధికార భాషా సంఘం చైర్మన్ అయినా ఫలితం ఉండదు. ఇటీవల వారం వారం తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. వాటిల్లో తప్ప ప్రజల్లో తెలుగు కనిపించడం లేదు. ఓట్లు కావాలంటే తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలని అమ్మలు, మహిళలంతా డిమాండ్ చేయాలి' అని ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు తన ప్రసంగంలో సూచించారు.

బుద్ధి, జ్ఞానం ఉన్నవాడెవడూ తీసుకోడు

'ఒకటి నుంచి 5వ తరగతి వరకూ తెలుగు మాధ్యమం అమలు చేస్తేనే పదవి చేపడతానని గరికపాటి స్పష్టం చేసిన తర్వాత అవి అమలు కాకుండా బుద్ధి, జ్ఞానం ఉన్నవాడెవడూ ఆ పదవి చేపట్టలేరు. అధికారంలో ఉన్న పార్టీ ప్రతిపక్షాన్ని అణచివేసినప్పుడు కవులు, రచయితలు ముందుకు రావాలని ప్రతిపక్షం పిలుపునిస్తుంది. అధికారంలోకి వచ్చాక ఇదీ ఆ పనే చేస్తుంది' అని సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ఈ సందర్భంగా ఆక్షేపించారు. తెలుగు మాట్లాడేవాడే వేదపండితుడన్నారు.

ఇవేం హాస్టళ్లు?

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమ హాస్టళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహించింది. ఆ ఐదేళ్లలో రూ.20కోట్లు కూడా ఖర్చు చేయలేదని ఆక్షేపించింది. ఫలితంగా హాస్టళ్ల దుస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని ఆవేదన వ్యక్తం చేసింది. 2024-25 బడ్జెట్ కేటాయింపులను రూ.143కోట్లకు పెంచినప్పటికీ అవి సరిపోవని తెలిపింది. విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు, బెడ్లు, బెడ్ షీట్లు, పౌష్టికాహారం అందించాల్సిందేనని తేల్చిచెప్పింది. మొదటి దశలో విద్యార్థులకు తాగునీరు, దుస్తులు, బెడ్ వంటి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక, గురుకుల హాస్టళ్లలో కల్పించిన మౌలిక సదుపాయాలు, వాటి నిర్వహణతో పాటు ఒక్కో హాస్టల్‌లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు? జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు కల్పించాల్సిన మౌలికవసతులు ఏమిటి? ప్రస్తుతం అక్కడ ఎలాంటి వసతులు ఉన్నాయి? ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? బాలల హక్కుల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు మౌలిక వసతుల కల్పనకు ఎంత సొమ్ము అవసరం? తదితర వివరాలతో సవివర నివేదిక సమర్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణకు ఆన్‌లైన్‌లో హాజరుకావాలని ఆ శాఖ కమిషనర్‌కు స్పష్టం చేసింది. జిల్లాల్లోని సంక్షేమ హాస్టళ్లను సందర్శించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థలను ఆదేశించింది. ప్రతి జిల్లాలో కనీసం 5 సంక్షేమ హాస్టళ్లను పరిశీలించి, అక్కడ ఉన్న స్థితిగతులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు ఏమిటి? ఎలాంటి సౌకర్యాలు అవసరం అనే విషయం పై నివేదిక సమర్పించాలని సూచించింది. విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

హాస్టళ్ల పరిస్థితి దారుణం : పిటిషనర్

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కొరవడటాన్ని సవాల్ చేస్తూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ 2023లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలుచేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున న్యాయవాది జీ అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు గురుకుల హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు కూడా లేవన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచిందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.143 కోట్లు కేటాయించిందన్నారు. ఈ సందర్భంగా 2019-20 నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరకు హాస్టళ్లకు చేసిన కేటాయింపుల జాబితాను కోర్టుకు సమర్పించారు. అందులో.. వైసీపీ హయాంలో 2020-21లో కేవలం రూ. 24.60 లక్షలు మాత్రమే హాస్టళ్లకు కేటాయించిన విషయం ధర్మాసనం గమనించింది. దీనిపై తీవ్రంగా స్పందిస్తూ.. పలు వ్యాఖ్యలు చేసింది. అనంతరం ఎస్.ప్రణతి వాదనలను కొనసాగిస్తూ.. ప్రతి ఏడుగురు పిల్లలకు ఒక మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... కోర్టుకు సమర్పించిన వివరాల్లో సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పిల్లల కులాల గురించి అధికారులు ప్రస్తావించడాన్ని ఆక్షేపించింది.

నిస్సిగ్గుగా.. నిర్భీతితో అబద్ధాలు

» జగన్‌పై ఆరోగ్య మంత్రి సత్యకుమార్ ఫైర్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ప్రజారోగ్యం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై మీరు చేసిన వ్యాఖ్యలు మీ రాజకీయ దిగజారుడుతనానికి, అబద్ధాలే ప్రధానంగా కొనసాగే మీ రాజకీయాలకు అద్దం పడుతున్నాయి. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును మీరు అర్థం చేసుకున్నట్లుగా కనిపించడం లేదు. ఇప్పటికీ నిస్సిగ్గుగా, నిర్భీతితో, భారీస్థాయిలో అబద్ధాలు చెబుతున్నారు' అని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ వైసీపీ అధినేత జగన్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. 'జగన్ హయాంలో సగటున ఏడాదికి రూ.1807.64 కోట్లు మాత్రమే ఆరోగ్యశ్రీ చెల్లింపులు జరిగితే, కూటమి ప్రభుత్వం మొదటి ఆరు నెలల్లోనే ఎన్టీఆర్ వైద్య సేవలకు రూ.1850 కోట్లు చెల్లించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం రూ.4 వేల కోట్లు కేటాయించింది. ఈ వాస్తవాన్ని విస్మరించి నగదు రహిత సేవల్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని జగన్ అసత్య ప్రచారానికి దిగజారారు. జగన్ ప్రభుత్వం రూ.2,221.60 కోట్ల బకాయిలు పెడితే, కూటమి ప్రభుత్వం రూ.3 వేల కోట్లు బకాయిలు పెట్టిందని ఆరోపించడం అవాస్తవం' అని పేర్కొన్నారు. వైద్య సేవల్ని కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోందంటూ జగన్ చేసిన ఆరోపణల్ని తిప్పికొట్టారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం బకాయిలపై ఆందోళన వ్యక్తం చేసిన వెంటనే ప్రభుత్వం చర్చలకు పిలిచి, రూ.500 కోట్ల విడుదలకు హామీ ఇచ్చిందన్నారు. అబద్ధాల పునాదులపై రాజకీయ సౌధాన్ని పునర్నిర్మించుకోవాలనే దురాలోచనలు మాని.. ఇప్పటికైనా విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సలహా ఇచ్చారు.

25 తర్వాత సేవలన్నీ నిలిపివేత: ఆశా

» బకాయిల్లో వెయ్యి కోట్లు విడుదల చేయాలని డిమాండ్

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు కనీసం రూ.1000 కోట్ల విడుదల చేయాలని ఆశా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్‌తో మంగళవారం సమావేశమైన తర్వాత ఏపీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ప్రతినిధులు.. బుధవారం జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల యజమానులు మాట్లాడుతూ రూ.500 కోట్లు విడుదల చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని, అది కూడా 15వ తేదీకి ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. రూ.1000 కోట్లు విడుదల చేస్తేనే ఆందోళన విరమించాలని నిర్ణయించారు. 6వ తేదీ నుంచి ఈహెచ్‌ఎస్, ఓపీ సేవలను నిలిపివేసిన ఆస్పత్రులు, 25వ తేదీ నుంచి పూర్తిగా వైద్య సేవలు నిలిపివేయాలన్న నిర్ణయానికి వచ్చారు.ఆరోగ్యశాఖ అధికారులు ఒకవైపు యాజమాన్యాలతో చర్చలు జరుపుతూనే, మరోవైపు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. బుధవారం ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెందిన 11 బృందాలు 10 ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు చేశాయి. దీనిపై ఆశా ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

'రూ.80 కోట్ల ఆస్తిపై' కదిలిన యంత్రాంగం

» 'ఆంధ్రజ్యోతి' కథనంతో కందుకూరులో కలకలం

» సమగ్ర నివేదికకు సబ్ కలెక్టరు ఆదేశం

కందుకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ నడిబొడ్డున ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న రూ.కోట్ల విలువైన స్థలాన్ని కాజేసేందుకు కొందరు చేస్తున్న యత్నాలపై 'రూ.80 కోట్ల ఆస్తిపై గద్దలకన్ను' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. అధికార యంత్రాంగం తక్షణ నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. పట్టణంలోని ఫాదర్ బంగ్లా స్థలం వ్యవహారంపై కోర్టు ఉత్తర్వులు, 2012లో ఆ ఆస్తిని స్వాధీనం చేసుకుని అందులోని భవనాలను సీజ్‌చేస్తూ అప్పటి జిల్లా కలెక్టరు ఇచ్చిన ఆదేశాలు, ఇతర వివరాలతో తక్షణం సమగ్ర నివేదిక అందజేయాలని కందుకూరు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ కందుకూరు తహసీల్దార్‌ను, సబ్ కలెక్టరు కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న ఆస్తి 22ఏ నిషేధిత జాబితాలో లేకుండా ఎలా పోయిందని ఆమె విస్మయం వ్యక్తం చేశారు. బుధవారం ఈ వ్యవహారంపై ఆమె మాట్లాడుతూ.. రికార్డుల సమగ్ర పరిశీలన అనంతరం కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులకు నివేదించి తక్షణం సర్వే నంబరు 232-2లో ఉన్న 8.70 ఎకరాల ప్రభుత్వ భూమిని 22ఏ నిషేధిత జాబితాలో చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రికార్డులు చూశాక ఫాదర్ బంగ్లాను సందర్శించి చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.



బుధవారం ఆంధ్ర వర్సిటీలో జరిగిన ప్రధాని మోదీ సభకు హాజరైన జనం

ఆంధ్రాకు అండ

(మొదటి పేజీ తరువాయి)

మైదానంలో ఏర్పాటు చేసిన సభలో మోదీ ప్రసంగించారు. 'ఆంధ్ర ప్రజల ప్రేమ, అభిమానానికి నా కృతజ్ఞతలు. మీపట్ల నాకున్న అభిమానం చూపించే అవకాశం ఇప్పుడు లభించింది. ముందుగా సింహాచలం వరాహ లక్ష్మీ నరసింహస్వామికి నమస్కారం' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత హిందీలో మాట్లాడారు. "60ఏళ్ల తర్వాత కేంద్రంలో మూడోసారి వరుసగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజల ఆశీర్వాదంతోనే ఇది సాధ్యమైంది. రాష్ట్రంలో ఎన్డీయేకు భారీ విజయాన్ని కట్టబెట్టారు. విశాఖపట్నంలో అద్భుత స్వాగతం, రోడ్డు పొడవునా ఆశీర్వాదం ఇవ్వడం సంతోషంగా ఉంది" అని మోదీ హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు మాట్లాడిన చంద్రబాబు తన ప్రసంగంలో సిక్సలు కొట్టారని, ఆయన ఒక్కో మాటలో అంశాన్ని గుర్తుంచుకుంటానని తెలిపారు. ఆంధ్రుల ఆకాంక్షలను చంద్రబాబుతో కలిసి నెరవేరుస్తానని మోదీ మాటిచ్చారు. రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో ప్రయాణిస్తాయన్నారు. 'ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మా విజన్. ఆంధ్రుల సేవ మా సంకల్పం. 2047నాటికి రాష్ట్రం 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలన్న విజన్‌తో చంద్రబాబు శ్రమిస్తున్నారు. ఈ ప్రయాణంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి భుజం కలిపి తోడుగా నిలుస్తుంది" అని మోదీ ప్రకటించారు.

కొత్త శిఖరాలకు...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ రాష్ట్రంలో పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రధాని తెలిపారు. "విశాఖపట్నంలో ఈ రోజు 2లక్షల కోట్లకు పైగా నిధులతో ప్రాజెక్టులు ప్రారంభించాం. దీంతో రాష్ట్రాభివృద్ధి కొత్త శిఖరాలకు చేరుతుంది. ఇక్కడి ప్రజల సృజనాత్మకత వల్ల రాష్ట్రం ప్రగతిశీలకంగా మారింది. ఐటీ, టెక్నాలజీకి ఆంధ్రప్రదేశ్ సరికొత్త కేంద్రంగా మారుతుంది" అని ప్రధాన మంత్రి అన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే గ్రీన్ హైడ్రోజన్ వైపు అడుగులు వేస్తున్నామన్నారు. 2023లో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ప్రారంభించామని.. రెండు కేంద్రాల్లో ఒకటి విశాఖకు కేటాయించామని చెప్పారు. భవిష్యత్తులో హైడ్రోజన్ ఉత్పత్తిలో విశాఖపట్నం ప్రపంచంతో పోటీ పడుతుందని, గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటుతో ఉద్యోగ అవకాశాలు అపారంగా ఉంటాయని ప్రధాని తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హబ్ ఏర్పాటు చేసే అవకాశం లభించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. పెట్టుబడులకు అనుకూలమైన మూడు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని తెలిపారు. "రాష్ట్రం పెట్టుబడిదారులకు అనుకూలం. ఫార్మా రంగానికి ఉపయోగం. ఎన్డీయే ప్రభుత్వం పట్టణీకరణ, పారిశ్రామికీకరణకు ప్రాధాన్యం ఇస్తుంది. అందులో భాగంగా క్రిస్‌సిటీ ఏర్పాటు చేస్తున్నాం. చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగమైన ఇందులో భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇది వేల కోట్ల పెట్టుబడులకు కేంద్రం కాబోతోంది" అని ప్రధాన మంత్రి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ ఇప్పటికే తయారీ రంగం దూసుకుపోతోందని, ఉత్పత్తి రంగంలో దేశంలో అగ్రస్థానంలో నిలబడేలా రాష్ట్రానికి మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సెల్‌ఫోన్ల తయారీలో ప్రపంచంలోనే ఉన్నతమైన స్థానంలో భారత దేశం ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

రైల్వే జోన్‌తో...

విశాఖపట్నంలో సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు శంకుస్థాపన చేశామని... ప్రత్యేక జోన్ కావాలన్న ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతోందని ప్రధాని పేర్కొన్నారు. "ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రైల్వేజోన్ ఎంతో కీలకం. వ్యవసాయ, వ్యాపార, పర్యాటక రంగాల్లో కొత్త అవకాశాలు లభిస్తాయి. ఏపీలో వందశాతం రైల్వే లైన్ల విద్యుదీకరణ జరిగింది. వందే భారత్ రైళ్లతో పాటు అమృత్ భారత్ సర్వీసులు రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మౌలిక సదుపాయాల విప్లవంతోపాటు మెరుగైన కనెక్టివిటీతో ఏపీ ముఖచిత్రం మారబోతోంది. ఇప్పుడు ప్రారంభించిన పనులు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడతాయి" అని ప్రధాని పేర్కొన్నారు. 'బ్లూ ఎకానమీ'ని (సముద్ర వాణిజ్యం) మిషన్ మోడ్‌లో వినియోగించుకుంటామని ప్రధాని తెలిపారు. ఏపీలో మత్స్యకారుల ఆదాయం పెరిగేందుకు నిబద్ధతతో పని చేస్తున్నామని అన్నారు. మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, సముద్రంలో రక్షణ కోసం చర్యలు చేపట్టామన్నారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అభివృద్ధిలో అందరినీ కలుపుకొని వెళ్తామన్నారు. "అభివృద్ధి అన్ని రంగాల్లో జరగాలి. ఫలాలు అందరికీ అందాలి. నేడు ప్రారంభించిన ప్రాజెక్టులు ఏపీ ప్రజల భవిష్యత్తు, శ్రేయస్సుకు తోడ్పాడు అందించబోతున్నాయి' అంటూ ప్రసంగాన్ని ముగించారు.



అభివృద్ధి అంటేనే ఆంధ్రా..

- వైసీపీ చీకటిపాలన నుంచి వెలుగులోకి..
- విశాఖ సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



విశాఖపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల అరాచక, చీకటి పాలనను తొలగించుకుని, వెలుగు రేఖల వైపు ఇప్పుడిప్పుడే ఏపీ అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్ర వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. వైసీపీ హయాంలో అభివృద్ధికి ఏపీలో ఆస్కారం లేదనే వాతావరణం ఉండేదన్నారు. అలాంటిది అభివృద్ధి అంటేనే ఆంధ్రా అనేలా ఈనాడు ముందుకు వెళుతున్నామని పవన్ తెలిపారు. సీఎం సూచనలు, ఆయన మార్గదర్శకమే తోడ్పాటునందిస్తున్నాయన్నారు. "కూటమిపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగిస్తున్నాం. దీనిలో భాగంగానే రాష్ట్రానికి రూ.2.1 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా సుమారు ఏడున్నర లక్షల మందికి ఉపాధి అవకాశాలు దక్కుతాయి. అభివృద్ధి యజ్ఞం నిరంతరం కొనసాగాలి" అని ఆయన అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్రానికి ఇచ్చారని, జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ 24 గంటలూ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రధాని ఉన్నారన్నారు. పీఎం సడక్ యోజన పథకం కింద ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాలకు రోడ్డు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఏ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడకూడదనే ఉద్దేశంతో అన్నింటికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. సదుద్దేశం, సదాశయం లేకుండా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ నడిచినా అది నిరర్థకంగా చరిత్రలో మిగిలిపోయిందంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. అదే ఒక సదాశయం, సత్సంకల్పంతో ఇంకొకరు కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ ప్రజలతో మమేకమై ఏకతాటిపై నడిపిస్తే అది ఆత్మనిర్భర్ భారత్... స్వచ్ఛ భారత్ అయ్యాయన్నారు.

అన్నీ జయాలే

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన అనేక ప్రాజెక్టుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ మైదానంలో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. "రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలు రూపుమాపే దిశగా ఇది మొదటి అడుగు. మంచి అడుగు. ఇక అన్నీ జయాలే" అని చంద్రబాబు ఉద్ఘాటించారు. 'డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ డిజిట్ గ్రోత్' సాకారమవుతుందన్నారు. కష్టాలు, సమస్యలు అధిగమిస్తామని.. సుపరిపాలనతో అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు తీసుకెళతామని చంద్రబాబు ప్రకటించారు. 'సూపర్ సిక్స్' హామీలు కచ్చితంగా అమలు చేసే బాధ్యత ఎన్డీయే తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు ఊపందుకున్నాయని.. కేంద్రంతో సమన్వయంతో మన బ్రాండ్ పెంచుకుంటున్నామని చెప్పారు. దేశానికి ముంబైలాగా.. రాష్ట్రానికి విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా ఉంటుందని తెలిపారు.

చరిత్రలో నిలిచిపోయేలా...

ప్రధాని మోదీ మీద ప్రతిచోటా విశ్వాసం, నమ్మకం ఉన్నాయని.. విశాఖ రోడ్‌షో బ్రహ్మాండంగా జరగడం దీనికి నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. "ఇది రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే రోజు. రూ.2,08,548 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరిగాయి. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ విశాఖ రైల్వే జోన్ పనులు ప్రారంభమయ్యాయి. జోన్ కార్యాలయానికి స్థలం ఇవ్వాలని కేంద్రం అడిగినా ఐదేళ్ల ఇవ్వలేదు. మేం వచ్చాక 52 ఎకరాలు ఇచ్చాం. కూటమి సర్కారు ఏర్పడిన తర్వాత తొలిసారిగా మోదీ రాష్ట్రానికి వచ్చారు" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఈ కాంబినేషన్ కొనసాగుతుంది

బీజేపీ, టీడీపీ, జనసేన మైత్రి కొనసాగుతుందని చంద్రబాబు ఉద్ఘాటించారు. "గత ఎన్నికల్లో మోదీ, పవన్, నేనూ కలిశాం. నేను 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. ఎప్పుడూ లేనట్లుగా 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించాం. ఈ కాంబినేషన్ ఎప్పటికీ కొనసాగుతుంది. మోదీ దేశ ప్రధానిగా కొనసాగుతారు. ఏపీలో ఎన్నికల అనంతరం... హరియాణా, మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి విజయం సాధించింది. రేపు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డీయేనే విజయం వరిస్తుంది. దీనికి కారణం మోదీ కరిష్మాయే! సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలనతో దేశాన్ని ఆయన ముందుకు తీసుకెళుతున్నారు. ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ కొనసాగింపు, అందరికీ ఇళ్లు, సూర్యఘర్, కుసుమ్, ఫసల్ బీమా, పీఎం కిసాన్ నిధి పెంపు.. ఇలా 7 నెలల్లోనే అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన అభిమానం ఉత్తరాంధ్రకే పరిమితమని కొందరు అంటున్నారు. కానీ... దేశం, ప్రపంచం మెచ్చే నాయకుడు మోదీ" అని చంద్రబాబు పేర్కొన్నారు.

దేశ ప్రజల అదృష్టం...

ప్రధాని మోదీ విధానం.. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ అని చంద్రబాబు తెలిపారు. "2014లో 11వ ఆర్థిక వ్యవస్థలా ఉన్న భారత్ ఇప్పుడు 5వ స్థానానికి వచ్చింది. 2029కి 3వ స్థానానికి వస్తుంది. 2047 నాటికి మొదటి లేదా రెండో స్థానానికి చేరుకుంటుంది. ఇది మోదీ వల్లే సాధ్యమవుతుంది. ఆయన ప్రగతిశీల ప్రధాని. రేపు చేసే పని, నిన్నే చేసి ఉంటే బాగుంటుందని ఆలోచించే ప్రధానమంత్రి ఉండటం మనందరి అదృష్టం. ఆయన నాయకత్వంలో 'ఇండియా బ్రాండ్' బలోపేతమైంది. ఆయన ఇండియన్ లీడర్ కాదు... గ్లోబల్ లీడర్" అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో నవ్యాంధ్రకు న్యాయం జరగలేదని తొలిసారి గొంతెత్తిన వ్యక్తి మోదీ అని బాబు తెలిపారు.

మనది 'ఒకే స్కూల్'

"అభివృద్ధి ఆలోచనల విషయంలో మనిద్దరిదీ ఒకే స్కూల్" అని చంద్రబాబు మోదీతో అన్నారు. "మీరు నాకు స్ఫూర్తి. నిన్నటిదాకా అమరావతి అనిశ్చితిలో ఉంది. ఇప్పుడు పట్టాలు ఎక్కింది. మీరే అమరావతికి శంకుస్థాపన చేశారు.. మీ ఆశీర్వాదంతో అమరావతిని ప్రారంభిస్తాం. మీరే ప్రారంభించాలి. మీరు నదుల అనుసంధానం చేసి చూపించారు. మేమూ పోలవరం నిర్మించి నదుల అనుసంధానం సాధిస్తాం" అని చంద్రబాబు అన్నారు.

ఇదీ మోదీ పని తీరు...

మోదీ పని తీరు గురించి చెప్పేందుకు చంద్రబాబు రెండు వ్యక్తిగత అనుభవాలను వివరించారు. అవి...

1) ఆర్సెలార్ మిట్టల్ రాష్ట్రంలో ఉక్కు కర్మాగారం పెట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే... కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. నేను ప్రధానిని కలిశాను. ఇనుప ఖనిజాన్ని పైప్ లైన్ (స్లరీ) ద్వారా సరఫరా చేయాలని భావిస్తున్నారని, అందుకు సహకరించాలని కోరాను. ఆయన తక్షణం దీనికి అంగీకరించారు. ఇనుప ఖనిజాన్ని వాహనాల్లో సరఫరా చేయడం వల్ల ఖర్చు, కాలుష్యం అధికమవుతుందని... స్లరీతో ఈ సమస్య ఉండదని చెప్పారు. నా ప్రతిపాదనకు అప్పటికప్పుడు ఆమోదం తెలిపారు.
2) గూగుల్ సంస్థ విశాఖకు వస్తానని చెప్పింది. అయితే... ఇప్పుడున్న విధానాల మార్పి, పన్నులు పెంచితే తమకు కష్టమని వెల్లడించింది. అప్పుడు కూడా ప్రధానిని కలిశాను. పన్నులు పెంచబోమని ఆయన హామీ ఇచ్చారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి ఎన్డీయే కూటమి విధానమని చంద్రబాబు ప్రకటించారు. "కొప్పర్తి, ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్‌లో.. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ తీసుకొస్తున్నాం. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత మాది. వికసిత్ భారత్... మోదీ కల. స్వర్ణాంధ్ర ప్రదేశ్ నా ఆలోచన. 'స్వర్ణాంధ్ర-2047'పై నిరంతర ప్రచారం చేయాలని.. అన్ని యూనివర్సిటీల్లో అవగాహన కల్పించాలని ప్రధాని నాకు సూచించారు. అప్పుడే లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు" అని చంద్రబాబు వివరించారు.

అరకు కాఫీకి మోదీ ఫిదా...

ఐటీ, టూరిజంలాగే అరకు కాఫీని ప్రధాని మోదీ అనునిత్యం ప్రమోట్ చేస్తున్నారని చంద్రబాబు కొనియాడారు. మన అరకులో పండే కాఫీ ప్రపంచంలో ప్రసిద్ధి చెందిందంటే.. దానికి మోదీ చొరవే కారణమని అన్నారు.



రోడ్ షోలో తమపై పూల జల్లు కురిపిస్తున్న జనానికి మోదీ, చంద్రబాబు, పవన్‌ల అభివాదం

థ్యాంక్స్ నాయుడూ...

- తన ప్రసంగాన్ని అనువదించినందుకు...

రామ్మోహన్‌నాయుడికి మోదీ అభినందన

శ్రీకాకుళం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'థ్యాంక్స్ నాయుడూ' అంటూ కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడిని ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధాని.. బుధవారం సాయంత్రం వేదికపై మాట్లాడుతుండగా.. ఆ ప్రసంగాన్ని తెలుగులోకి రామ్మోహన్‌నాయుడు అనువదించారు. దీనిపై ప్రజలనుంచి అద్భుత స్పందన లభించింది. ఈనేపథ్యంలో ప్రధాని సభ ముగించుకుని తిరుగు పయనమవుతూ.. రామ్మోహన్‌నాయుడి భుజంపై చేయివేసి ప్రత్యేకంగా అభినందించారు.



వేదికపై ప్రధాని మోదీతో, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, అనిత మాటామంతి

లోకేశ్.. నీమీదొక ఫిర్యాదు!

- ఢిల్లీ వచ్చి నన్నెందుకు కలవలేదు?
- ప్రధాని మోదీ సరదా వ్యాఖ్యలు
- కుటుంబంతో రావాలని ఆహ్వానం

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): "లోకేశ్! నీ మీదొక ఫిర్యాదు ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఆర్నెల్లయింది. ఢిల్లీ వచ్చి నన్ను ఎందుకు కలవలేదు" అంటూ ప్రధాని మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. విశాఖ సభలో ఈ ఆసక్తికర ఘటన జరిగింది. వేదిక వద్ద గ్రీన్‌రూంలో ప్రధానిని ఆహ్వానించడానికి లోకేశ్ సహా పలువురు మంత్రులు ఎదురుచూస్తున్నారు. ప్రధాని మోదీ అక్కడకు రాగానే మంత్రి లోకేశ్ వద్ద కాసేపు ఆగారు. ప్రధానికి లోకేశ్ నమస్కరించారు. ఈ సమయంలో ప్రధాని పైవిధంగా చమత్కరించారు. కుటుంబంతో ఢిల్లీకి వచ్చి తనను కలవాలంటూ ఆహ్వానించారు. త్వరలోనే వచ్చి కలుస్తానని లోకేశ్ సమాధానమిచ్చారు. లోకేశ్ భుజం తట్టి అక్కడి నుంచి మోదీ కదిలారు.

ప్రధాని సభ సక్సెస్

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఉత్తరాంధ్ర ప్రజలు నీరాజనం పలికారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణంలో గ్యాలరీలు నిండిపోయాయి. ఎదురుగా ఉన్న మరో మైదానం కూడా కిక్కిరిసింది. అయినా.. స్థలం చాలక జనాలు ప్రాంగణం బయట ఉండిపోయారు. సభ సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. అంతకు ముందు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఓపెన్‌టాప్ వాహనంపై నగరంలో రోడ్‌షో నిర్వహించారు. అదే వాహనంపై సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో నేతలపై సభికులు పూలవర్షం కురిపించారు. ప్రధాని ఉత్సాహంగా ఇరువైపులా ఉన్న జనాలకు చేతులు ఊపుతూ సభా వేదిక వెనుక ఉన్న గ్రీన్‌రూమ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రాంగణమంతా మోదీ నామస్మరణతో మార్మోగిపోయింది. సభలో ప్రధాని 12 నిమిషాలే ప్రసంగించారు. ఆయన ప్రసంగాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అనువదించారు. ప్రసంగం ప్రారంభంలో మోదీ తెలుగులో మాట్లాడారు. ఎక్కడా రాజకీయాల ప్రస్తావన లేకుండా కేవలం అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలు, టెక్నాలజీలో ఏపీ గొప్పతనం గురించి మాత్రమే ప్రధాని మాట్లాడారు. రూ. 2 లక్షల కోట్లు విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ప్రసంగ ప్రారంభంలోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను పొగిడిన మోదీ...ఏపీని అన్ని విధాలా ఆదుకుంటామని, అండగా ఉంటామని చెప్పడంతో సభ చప్పట్లతో మార్మోగింది. ప్రధానికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి శ్రీమహా విష్ణువు చిత్రపటం, అరకు కాఫీని బహూకరించారు.

రోడ్‌షో అదుర్స్

పూలవానతో ప్రధానికి జనం జేజేలు

విశాఖపట్నం/గోపాలపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం సాయంత్రం విశాఖలో నిర్వహించిన రోడ్‌షోకు అపూర్వ స్పందన లభించింది. ప్రధాని విమానాశ్రయం నుంచి రోడ్డుమార్గంలో సాయంత్రం 4.50 గంటలకు సిరిపురం కూడలిలోని దత్ ఐలాండ్ వద్దకు చేరుకున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలిసి ఓపెన్‌టాప్ జీపు ఎక్కారు. అక్కడి నుంచి ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా వేదిక వరకూ రోడ్‌షో నిర్వహించారు. పెద్దఎత్తున జనాలు తరలిరావడంతో రహదారి మొత్తం కిక్కిరిసింది. ప్రధాని వాహనం రోడ్‌షో ప్రారంభ పాయింట్ వద్దకు చేరుకోగానే.. మోదీ మాస్కులు ధరించిన జనం.. 'మోదీ...మోదీ...' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. తరలివచ్చిన భారీ జనసందోహాన్ని చూసి మోదీ పులకించిపోయారు. బాబు, పవన్‌తో కలిసి వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మార్గమధ్యంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన వేదికలపై చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, తప్పెట గుళ్లు, కోలాటం వంటి ప్రదర్శనలను తిలకించారు. పావుగంట కొనసాగిన రోడ్‌షో.. ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సభాస్థలి వద్ద ముగిసింది.

ప్రధానికి బాబు, పవన్ ఘన స్వాగతం

అంతకుముందు విశాఖ పర్యటనకు విచ్చేసిన ప్రధాని మోదీకి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ప్రత్యేక విమానంలో చేరుకున్న ఆయనకు ఐఎన్ఎస్ డేగాలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, తూర్పు నౌకాదళాధికారి వైస్ అడ్మిరల్ పెంధార్కర్, శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఘనంగా స్వాగతం పలికారు.



రోడ్ షోలో మోదీ, చంద్రబాబు, పవన్‌ల అభివాదం

ఏపీకి ఊపిరి అందించారు

- అవసరమైన నిధులిచ్చి ప్రధాని ఆదుకుంటున్నారు
- భారత్ వైపు ప్రపంచం చూసేలా చేసిన ఘనత మోదీదే: మంత్రి నారా లోకేశ్



విశాఖపట్నం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం వెంటిలేటర్‌పైకి వెళ్లిపోయిందని, అటువంటి రాష్ట్రానికి ప్రధాని మోదీ ఆక్సిజన్ అందించి మళ్లీ కోలుకునేలా చేశారని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. బుధవారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. "వైసీపీ అధ్వానపాలన వల్ల ప్రతి నెలా రాష్ట్రం రూ.4 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో నడుస్తోంది. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి అవసరమైన నిధులను ప్రధాని అందించి ఆదుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు వేగంగా సాగుతున్నాయి. ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. త్వరలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేస్తాం. రాష్ట్రం దశ, దిశ మార్చే ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్న ఈరోజు చరిత్రలో నిలిచిపోతుంది. రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రజల తరఫున నమో (నరేంద్ర మోదీ)కు కృతజ్ఞతలు. మోదీ మూడోసారి ప్రధాని అవ్వడంతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. దేశాభివృద్ధిలో ఏపీ కీలకంగా మారుతోంది' అన్నారు.

ప్రజా నాయకుడిగా నమో

గతంలో ప్రధానులంతా కేవలం ప్రధానులుగా ఉన్నారు. నమో మాత్రమే ప్రజా నాయకుడిగా ఎదిగారు. నమో విజన్ గ్లోబల్ అయితే, ఆయన గుండె (హార్ట్) మాత్రం భారత్‌లోనే ఉంటుంది. వికసిత్ భారత్-2047 పేరుతో ప్రధాని విజన్ డాక్యుమెంట్ విడుదల చేశారు. అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్ విడుదల చేశారు. వ్యవసాయం, పరిశ్రమలు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు ఇలా అన్ని రంగాల్లో లక్ష్యాలను పెట్టుకుని పనిచేయడమే విజన్-2047 ఉద్దేశమని లోకేశ్ అన్నారు.






ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు



తిరుపతిలోని బైరాగిపట్టెడ టోకెన్ల జారీ కేంద్రం వద్ద గేటులో నుంచి తోసుకువస్తున్న భక్తులను అదుపుచేస్తున్న పోలీసులు



పెను విషాదం!

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల చరిత్రలోనే కనీవినీ ఎరుగని విషాదం చోటుచేసుకుంది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద తీవ్ర తొక్కిసలాట జరిగింది. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీనికోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ప్రత్యక్షసాక్షులు, ఇతర వర్గాల కథనం ప్రకారం...

బైరాగిపట్టెడలో మరణ మృదంగం

బైరాగిపట్టెడలోని రామానాయుడు మునిసిపల్ హైస్కూలు ఆవరణలో టోకెన్ల జారీకి పది కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడికి మధ్యాహ్నం నుంచేతిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాలు, తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకున్నారు. హైస్కూలు వెనుకవైపు మునిసిపల్ పార్కులో కూర్చుని... ఎదురు చూస్తున్నారు. రాత్రి 8.50 సమయంలో క్యూలైన్లలోకి అనుమతించడంతో అందరూ పరుగులు తీశారు. పార్కు నుంచి స్కూలులోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన గేటుపై జనం పడటంతో అది ఒక్కసారిగా తెరుచుకుంది. పెద్దసంఖ్యలో భక్తులు లోనికి వెళ్లేందుకు యత్నించడంతో తొక్కిసలాట జరిగింది. భక్తుల్లో మహిళలు, వృద్ధులు ఉండడంతో చాలామంది కిందపడిపోయారు. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పోలీసులు అదనపు బలగాలను రప్పించి అదుపు చేసేసరికే దారుణం జరిగిపోయింది. తొక్కిసలాటలో పలువురు అపస్మారక స్థితికి చేరుకున్నారు. పోలీసులు, స్థానికులు సీపీఆర్ వంటి చర్యలు చేపట్టారు. మరో కథనం ప్రకారం... బైరాగిపట్టెడ కేంద్రంలో ఓ మహిళ అస్వస్థతకు గురి కావడంతో ఆమెను బయటికి తీసుకొచ్చేందుకు పోలీసు అధికారి గేటు తెరిచారని, దీంతో భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడంతో తొక్కిసలాట జరిగింది. క్షతగాత్రులను రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు.

'కొండంత' జనం ఉన్నా అంతా ప్రశాంతమే!

» తిరుమలలో పక్కాగా క్రౌడ్ మేనేజ్‌మెంట్

లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చే గరుడ సేవ, వరుస సెలవుల్లో వచ్చే భారీ భక్తజనం, ఇంకా ఎలాంటి సందర్భమైనా సరే... తిరుమలలో భక్తుల ప్రాణాలు పోయేంత విషాదాలు జరిగిన దాఖలాలే లేవు! 'క్రౌడ్ మేనేజ్‌మెంట్'లో టీటీడీకి ఎంతో పేరు! కానీ... బుధవారం తిరుపతిలో పెను విషాదం చోటు చేసుకుంది. గతంలో రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఉండేది. అంతకు ఒకటి రెండు రోజుల ముందు నుంచే తిరుమల కొండ భక్తులతో కిక్కిరిసిపోయేది. దాదాపు 48 గంటల పాటు భక్తులు నాలుగైదు కిలోమీటర్లు వ్యాపించినప్పటికీ... చిన్నపాటి తోపులాటలు, తొక్కిసలాటలే తప్ప ఎప్పుడు ప్రాణనష్టం జరగలేదు. తిరుమలలో ఎప్పుడైనా, ఎక్కడైనా తోపులాటలు, తొక్కిసలాటలు జరిగినా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు, విజిలెన్స్ స్పందించి... దిద్దుబాటు చర్యలు తీసుకుంటారు. 2016లో విద్యుత్ తీగలు తగలడంతో ఇద్దరు భక్తులు మృతి చెందారు. ఇదిమినహా... ఇప్పటిదాకా కొండమీద ఎలాంటి దుర్ఘటనలో చోటు చేసుకోలేదు. తిరుపతిలో తాత్కాలిక టోకెన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, వాటికోసం భారీ సంఖ్యలో జనం తరలి రావడం, అందులోనూ సమన్వయ లోపంతో ఇప్పుడు ఈ విషాదం చోటు చేసుకుంది.



తీవ్రంగా కలిచివేసింది

తిరుపతి దుర్ఘటనపై సీఎం చంద్రబాబు ఆవేదన

అమరావతి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దుర్ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్ల కోసం వచ్చిన భక్తులు తొక్కిసలాటలో చనిపోవడం పట్ల దిగ్భ్రాంతి చెందారు. ఈ ఘటన తనకు తీవ్ర బాధ కలిగించిందని అన్నారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై బుధవారం రాత్రి డీజీపీ, టీటీడీ ఈవో, జిల్లా కలెక్టర్, ఎస్పీలతో సీఎం సమీక్ష నిర్వహించారు. దేవుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా విచారకరమని సీఎం అన్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంపై అధికారులపై తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు అధికంగా వస్తారని తెలిసినప్పుడు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు ఎందుకు చేయలేకపోయారని నిలదీశారు. ఇలాంటి చోట్ల విధుల్లో అత్యంత అప్రమత్తంగా, బాధ్యతగా ఉండాల్సిన అవసరం లేదా అని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖల మధ్య సమన్వయ లోపంపై మండిపడ్డారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై జిల్లా అధికారులు సీఎంకు వివరించగా, మృతుల సంఖ్య పెరగకుండా బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వారిని సీఎం ఆదేశించారు. టీటీడీ టోకెన్లు ఇచ్చే కౌంటర్ల నిర్వహణ, భద్రతను పునఃసమీక్షించాలని స్పష్టం చేశారు. ఘటన విషయం తెలిసిన వెంటనే అధికారులతో సీఎం ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా, టీటీడీ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, పరిస్థితిని సీఎం తెలుసుకున్నారు. ఘటనలో గాయాలైన వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీసి.. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి వెళ్లి సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తిరుపతికి మంత్రులు

సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ముగ్గురు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, అనిత తిరుపతికి హుటాహుటిన బయలుదేరారు. అక్కడ పోలీసు, రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారుల మధ్య సమన్వయం కోసం వారిని సీఎం పంపారు. గురువారం మరి కొంతమంది సీనియర్ ఐఏఎస్ అధికారులను కూడా అక్కడికి పంపనున్నారు. మూడు రోజులు అక్కడే ఉండే ఏర్పాట్లు పర్యవేక్షిస్తారు. తిరుపతిలో ఎవరూ ఊహించని సంఘటన చోటు చేసుకుందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు, బాధితులకు అండగా నిలుస్తామన్నారు.

నేడు తిరుపతికి సీఎం చంద్రబాబు

మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబు గురువారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి బయలుదేరి వెళ్లనున్నారు. తొక్కిసలాటలో గాయపడిన క్షతగాత్రులకు అందిస్తున్న వైద్య సదుపాయం గురించి వైద్యులను అడిగి తెలుసుకోనున్నారు. మధ్యాహ్నం రుయా, స్విమ్స్ ఆస్పత్రులను సందర్శించనున్నారు. తర్వాత టీటీడీ పరిపాలనా భవనంలో ఈవోతోనూ, అధికారులతోనూ సమావేశమై పరిస్థితిని సమీక్షిస్తారు.

తీవ్ర ఆవేదన కలిగించింది

» మృతుల కుటుంబాలకు డిప్యూటీ సీఎం పవన్ సానుభూతి

అమరావతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన ఘటన తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్యశాఖకు సూచించారు. మృతులు, క్షతగాత్రుల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి కుటుంబీకులకు తగిన సమాచారం ఇవ్వడం, సహాయ సహకారాలు అందించడం కోసం సత్వరమే తగిన ఏర్పాట్లు చేయాలని టీటీడీ అధికారులకు సూచించారు. అదేవిధంగా మృతుల కుటుంబాల దగ్గరకు వెళ్లి పరామర్శించి మనోధైర్యం ఇచ్చే బాధ్యత టీటీడీ పాలక మండలి తీసుకోవాలన్నారు. తిరుపతిలోని టికెట్ కౌంటర్ల దగ్గర అధికారులకు, పోలీసు సిబ్బందికి జనసేన నాయకులు, జన సైనికులు తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనలో మృతులు

బుద్దేటి నాయుడుబాబు (51) నర్సీపట్నం.
మల్లిక (47) చామరాజుపేట, తమిళనాడు.
రజని (47), శాంతి (40), లావణ్య, విశాఖ.
నిర్మల బళ్లారి, కర్ణాటక.

కంట్రోల్ రూమ్

క్షతగాత్రుల వివరాల కోసం తిరుపతి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 08772236007 నంబర్‌కు ఫోన్ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు.



తొక్కిసలాటలో సొమ్మసిల్లి పడిపోయిన మహిళలు



మృతులు బుద్దేటి నాయుడు బాబు, మల్లిక







రద్దీని కంట్రోల్ చేసుంటే..

కౌంటర్ల వద్ద కనీసం సౌకర్యాలు కల్పించలేదు, పోలీసుల నిర్లక్ష్యం బాగాఉంది. అర్ధగంట ముందుగా వచ్చిన రద్దీని కంట్రోల్ చేసుంటే కచ్చితంగా తొక్కిసలాట జరిగేది కాదు. సకాలంలో స్పందించి వుంటే కూడా ఈ దారుణం చోటుచేసుకునేదికాదు.

-సీపీ రమణ, నర్సీపట్నం

పోలీసుల వైఫల్యమే

మా కళ్లముందే మావాళ్లను తొక్కేయడం చూశా. ఇది పూర్తిగా పోలీసుల వైపల్యమే. బయట ఉన్నారే గాని పార్కు లోపలకువచ్చి కంట్రోల్ చేయలేకపోయారు.

- మునివెంకటప్ప, ఊలపాడు

స్వల్పగాయాలతో బయటపడ్డాం

అందరూ కలసి ఒక్కసారిగా గేటును నెట్టుతున్న సమయంలో పోలీసులు స్పందించి అదుపు చేసుంటే పరిస్థితి చక్కబడేది. ఈ ఘటనలో నా భార్య, బిడ్డలు స్వల్పగాయాలతో బతికి బయటపడ్డారు.

-బి.అంజప్ప, నర్సాపురం

ఉన్నతస్థాయి విచారణ చేయాలి: పురందేశ్వరి

ఏడుకొండల వాడా మమ్మల్ని క్షమించు స్వామీ.. భక్తకోటి క్షమించండి.. అంటూ తిరుపతి తొక్కిసలాట దుర్ఘటనపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పాలకమండలిని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఏడుకొండల వాడి పాదాల చెంత ఇటువంటి దుర్ఘటన జరగడం తీవ్ర మనస్తాపం కలిగించిందని బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు.

దురదృష్టకరం: ఎంఎస్ రాజు

తిరుపతిలో తొక్కిసలాటలో భక్తులు మృతిచెందడం బాధాకరమని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. ఆ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి లోను చేసిందన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. భక్తులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

తొక్కిసలాట ఘటన బాధాకరం: ప్రధాని మోదీ

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని, బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తోందని పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి: రాహుల్

తిరుపతి తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని నింపిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి ఘటన జరగడం బాధాకరమని, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో బాధితులకు అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రాహుల్ పిలుపునిచ్చారు.

చైర్మన్ రాజీనామా చేయాలి

» బీసీవై అధ్యక్షుడు రామచంద్ర యాదవ్

తొక్కిసలాటలో స్వామి వారి భక్తులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ ఛైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేయడంలో టీటీడీ అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు. వైకుంఠ ద్వార దర్శనాలు జరిగినన్ని రోజులు మరింత అప్రమత్తంగా ఉంటూ సామాన్య భక్తులకు దర్శనం కల్పించాలన్నారు.

టోకెన్లతో తంటా!

వైసీపీ హయాంలో కొత్త పద్ధతి

» పదిరోజులు వైకుంఠ ద్వార దర్శనం

» టోకెన్ల జారీ కేంద్రాలు ఏర్పాటు

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

బుధవారం జారీ చేసేది 38వేల టోకన్లు... వాటికోసం పెద్ద సంఖ్యలో భక్తులు! ఎదురు చూపులు, క్యూలు, తొక్కిసలాటలు... చివరికి కనీవినీ ఎరుగని రీతిలో మృత్యుఘోష! అసలు తిరుమలలో వైకుంఠ ఏకాదశి దర్శనాలకు టోకెన్లు జారీ చేసే పద్ధతి అనేక ఇక్కట్లకు కారణమవుతోందని సీనియర్ అధికారులు చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంకు ముందు వైకుంఠ ఏకాదశి, మరుసటి రోజైన ద్వాదశి... రెండురోజుల్లోనే వైకుంఠద్వార దర్శనాలు ఉండేవి. దీనికోసం ఆన్‌లైన్‌లో రూ.300 దర్శన టికెట్లు జారీ చేసేవారు. సర్వ దర్శనానికి నేరుగా వైకుంఠం క్యూ కాంప్లెక్సు ద్వారా ఉచిత దర్శనానికి అనుమతించేవారు. అప్పట్లో ఎలాంటి టోకెన్ల జారీ కేంద్రాలూ ఉండేవి కావు. సాధారణ తోపులాటలు మినహా విషాదాలకు తావే లేదు. కానీ... వైసీపీ సర్కారు వచ్చాక ఎక్కువ మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాలు ఇప్పించామని గొప్పలు చెప్పుకోవడానికి... వైకుంఠ ద్వారాలను ఏకంగా పది రోజుల పాటు తెరవాలని అప్పటి టీటీడీ పాలకవర్గం, అధికారులు నిర్ణయించారు. 2022 నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేశారు. ఆ ఏడాది నుంచీ తిరుపతిలో 8, తిరుమలలో 1 చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేసి... టోకెన్లు జారీ చేయడం మొదలు పెట్టారు. ఈ విషయం విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భారీగా భక్తులు రావడం మొదలైంది. టోకెన్ల కోసం ఒకరోజుముందే వచ్చి క్యూ లైన్లలో పడిగాపులు కాయడం, తొక్కిసలాటలు జరగడం సర్వ సాధారణంగా మారింది. 2022లోనే తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, గోవిందరాజస్వామి పాత సత్రాల ఆవరణలోని కౌంటర్ల వద్ద తొక్కిసలాటలు జరిగి పలువురు భక్తులు గాయపడ్డారు. కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. వారిని అధికారులు హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. తర్వాతి రెండేళ్లూ తొక్కిసలాటలు జరిగాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం వచ్చినా... భక్తుల నుంచి వ్యతిరేకత వస్తుందనే భయంతో ఆ విధానాన్నే కొనసాగించింది.

ప్రచారం ఘనం... మరి ఏర్పాట్లు?

వైకుంఠ ఏకాదశి విషాద ఘటన వెనుక టీటీడీ అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. 7లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామని, అందుకు తగిన ఏర్పాట్లు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశామని కొద్ది రోజులుగా ఈవో, ఛైర్మన్‌లు పదేపదే చెబుతూ వచ్చారు. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. శ్రీవారి సేవకులు, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వాస్తవానికి గతఏడాది తిరుపతిలో ఎన్ని టోకెన్ల జారీ కేంద్రాలు ఏర్పాటు చేశారో... ఈసారీ అన్నే ఏర్పాటు చేశారు. అదనంగా ఒక్కటీ పెట్టలేదు. భద్రతాపరంగానూ పెద్దగా చర్యలు తీసుకున్నట్టు కనిపించలేదు. టీటీడీ పాలకవర్గం, అధికారులు చేసిన ప్రకటనలు విస్తృతంగా ప్రచారం కావడంతో భారీగా భక్తులు తరలి వచ్చారు. ఈ సంఖ్యను అంచనా వేయడంలో టీటీడీ, పోలీసు వర్గాలు విఫలమయ్యాయి. దానికి తగ్గట్టు భద్రతను ఏర్పాటు చేయడం, ముందు జాగ్రత్తగా అంబులెన్సులు వంటివి అందుబాటులో ఉంచకపోవడంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది.

అడ్మినిస్ట్రేషన్ లోపం వల్లే!

తొక్కిసలాటకు బాధ్యత అధికారులదే

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలకు టోకెన్ల జారీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనకు అడ్మినిస్ట్రేషన్ లోపమే కారణం కావచ్చని టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తోపులాటల్లో భక్తులు చనిపోవడం దురదృష్టకరమని, జరగరానిది జరిగిందని విచారం వ్యక్తం చేశారు. 'టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత అడ్మినిస్ట్రేషన్ లోపం కారణంగా జరిగిందని నాకు అనుమానం ఉంది. ఘటనకు బాధ్యత అధికారులదే కదా. మంగళవారం కూడా నేను అధికారులతో సమావేశమై ఆషామాషీగా తీసుకోవద్దని చెప్పాను. గొడవలు జరుగుతాయని నాకు సమాచారముందని హెచ్చరించాను. ఐదు వేలమంది పోలీసులను పెట్టామని, చూసుకుంటామని అధికారులు చెప్పారు. టోకెన్లు జారీ చేసే ఒక సెంటర్‌లో ఓ మహిళ అస్వస్థతకు గురైన క్రమంలో ఆమెను బయటకు తీసుకువచ్చేందుకు అక్కడున్న డీఎస్పీ గేట్లు తెరవడంతో భక్తులు ఒక్కసారిగా ముందుకు రావడంతో తోపులాట జరిగింది. అందులో ఆరుగురు చనిపోయినట్టు తెలిసింది' అని బీఆర్ నాయుడు అన్నారు.





క్షతగాత్రులకు సేవలందిస్తున్న పోలీసులు, బంధువులు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.